# కథా మంజరి

పది కథల సమాహారం




## కథా మార్గదర్శి


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త


ఫిబ్రవరి 2021 సంచిక

© Copyright 2020 - Editorial Board Kathamanjari


కథా మంజరి
సుస్వాగతం




# ఉగాది హాస్య కథల పోటీ

అలనాడు, ఇలనాడు కూడా హాస్యానికి తెలుగునాట పెద్దపీట వేసారు. తెలుగుభాషలో పదాల అల్లిక నుండి, తెలుగు జీవితాల సరిగమల వరకు హాస్యం నిత్య నూతనంగానే మనకి సాక్ష్యాత్కరిస్తూనే ఉంటుంది. హాస్యం మన జీవితాలలో ఓ భాగమై, నిత్యం కావాలనిపిస్తుంది. కొత్తదనం కోసం ఎదురు చూసేటట్టు హాస్యం మనల్ని నడిపిస్తూనే ఉంటుంది.

అసలు హాస్యం సున్నితంగా మదిని తాకుతుంది. భళ్లున నవ్విస్తుంది. అలాగే హాస్య రచనలను చదువుతుంటే, అసంకల్పితంగా నవ్వు వచ్చేస్తుంది. ఆ కథలో సన్నివేశమో, సంభాషణో జ్ఞాపకం వచ్చినప్పుడల్లా నవ్వు వస్తూనే ఉంటుంది. అలా హాస్యాన్ని అలరించే కథలను ఈసారి శ్రీ ప్లవ నామ ఉగాదికి కథా మంజరి పాఠకులకు అందించాలనే ఉద్దేశంతో "ఉగాది హాస్య కథల పోటీ" ని నిర్వహిస్తున్నాం.

**బహుమతులు**

మొదటి బహుమతి : ₹ 5000/-

రెండవ బహుమతి : ₹ 3000/-

మూడవ బహుమతి: ₹ 2000/-

12 ప్రత్యేక బహుమతులు: ₹ 500/- చొప్పున

నిబంధనలు:

1) కథాంశం తెలుగువారి నేపధ్యంలో ఉండాలి. హాస్యం ముసుగులో అశ్లీలతకి, వివాదాలకు చోటు ఇవ్వకుండా, హాయిగా అందరూ చదువుకునేటట్టు ఉండాలి.
2) హాస్యం హాస్యాస్పదం కాకుండా ఏ వర్గాలను కించపరచకుండా ఉండాలి.

3) కథ నిడివి 1200 పదాలు మించకుండా ఉండాలి.
4) కథతో పాటు స్వీయ రచన అని, దేనికి అనుసరణ గాని, అనువాదం గాని కాదని, ఏ ఇతర పత్రికలలో పరిశీలనలో లేదని, ఇతర మాధ్యమాలలో ప్రచురితమవలేదని, హామీపత్రం విధిగా జత చేయాలి.
5) కథని word లో Unicode లో టైపు చేసి submit@kathamanjari.in కు ఇమెయిల్ ద్వారా మాత్రమే పంపాలి.
6) కథని పంపే ముందు అక్షర దోషాలు లేవనీ, విరామ చిహ్నాలు సరిగా ఉన్నాయనీ ధృవపరుచుకోండి.
7) ఒక రచయిత(త్రి) ఎన్ని కథలైనా పంప వచ్చును.
8) కథలు మాకు ఇమెయిల్ ద్వారా అందడానికి చివరి తేది. 15.03.2021 రాత్రి 11 గంటలు.
9) పోటీకి వచ్చిన కథల్లో తగిన ప్రమాణంలో బహుమతులు పొందే అర్హత లేని సందర్భంలో, పోటి విషయంలో తగిన నిర్ణయం కథా మంజరి తీసుకొని పత్రికా ముఖంగా తెలియ చేయడం జరుగుతుంది.
10) ఈ పోటీకి సంబంధించి ఏ విధమైన ఉత్తర ప్రత్యుత్తరములకు, ఫోన్ ద్వారా గాని, ఇమెయిల్ ద్వారా గాని చేయడానికి తావులేదు.
11) పోటి నిర్వహణ విషయంలో కథా మంజరి కార్యవర్గానిదే తుది నిర్ణయం.

ఈ బహుమతులు పొందిన కథలతో కథా మంజరి ఏప్రిల్ 2021 సంచిక "శ్రీ ప్లవ నామ ఉగాది ప్రత్యేక సంచిక" గా ఏప్రిల్ 13వ తేదిన విడుదలవుతుంది.

ఈ పోటీలో రచయిత(త్రి)లు విరివిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాం!


**కథా మంజరి బృందం**

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ సంఖ్య |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథా కీయం | | iii |
| IV | ఈ నెల విశిష్ట అతిథి | | v |
| V | కథా మార్గదర్శి | | viii |
| | **కథలు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ సంఖ్య |
| 1. | ఈర్ల పెట్టె | భాగవతుల భారతి | 01 |
| 2. | సౌందర్యారాధన | సి హెచ్ వి ఎస్ ఎస్ పుల్లం రాజు | 05 |
| 3. | సెల్ తంత్రం | కనిగిరి రాజేశ్వరి | 10 |
| 4. | పరిష్కారం | సుగుణ విష్ణుభట్ల | 13 |
| 5. | తరువాతేమిటి | సునీత పోతూరి | 17 |
| 6. | సొంత గూటికి | తెలికిచర్ల విజయలక్ష్మి | 21 |
| 7. | పండగ సందడి | బి లక్ష్మి శర్మ | 25 |
| 8. | వచ్చేది ఉంటే | పి ఎల్ ఎన్ మంగారత్నం | 31 |
| 9. | అదృష్ట పరీక్ష | మంగు శివరామప్రసాద్ | 35 |
| 10. | **ఉర్రేయ్ కుంచెం ఆగు...** | వసుంధర | 41 |
| VI | వినదగునెవ్వరు చెప్పిన .. | | xii |


ఈనాటి విశిష్ట అతిథి వసుంధర గార్లు తమ అభిమాన రచయితకి తమదైన శైలిలో ఓ కథ ద్వారా నివాళులు అర్పించారు. ఆ కథనే ఈ పత్రికలో పదో కథగా మీకు అందించడానికి అభిమానంతో అందించిన వారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాం. అలాగే ఈ సంచికలో కథలను ఎంపిక చేసి, వాటిమీద చక్కటి సంగ్రహ వాక్యాలు కూడా వారు అందచేసారు. ఆ వాక్యాలను కథల మొదటి పేజీలలో వేసాం.

# ఇంకా మా జట్టు



## సాంకేతిక సహకారం

AgradootWeb
Thought. Design. Commitment.

## బొమ్మలు

శ్రీ కోయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

# కృతజ్ఞతలు

## SPONSORS


## ఈ సంచికకు ఆర్ధిక సహకారం

## OF THE ISSUE

**కీ.శే. చాగంటి సుబ్రహ్మణ్యం గారు**

**కీ.శే. చాగంటి వెంకట రమా దేవి గారు**

స్మృత్యర్థం వారి కుమారుడు





# "కథా" కీయం



ఆ మధ్య ఓ ఔత్సాహికుడు సేకరించిన సమాచారం ప్రకారం తెలుగునాట ముద్రణ నోచుకుంటున్న ఓ అరడజను పత్రికలు, ఏభైకి అటు ఇటుగా అంతర్జాలాలలో నడిచే పత్రికలు ఉన్నాయని తెలిసింది. వీటిలో వార, మాస, త్రైమాసిక పత్రికలు ఉన్నాయి. అంటే సుమారుగా ఏభై పత్రికలు పాఠకుల ముందుకు ఏదో ఓ రూపంలో వస్తున్నాయి. ఓ విధంగా, పత్రికలు ఆంధ్రదేశంలో బాగా ప్రాచుర్యంలో ఉన్న కాలంలో కూడా ఇన్ని పత్రికలు లేవనే చెప్పాలి. ఏదైతేనేమి.. వీటిలో సరాసరి నాలుగు కథలు ఓ పత్రికలో ఉంటాయని అనుకుంటే, ఒక నెలలో సుమారుగా రెండు వందల కథలు తెలుగువారికి చేరుతున్నాయన్నమాట! ఇవి కాకుండా ఫేస్ బుక్, వాట్సాప్ వంటి సాంఘిక మాధ్యమాలలో కూడా కథలు విరివిగానే వస్తున్నాయి. అయితే.. ఈ కథారచనలు సాగిస్తున్న తెలుగు రచయితలు ప్రస్తుతం ఎంతమంది ఉన్నారనే విషయం మీద ఎక్కడా ప్రామాణికంగా సేకరణ చేసిన దాఖలు లేవు గాని, సుమారుగా వెయ్యి మంది రచయిత(త్రి)లు కథా రచనలు చేస్తున్నారని రచయితల సమూహాల భోగట్టా. వారిలో ఎక్కువ శాతం మంది ఏభై ఏళ్ల పైచిలుకు వయసులో ఉన్నారని, ముప్పై ఏళ్ల లోపు ఉన్న రచయితల్ని వేళ్లతో లెక్కించుకోవచ్చనీ వారి సమాచారం.

అయితే కథలలో 'రాసి' బావున్నా, 'వాసి' అంతగా బావుండలేదనే అభిప్రాయాన్ని.. అటు పాఠకులూ, ఇటు పెద్దలూ అభిప్రాయపడుతున్నారు. వారి అభిప్రాయంలో చెప్పాలంటే.. వ్రాసేవారు, ఎక్కువగా చదవాలి. చదివినది ఆకళింపు చేసుకోవాలి. కొంతమేర కొంతమందికి సహజ సిద్ధంగా రచనలు చేయడం వచ్చినా, ఆ రచనలకు మెరుపు ఎక్కువ చదవడం వలననే వస్తుంది. కాలానుగుణంగా కథావస్తువు వస్తుంది, రావాలి కూడా. ఎత్తుగడ కథ చదవడానికి దోహదపడాలి. గమనం పాఠకుడ్ని కట్టిపడేయ్యాలి. ముగింపు మనసులో నిలిచిపోవాలి. ఇలా రాయలంటే రచయితలు బాగా చదవాలి, భాషా పరిజ్ఞానంతో పాటు కథాంశాల మీద పట్టు ఉండాలి, సహజత్వానికి దగ్గిరగా ఉండాలి. ఈ లక్షణాలు బాగా లోపిస్తున్నాయనే అభిప్రాయం పెద్దలు చాలా సందర్భాలలో చెబుతూనే ఉన్నారు. డెబ్బై ఐదు సంవత్సరాలు పై చిలుకు ఉన్న తెలుగు కథా రచయితలు, ఇప్పటికీ ఒక కథ రాయడానికి ముందు ఎన్ని విధాల ఆలోచిస్తారో, ఎంత శ్రమిస్తారో తెలుసుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఎనభై రెండేళ్ళ ఓ ప్రఖ్యాత రచయితని "కథా మంజరి" విశిష్ట అతిథిగా

ఆహ్వానించినప్పుడు.. "పోటీకి ఓ నవల రాస్తున్నాను. నాలుగు నెలల వరకు ఖాళీ లేదు. అన్యథా భావించకండి!" అని చెబితే , మాకు చాలా ఆనందం వేసింది. అలాంటి దీక్షకు తెలుగు నేల ఏమిచ్చి ఋణం తీర్చుకోగలదు!

సరే.. ఇక వర్తమానంలో మన విషయాలు చెప్పుకుంటే.. ఈ నెల పరిశీలన కోసం మాకు వచ్చిన కథలు పదకొండు మాత్రమే. అంతకీ.. విజ్ఞప్తులు, వినతులు రచయిత(త్రి)లకు పలు దఫాలుగా వ్యక్తిగతంగా కూడా పంపడం జరిగింది. చివరికి మాకు చేరిన వాటిలోనే ఎంపిక అనివార్యం అయింది. ఇంచుమించు కథలన్నీ – "కథనంలో ఇంకా సానబెట్టాల్సిన వజ్రాలు" అంటూ, న్యాయనిర్ణేతగారు ఓ సూచన చేసారు. ఈ సూచన రచనలు చేసే వారందరూ శిరసావహించాల్సినది. కథాంశాలు, కథనం, శిల్పం, కథావస్తువులను పక్కన పెడితే, అసలు పంపుతున్న కథల్లో టైపింగు తప్పులు, విరామ చిహ్నాల వాడుకలో చెప్పలేనన్ని లోపాలు కనబడుతున్నాయి. ఈ నెలలో వచ్చిన ఓ కథలో సుమారు ఏడెనిమిది వందల చుక్కలు ఎక్కడ పడితే అక్కడ పెట్టి పంపారు. వంటకం రుచి చూసే ముందు అందంగా కనబడాలి. కథ కూడా అంతే!! పాఠకుడు హాయిగా చదివేటట్టు కథల్ని తీర్చిదిద్ది, ముస్తాబు చేసి ప్రచురిస్తున్నాం. కనీసం ఆ మార్పులను, చేర్పులను గమనించి, మరో రచన చేసినప్పుడు ఆ పొరపాట్లు జరగకుండా, ఆయా రచయితలు జాగ్రత్తలు తీసుకుంటే, తెలుగు కథ నిలబడుతుంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడం తప్పు కాదు, కాని వాటి చెప్పుచేతల్లో సాహిత్యాన్ని బలి చేయడం చట్టాలకి అందని నేరం. అన్యాయం! మీ చేతుల్లోంచి బయటకు పంపే ముందు, మీ కథని ఒక్కసారి చదవండి.

తెలుగు అక్షరాన్ని, పదాన్ని, వాక్యాన్ని.. అందంగా అమర్చితే మంచి కథకి రూపు వస్తుంది! ఆ రూపమే వచ్చే తరానికి ఆస్తి అవుతుంది!

ఈ ఆస్తి సంపాదనకు మీరు, మేము .. మనందరం చేతులు కలిపి ముందుకు నడుద్దాం! అసాధ్యాన్ని సుసాధ్యం చేద్దాం!!

***0***

# విశిష్ట అతిథి



# వసుంధర

"నిజమైన రచయిత తన రచనకే తప్ప, వ్యక్తిగా గుర్తింపు కోరడు." అనే అభిప్రాయాన్ని సున్నితంగా సుతిమెత్తగా చెప్పినా.. ఎంతో స్ఫూర్తినిచ్చే ఆ మాట వెనుక, ఆరు దశాబ్దాల తెలుగు కథా ప్రవాహాలు ఉన్నాయి, అపారమైన జ్ఞాన సంపదలు ఉన్నాయి, అమితమైన కలుపుగోలుతనాలు ఉన్నాయి. అంతకు మించి ఉన్నతమైన ఆశయాలతో కూడిన అతి సామాన్యమైన మానవ మూర్తులున్నారు. ఈ బహువచన ప్రయోగానికి కారణం వారి మాటల్లో 'నా' వినబడదు, 'మా' వినబడుతుంది. ఒకరిలో ఇరువురు, ఇరువురు లో ఒకరై, తెలుగు సాహితీ ప్రపంచానికి ఒక పేరుతోనే రచనలు అందించే ఆ ఆదర్శ దంపతులే "వసుంధర". వారిని పరిచయం చేయడం సూర్యునికి దివిటీ చూపించడమే అయినా.. ఓ అరుదైన అవకాశం "కథా మంజరి" కి దక్కింది.

శ్రీ జొన్నలగడ్డ రాజగోపాలరావు, శ్రీమతి జొన్నలగడ్డ రామలక్ష్మి దంపతులు ఇరువురూ ప్రసిద్ధ రచయితలే. ఎవరు ఏది రాసినా 'వసుంధర' రచనగానే మనకి సాక్షాత్కరిస్తుంది. దాంపత్యంలోనే కాదు, సాహితీ జీవితంలో కూడా ఆదర్శంగా ఉండే 'వసుంధర' లో ఒక భాగమైన రాజగోపాలరావు గారి స్వస్థలం తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రాపురం. ఎమ్.యస్సీ. చదివి, భువనేశ్వర్ లో రీజనల్ రీసెర్చి లేబొరేటరీలో డిప్యూటీ డైరెక్టర్ గా పదవి విరమణ చేశాక, హైదరాబాదులో విశ్రాంత జీవితం గడుపుతున్నారు. మొదటి కథ 1963లో ఆంధ్ర సచిత్ర వారపత్రిక లో వచ్చింది. ఇక 'వసుంధర'లో మరో

భాగమైన రామలక్ష్మి గారి స్వస్థలం కూడా తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ. వీణలో పిజి డిప్లొమా చేసిన గృహిణి. వీరి మొదటి కథ 1974లో తరుణ మాసపత్రికలో వచ్చింది.

"వ్యక్తిత్వంలో ప్రత్యేకత సాధించడానికి ప్రయత్నిస్తాను కాని, వ్యక్తిగా ప్రత్యేకత నా మనస్తత్వానికి సరిపడదు. నన్ను ఫలానా వారి అబ్బాయి, లేదా ఫలానా ఆయన మనవడిగా గుర్తింపు పొందడం నాకు చాలా ఇష్టంగా ఉండేది. రెండు మూడు కథలు నా పేరుతో పడగానే నేనా ఇష్టానికి దూరమయ్యానని అనిపించి, వెంటనే 'వసుంధర' కలం పేరు పెట్టుకున్నాను." అంటూ ఆనందంగా కలం వెనుక కథ చెప్తారు రాజగోపాలరావు గారు. 1962లో ఆంధ్రప్రభలో బోడపాటి హరికిషన్, దమయంతి లు రాసిన 'లోకం పోకడ' అనే నవల వచ్చింది. అందులో ఓ పాత్ర పేరది. 1966 లో వివాహం అయిన తర్వాత, జీవితంలో పాటు, 1974లో 'వసుంధర' లో కూడా అడుగు పెట్టారు రామలక్ష్మి గారు.

'చందమామ' కథల నుంచి 'సినిమా' కథల వరకు వీరు సృజించని కథాంశం లేదనే చెప్పాలి. అసంఖ్యాక మైన కథలు, నవలలు, వ్యాసాలు, కవితలు వీరి కలాలనుంచి జాలు వారి, తెలుగునాట ఆనాటి నుంచి నేటి వరకు వెలువడిన అన్ని పత్రికలలో ప్రచురించబడ్డాయి... బడుతున్నాయి. అంతే కాదు, చిన్నప్పుడు సెలవుల్లో 'పేరవరం సమాచారం' అనే లిఖిత దినపత్రిక, భువనేశ్వర్లో ఉద్యోగం చేస్తుండగా 'ప్రవాసి' అనే లిఖిత త్రైమాసిక పత్రికను స్వయంగా రాసి నడిపించారు. ఇవే కాకుండా.. తాను పనిచేసే సంస్థ హౌస్ మాగజైన్ లకు సంపాదకత్వం వహించి నడిపించారు. అటు ఉద్యోగం, ఇటు సంసారంతో పాటు రచనా వ్యాసంగంలో చిత్తశుద్ధితో ముందుకు నడచి, ప్రతి నిముషాన్ని సద్వినియోగం చేసుకున్నారు. నేరుగా, చిత్తు ప్రతి లేకుండా వేగంగా రచనలు చేసే వసుంధరగారికి, 1982 లో ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన ఉగాది నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన 'మొక్కలు పిలుస్తున్నాయి" నవలను వ్రాయడానికి మూడు వారాల లోపే సమయం పట్టింది. చందమామ పత్రిక వీరికి ఓ ప్రత్యేకతనిచ్చింది. అప్పుడు చందమామ సంపాదకులు, ప్రఖ్యాత రచయిత కొడవటిగంటి కుటుంబరావు గారు వీరిని ఒంటి చేత్తో ఆకాశానికి ఎత్తేయడం చిరస్మరణీయం అని వసుంధరగారు ఆనందంగా తలుచుకుంటారు ఆ రోజుల్ని! "వసుంధరగారి రచనలలో పాత్రల వేష భాషలు, సన్నివేశాలు, పరిసరాల వర్ణణలు కథనానికి బ్రేకులు వెయ్యవు. సంభాషణలకు, మనో విశ్లేషణలకు ప్రాధాన్యత ఇస్తాయి. అందుకే వీరి రచనలు వేసుకోవడం తమకు గర్వకారణం" అని వేమూరి సత్యనారాయణగారు (జ్యోతి మాసపత్రిక) అంటూండేవారు. 'స్వాతి' వేమూరి బలరాం గారు, 'విజయ' విజయ బాపినీడు గారు, 'రచన' సాయిగారు... "ఈ ముగ్గురితో అనుబంధానికి ముందు ముఖపరిచయం కూడా లేకపోవడం ఆశ్చర్యమైతే, ఆ అనుబంధం ఇప్పటికి చెక్కు చెదరకుండా కొనసాగడం మా అదృష్టం" అని వసుంధరగారు అంటారు. తెలుగు కథ రచనలో అగ్రగణ్యులు అని మనం గర్వంగా చెప్పుకోదగ్గ ప్రసిద్ధ రచయితలు శ్రీ కాళీపట్నం రామారావు గారు, కీ.శే. అవసరాల

రామకృష్ణారావుగారు, కీ.శే. ముళ్లపూడి వెంకటరమణ గారు.. వీరి కథలను, నవలలను చదివి పొగడ్తలతో ముంచెత్తడం జీవితకాలానికి సరిపడ్డ అనుభూతిని ఇచ్చిందని కూడా వీరంటారు.

"చెట్లు పూలు పూసినట్లు, మేఘాలు వర్షించినట్లు... రచన రచయితకు ప్రకృతి సహజం. ఉద్యమాలు, సిద్ధాంతాలు ఆ సహజత్వంలో భాగం కావచ్చు. కాని అవి కట్టుబాటులై శాసిస్తే మాత్రం రచయిత ప్రచారకుడౌతాడు. తెలుగు సాహిత్యానికి ఉద్యమాలందించిన రచనల్లో ఆణిముత్యాలు అసంఖ్యాకం. కాని ఉద్యమాల కట్టుబాట్లు ఎందరో రచయితల అపూర్వ కల్పనాశక్తికి ప్రతిబంధకాలవడం తెలుగు సాహితి దురదృష్టం.. అంటూ రచయితల గురించి విశ్లేషణాత్మకంగా చెప్పే వసుంధరగారికి లలిత సంగీతం వినడం అంటే ఇష్టం. పాటలు వ్రాసి, బాణీలు కట్టి పాడించడం ఇష్టం. తెలుగు, హిందీ సినిమా పాటలంటే మోజు కూడా ఉంది. అలనాటి బినాకా గీత్ మాలా పాటలు విని, వాటి రాంకింగ్ వివరాలు వ్రాసుకున్న పుస్తకాలు ఇప్పటికి వారింట్లో ఉన్నాయి.

“రచయితలకు వేదికనిచ్చేవి పత్రికలు. పత్రికల్ని నిర్వహించేది సంపాదకులు. వారు రచయితలకు సృష్టి, స్థితి కారకులని ఎంతో ఉదాత్తంగా ప్రతి పత్రికా సంపాదకుడికి పేరు పేరునా నీరాజనం ఆర్పించే”.. ఈనాటి కథా మంజరి విశిష్ట అతిధులైన వసుంధరగార్లకు ఈ నాలుగు పరిచయ వాక్యాలతో కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం!

**కథా మంజరి బృందం**

***0***

# కథా మార్గదర్శి



# శ్రీ ముళ్ళపూడి వెంకట రమణ గారు

1960లలో తెలుగు పత్రికా పాఠకలోకాన్ని హాస్య, వ్యంగ్య రచనల ప్రభంజనమై తాకిన ముళ్లపూడి వెంకటరమణ (రమణ), మాకు కేవలం తన రచనలతోనే పరిచితులు. వారిని మేము ఫొటోల్లోనూ, మీడియాలోనూ చూడ్డమే తప్ప స్వయంగా కలుసుకోలేదు. కానీ వారి రచనలు మాకు గురు, స్నేహ, ఆరాధనా, ఆత్మీయతానుభూతినిచ్చాయి. ఆయన కలం సృజించిన ప్రతి పాత్రకూ తన కుంచెతో రూపకల్పన చేసి, పాఠకుల మనసుల్లో సుస్థిరం చేసిన ప్రముఖ చిత్రకారుడు బాపు ఆయనకు బాల్యమిత్రుడు. బాపు-రమణలుగా జంటగా అవినాభావమైన, వారి అనుబంధం స్నేహానికి నిర్వచనం. ఎవరి గురించి వ్రాసినా, రెండోవారు అంతర్లీనం.

అప్పట్లో ఆంధ్రపత్రిక సీరియల్ 'బుడుగు చిచ్చర పిడుగు'- గురించిన ప్రకటన బుడుగు భాషలోనే- 'ఉర్రేయ్ కుంఛెం ఆగు' అనే శీర్షికతో బాక్సులో ఆకర్షించేది. అందులో 'నేనేమన్నా చిన్నవాడినా చితకవాడినా' అనుకునే నాలుగైదేళ్ల బుడుగు. వాడికో గర్ల్ ఫ్రెండ్ 'సీ గానపెసూనాంబ'. 'హారి పిడుగా' అనే బామ్మ. తలిదండ్రులు రాధా, గోపాలం. ముచ్చటైన ఓ రెండు జెళ్ళ సీత. ఆమెను మెప్పించాలని తాపత్రయపడే ఓ బాబాయి. ఇంకా 'పక్కింటి లావుపాటి పిన్నిగారు'. అన్నీ కుటుంబ పాత్రలు. మన బాల్యపు ఆలోచనల్ని

ప్రతిఫలించే బుడుగు మాటలు. నేటి 'క్లాసు పీకడం' లాంటి మోటు మాటకి, దీటైన నీటైన ప్రత్యామ్నాయంగా 'ప్రైవేటు చెప్పడం'. చదువుతుంటే ముసి ముసినించి, ఘొల్లు దాకా నవ్వుల జల్లులు. మా తరంలో వచ్చిన ఆ రచన – మా ఇంట్లో వరుసగా తర్వాతి రెండు తరాల్ని అప్పట్లాగానే అలరిస్తున్న నిత్య నూతనం.

ప్రేమకథల్ని హాస్యభరితం చేసిన రమణ ఒరవడిని అనుసరించి పేరు గడించినవారిలో కొందరు ఇప్పటికీ ఉన్నారు. వారి 'ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ' చతురోక్తులు ఇప్పటికీ సినిమాల్లో వినిపిస్తున్నాయి. ఏకలవ్యుడు (ఒకరినే ప్రేమించిన వాడు) కథ - సూర్య నమస్కారాలు, వరలక్ష్మీవ్రతం వంటి పద విన్యాసాలతో, అతిశయోక్తులతో అలరించి, ఆరంభాన్ని ముగింపుతో అన్వయించిన తీరులో పండిన హాస్యం- తదుపరి శకంలో జంధ్యాల సినిమాలకు ప్రేరణ అయింది. ప్రస్తుతం అమెరికాలో ఉద్యోగం చేస్తున్న మా మనవడీ కథని ఇప్పుడు చదివి - ఇది అప్పటి కథా అని - రమణ భాషలో 'హాచ్చర్యపడిపోయేశాడు'.

అప్పు చెయ్యడమొక కళ అనే అప్పారావుతో 'ఋణానందలహరి', సినీరంగంలో అవకతవకల్ని అప(రిమిత) హాస్యం చేసిన 'విక్రమార్కుడి మార్కు సింహాసనం', రాజకీయాల లోతుని స్పృశించిన 'రాజకీయ బేతాళ పంచవింశతిక' – తెలుగు సాహిత్యంలో హాస్య, వ్యంగ్య సృజనకు పరాకాష్ఠ. కర్ణుడికి కవచకుండలాల్లా హాస్య వ్యంగ్యాలు ఆయనకు పుట్టుకతో వచ్చాయి. జీవితంలోంచి పుట్టడంవల్ల రమణ హాస్యంలో ఎంత 'అతి' ఉన్నా వెకిలిగా అనిపించదు. ఐతే భాషమీద పట్టు, పాండిత్యం, కావ్య జ్ఞానం – ఆయన కథన చాతుర్యాన్ని అన్ని రసాలకూ విస్తరింపజేశాయి.

ఆయనకు సాహిత్య అకాడమీ అవార్డు 'సీతాకల్యాణం' కథాసంపుటికి వచ్చినట్లు గుర్తు. భక్తి గౌరవాల సమ్మేళనమైన 'సీతాకల్యాణం' శైలి గంభీరం. వాగ్దానం చిత్రంలో హరికథలో మెరిసిన జంధ్యాల పాపయ్య శాస్త్రి పద్యమంత హృద్యం. 'ఆకలీ ఆనందరావూ' కన్నీళ్లు పెట్టించే విషాదం. పరిశీలనకు భావుకతని జోడించిన- లౌకిక కథ 'ప్రయోజకుడు'లో– సుబ్రహ్మణ్యంగారికి ఆపుకోలేని నవ్వు వస్తే- 'ఆయన అంత హృదయ పూర్వకంగా నవ్వి చాలా కాలం అయింది. ఆ నవ్వుకి పచ్చగా దోసకాయ వలె వెండి మీసాలలో నిండుగా ఉన్న ఆయన ముఖం ఎర్రగా అయిపోయింది. ఫాలభాగాన కణతలమీదా రక్తనాళాలు ప్రస్ఫుటంగా కనబడ్డాయి. కంటనీరు తిరిగింది'. భార్యను, 'సీతా సావిత్రీ సువర్చలా - సుబ్బారావు గారి ఎంకీ – మా కాముడి ముందు తీసికట్టే' అని పొగిడినప్పుడు, 'పండు తమలపాకు వంటి కామేశ్వరమ్మగారి శరీరం ఆపాదమస్తకం జలదరించింది. సంధ్యా సమయాన, ఎర్రని కాంతులతో వెలిగే ఆకాశ ఫలకాన సూర్యబింబం వలె సిగ్గుతో కందిపోయి ఎర్రబారిన ఆమె విశాలమైన నుదురుపైన వెండి రూపాయంతటి కుంకుమ తిలకం ప్రకాశించింది. పండబారిన ఆమె శిరోజాలు ఆ అరుణ రాగంలో పాలిపోయాయి. పాతిక సంవత్సరాల క్రితం

తొలిసారిగా సిగ్గుతో వాలిన ఆమె, సుందర సువిశాల నేత్రాలు, ఆనాడు ఆమెలో తను చూచిన దేవతల అందం, తిరిగి, ఈ క్షణాన, ఒకే ఒక ముహూర్త కాలం పాటు సుబ్రహ్మణ్యం గారికి గోచరించాయి'.

రమణది బహుముఖ ప్రజ్ఞ. అన్నింటా హాస్యానికి పెద్ద పీట. ఆంధ్రపత్రికలో ఆయన వ్రాసిన సినిమా రివ్యూలు లోతైనవి, ఘాటైనవి, కవ్విస్తూనే నవ్వించేవి. 1963లో జ్యోతి మాసపత్రిక ఆవిర్భవించినప్పుడు యూనివర్సిటీలో అదో పెద్ద సంచలనం. అందులోని కథలు, కార్టూన్లు, శీర్షికలు వగైరాలు విద్యార్థుల్లో చర్చనీయాంశం. ఆ పత్రిక సంస్థాపకులు రాఘవయ్య గారైనా, అప్పట్లో అందరూ దాన్ని బాపు-రమణల పత్రికగానే చెప్పుకునేవారు. పత్రికా నిర్వహణలో, ప్రచారంలో వారి ప్రతిభ అసాధారణం.

జీవితంలో అనుకున్నవి సాధించడానికి, అభిరుచి విషయంలోనూ కొంత సర్దుబాటు తప్పదు. తెలుగుతనాన్ని మించి సినిమాల్ని ప్రేమించే తెలుగువారికి బాగా దగ్గర కావాలన్న అభిలాషతోనే- సాహిత్యాన్నీ, పత్రికల్నీ కూడా పక్కన పెట్టి రమణ సినీ ప్రస్థానానికి పూనుకున్నారనిపిస్తుంది. ఐతే తన రచనల్లో, సమీక్షల్లో చేసిన వ్యంగ్య విమర్శలు- జనాల్ని మెప్పించినా, సినీరంగంలో ఏమాత్రం మార్పు తేలేకపోవడానికి కారణం మన ప్రేక్షకులు కూడా అన్న అవగాహన ఆయనకుంది. ఆయన మాటలు రాసిన తొలి చిత్రం 'రక్తసంబంధం'లో ఆయన వ్యంగ్యాత్మక విమర్శకు గురైన ' అగ్గిపెట్టె క్లోజప్' కథలోని దృశ్యాలు ఉండడం - ప్రేక్షకులతో చేసుకున్న సర్దుబాటు అనుకోవచ్చు. తెలుగు చిత్రసీమలో ఇది 'సాక్షి నామ సంవత్సరం' అంటూ విడుదల చేసిన బాపు-రమణల తొలి చలన చిత్రం 'సాక్షి' వారి అభిరుచికి అనుగుణంగానే రూపొందింది. 'మూగమనసులు'లో 'అమ్మగారైతే దిబ్బరొట్టే కాయం'; 'బుద్ధిమంతుడు'లో గుమ్మడికాయ; 'అందాల రాముడు'లో తీతా (తీసేసిన తాసిల్దారు), ఆమ్యామ్యా (లంచం)- నేటికీ ప్రచారంలో ఉన్న రమణోక్తులు. ఇక 'ముత్యాలముగ్గు'లో సంభాషణలు- నభూతో నభవిష్యతి.

అసాధారణ రచయిత ముళ్లపూడి వెంకటరమణ తెలుగునాట రమణగా సుప్రసిద్ధులు. అలా ఆయన ఏం వ్రాసినా రమణీయం. విడదియ్యలేని జంట బాపు-రమణ. అలా ఆయన ఏం వ్రాసినా అది బాపూరమణీయం. రామభక్తులైన ఆ ఆత్మీయుల ఏకాత్మ కథ- వానరాత్మకంగా 'కోతి కొమ్మచ్చి' అయి, స్వాతి వారపత్రికలో ధారావాహికమై, హాసం ప్రచురణలో మూడు పాయలై, 'కోతి కొమ్మచ్చి', 'ఇంకోతి కొమ్మచ్చి', 'ముక్కోతి కొమ్మచ్చి'గా పాఠకలోకంలో ప్రవహించింది.

"నానృషిః కురుతే కావ్యం" అన్న ఆర్యవాక్యాన్ననుసరిస్తే ఆయన రమణ ఋషి. కానీ తత్వంలో ఆయన విశ్వామిత్రుడిలా పౌరుషి. ఆయన వాక్కు పౌరుషేయమా, అపౌరుషేయమా అన్న మీమాంస పక్కన పెడితే- నిర్వివాదంగా ఆయనది వసుధైక కుటుంబం. కాబట్టి ఆయన ఆత్మకథ జ్ఞాన, పరిజ్ఞాన, లోకజ్ఞాన,

కాలజ్ఞానాల సమన్వయంగా రమణీయమై అలరించడం సహజం. ఐతే తెలుగుకథ చెప్పినా, ఇంగ్లీషు కథ అనువదించి(సరించి)నా, కామెంట్సు విసిరినా, సినిమా తీసినా - అచ్చ తెలుగుతనం వరించడం, అనువు కాని చోట కూడా అందుకు అనుగుణంగా సవరించడం రమణ జీవన నినాదమూ, నిదానమూ. అది అడుగడుగునా ద్యోతకమయ్యే – వారి ఆత్మకథ తెలుగు సాహితికి వారి చివరి కానుక. కథ పరంగా ఉన్నతాశయంతో నిర్వహిస్తున్న కథామంజరికీ, పాఠకులకూ- అవశ్యమనిపించిన ఈ పరిచయంలో మాత్రం రమణ కథన చాతుర్యానికే ప్రాధాన్యం.

రచనా వ్యాసంగంలో మార్గదర్శకులై, మా ఎదుగుదలకు సహకరించినవారిలో నాటి నేటి మేటి కథకులెందరో ఉన్నారు. వారిలో కొందరిపట్ల గురుభావం. కొందరిపట్ల స్నేహభావం. కొందరంటే ఆరాధన. కొందరు మాత్రమే ఎందుకో ఆత్మీయంగా కూడా అనిపిస్తారు. రమణ అవతారం చాలించినప్పుడు కలిగిన భావోద్వేగం – 'ఉద్రేయ్ కుంఛెం ఆగు' అనే మినీకథగా మారి, ఎప్పుడు చదివినా కళ్లనీ, మనసునీ, గొంతునీ తడి చేస్తుంటుంది. ఆ కథని ఇక్కడ పంచుకోవడం ఈ వేదిక పట్ల మరో భావోద్వేగం.

కథామంజరి వేదికకూ, పాఠకులకూ శుభాకాంక్షలు.

**వసుంధర**

***0***

**మొదటి బహుమతి**

# ఈర్ల పెట్టె



## భాగవతుల భారతి

# ఈర్లపెట్టె

భాగవతుల భారతి



"అమ్మగారూ, అమ్మగారూ!" అనే అరుపులకి బయటికొచ్చి చూసా!

"ఏంటి ఉపేంద్రమ్మా?"

"మా అత్త పురుగుల మందు తాగిందమ్మా! ఆస్పాటలో ఉంది."

"అయ్యో! ఏం? చక్కటి ఇద్దరు కొడుకులూ, కోడళ్ళూ ఉండగా ఇదేం పనీ? " ఆతురతతో అడిగా.

"అవునమ్మ గారూ! 'ఈర్లపెట్టె' కాడ గొడవైంది అందుకనీ"... నసిగింది ఉపేంద్రమ్మ.

"ఈర్లపెట్టా? అదేంటీ?"అడిగాను.

"నేను చాలా ఇళ్ళల్లో పని సేసుకు రావాల. మీరు అత్త కోసం చూస్తుంటారని సెప్పి పోదామని వచ్చినా. పనంతా సూసుకుని మళ్లి వచ్చి సెబుతా!" అంది.

"అంటే అప్పటి దాకా నేను సస్పెన్స్ తో చావాల్నా?" అన్నా.

"ససుపెన్సు లోనే పని ముగించుకుని రెడీగా ఉండండి. అత్త బాగానే ఉంది లెండి. చేసే సెయ్యేగా! వత్తదిలెండి. నేను మళ్లీ వచ్చి సెబుతా! " అని తుఱ్ఱుమంది .

రెండు రోజుల నుండీ వెంకటమ్మ పనిలోకి రావట్లేదు. విషయం తెలిసిందిగా, దానికి కారణం ఏమై ఉంటుందా అని, ఆలోచిస్తూనే పనిలో నిమగ్నమై పోయాను.

వెంకటమ్మ మా ఇళ్ళలో పదేళ్ళ నుండీ పనిచేస్తూనే ఉంది. 70 ఏళ్ళుంటాయ్. పాత తరం అవటం మూలంగా పనిలో ఏకాగ్రత నిబద్ధత, నిజాయితీ పాలు ఎక్కువే. ఇంట్లో మనిషిలా మెలుగుతుంది. అనవసరమైన సెలవులూ, సాకులూ, ఏం లేవు. భర్త పెంచలయ్య. ఎవరైనా చనిపోతే, వారింటి వారితో చేదోడు వాదోడుగా, స్మశానానికి వెళ్ళి, సంపాదించే ఉద్యోగం. తాగుడూ, వాగుడూ మామూలే. అద్దె ఇంట్లోనే ఉంటున్నట్లు చెప్పేది. వెంకటమ్మ కోడలు ఉపేంద్రమ్మ!

రెండేళ్ళ క్రితం పెంచలయ్య పోయాడు. అయినా ఆ యింట్లోనే ఉంటూ, పాచిపని చేసుకుంటూనే, "అమ్మగారూ! ఇప్పట్నించే కొడుకూ, కోడళ్ళ మీద ఏం ఆధారపడతాం" అని అంటూంటుంది.

అన్నట్లుగానే రెండు గంటల తర్వాత వచ్చింది ఉపేంద్రమ్మ. ఉపోద్ఘాతంగా "ఇన్నేళ్ళ నుండీ మీకాడ చేస్తోంది, మా అత్త మీకేం చెప్పలేదా అమ్మా?" అంటూ అడిగింది.

'ఎదుటి వారికి హాని కలిగించని మూఢనమ్మకంలో, మూఢత్వంకంటే నమ్మకమే గొప్పది'

"దేని గురించి?"

"మా ఇంటి ఇషయాలు!"

"ఏవేవో చెప్పేది. నువ్వు ఏ విషయం గురించి అడుగుతున్నావో నాకెలా తెలుస్తుందీ? ఇంతకీ ఏంటి సంగతీ!" ఉత్సుకతతో అడిగాను.

ఉపేంద్రమ్మ చెప్పడం మొదలు పెట్టింది.

***

"అందరూ అనుకుంటున్నట్లు అత్తా, మావకి ఇద్దరు కాదు, ముగ్గురు కొడుకులు. ఐతే పెద్ద కొడుకు ఈరన్న ఎవరో పెద్దింటి పిల్లను పేమించాడంట! ఆ కులపోళ్ళు ఒప్పక కచ్చతో మాటువేసి సంపించినారంట ఈరన్నను. అప్పటికి ఈరన్నకి పద్దెనిమిది ఏళ్ళు. ఆ దిగులుతో అత్తా, మామ ఉండగా, ఓ రోజు కత్తులు చేయించడానికి కంచరికి ఇనుప ముక్క ఇచ్చినారంట. ఒకటి చేయించాలని యెలితే, రెండు కత్తులు తయారయాయంట. అలాగే కొన్నియేయో జరిగినాయంట. 'అరే ఇదేంటి' అని.. ఊరి చివర గణాచారి దగ్గరకు వెడితే, పూనకంలో ఊగిపోతూ 'నేనూ మీ యీరన్నని, ఈరాసామిగా మీ కోసమే వచ్చినా. ఆ కత్తులు అలా రెండవటం నా మహత్తమే. నేను దేవుణ్ణయ్యాను. మీ కోసం వచ్చినాను. నాకు ఏ కోరికా తీరలేదు. మీ ఇంటికే వచ్చాను. నాకు ఏటేటా బట్టలు పెట్టి, యాటను కోసి పండుగ సేయాలని చెప్పాడట!"

"ఇదేమిటీ! కత్తులు రెండవటం, గణాచారి పూనటం, బాబోయ్ ఇదేంటి, నమ్మబుద్ది కాని అంశాలన్నీ, హమ్మో! ఇలా కూడా ఉంటాయా నమ్మకాలూ?" సంభ్రమాశ్చర్యాలలో తలమునకలౌతూ నోరు వెళ్ళబెట్టాను.

"మీరు సదూకున్నోరు! మీకలానే ఉంటాది. అన్నీ ఉంటాయమ్మా!" అంది ఉపేంద్రమ్మ.

"సరే చెప్పు!" అన్నాను.

"అమ్మా! ఐతే ఓ పెట్టెను తయారుచేసి, అందులో 'ఈరాసామి' ఫొటో, ఓ జత బట్టలూ, ఈ కత్తులు, చిన్నచిన్న పావుకోళ్ళు, ఇంకా.. వడిసేలు ఓటి కొని, దానిలో ఉంచి, దానిని గదిలో ఓ మూలన పెట్టి, రోజూ దాన్నే సూసుకుంటూ, సంవత్సరానికి ఓసారి, బట్టలు పెట్టుకునీ చేస్తూ ఉంటారు అత్తా మామ! దాన్నే 'ఈర్లపెట్టె' అంటాం ఈరాసామి, ఈరన్న పేరు మీద!"

"నీ మాటకు అడ్డం వస్తున్నానూ, 'వడిసేలు' అంటే?"

"అదీ అమ్మా! తిరునాళ్ళలో, గణాచారి వీపు మీద బాదుకుంటారే .. డప్పుల మోతలో వేషాలు వేసుకొనీ... అదీ!"

"ఓహో చర్నాకోలా?"

"ఏమో! మీరేటంటారో అదే! దాన్ని చుట్ట చుట్టి అదే పెట్టెలో పెట్టి, మూత యేస్తారు. ఆ పెట్టెనే 'ఈర్లపెట్టె' అంటాం. ఎవరి ఒంటి మీదికైనా వచ్చి ఈరన్న పలుకుతాడు. అప్పుడు.. ఏం కావాల్నో అడిగి అవి చేసి పెడతాం!"

నాకు మతి పోయింది. మూఢనమ్మకాలు పల్లె నుండి, పట్నం వరకూ ఏదో ఓ రూపంలో ఉంటూనే ఉన్నాయి. మనం చేస్తే మంచి ఆచారం, సాంప్రదాయం! ఎదుటివారు ఆచరిస్తే మూఢనమ్మకం అంటాం. సహజమేగా!

"అమ్మా! మా మావ ఉన్నప్పుడే 'ఇద్దరికీ వయసై పోతోంది, మా దగ్గరకి వచ్చేయండీ. పువ్వుల్లో పెట్టి చూసుకుంటాం' అని మా ఆయన, మా బావ చిలక్కి చెప్పినట్లు చెప్పారు. మరి 'ఈర్లపెట్టె' మాత్రం వదిలేసి రమ్మన్నాం.

"అర్థంకాలా ఉపేంద్రా!"

"మా ఇళ్ళలో ఇలాంటి పెట్టెలు రకరకాల పేర్లతో ఉన్నాయ్. ఐతే ఎవరైనా ఓపిక ఉన్నంత వరకూ పూజలు చేస్తారు. లేదంటే ఏ మారెమ్మ గుళ్ళోనో, ఇంకే గుళ్ళోనైనా అప్పజెప్పేసి, వచ్చేయవచ్చు. అలా చేయమన్నాం."

"ఏం! చిన్న పెట్టేగా, మీ ఇళ్ళల్లో దానికి చోటు లేదా? "

"కాదమ్మా! గుళ్ళో అప్పజెప్పేస్తే మన బాధ్యత ఉండదు గానీ, ఆ పెట్టె గనుక ఎవరింటికి జేరితే వారు వంశపారంపర్యా, పిల్లపిల్ల తరాల పూజలు జేయాల. ఈ గోలంతా మాకెందుకని, ఈర్లపెట్టె వదిలేస్తేనే రమ్మన్నాం. మా మామ ఉన్నంత కాలం అద్దె ఇల్లైనా, అద్దె భరిస్తూ, ఓపిక లేకపోయినా నాలుగిళ్ళలో పని చేసుకుంటూ జీవితం లాక్కువచ్చారు. కానీ మావ పోయాడు. అత్తకీ ఓపిక తగ్గింది. మా బావ మహబూబాబాద్ వచ్చేయమన్నాడు. పని మానేసి మేము మా యింటికి రమ్మన్నాం. కానీ పెట్టె వదిలి రానని గుండె బాదుకుని ఏడుస్తా ఉంది. నా కొడుకు దేవుడయిండు. అద్దె పెట్టుకుని, ఇదే ఇంట్లో ఉండి, 'ఓపిక ఉన్నంత వరకూ పాసి పనిసేస్తా, నా కొడుకుతోనే ఉంటా, ఆడు దేవుడయిండు' అని ఏడుపు. మొన్న కొడుకులకు, అత్తకు ఆ పెట్టె వదిలి వచ్చేమని ఒహటే గొడవ! అత్త 'నా కొడుకుతో పాటు నేనూ పోతా' అంటూ పురుగుల మందు తాగిందమ్మా! యెంటనే చూసి. కక్కించారమ్మా! ఏం జేయాలో అరదం కాటల్లేదమ్మా!" అని నిట్టూర్చి,

"సరేలే అమ్మా! నేపోతండా! ఎట్ట జరగాలన్నుంటే అట్టా జరుగుద్ది!" అంటూ వెళ్ళిపోయింది ఉపేంద్రమ్మ.

చాలా సేపు మనసు పనిచేయక చేష్టలుడిగి కూర్చున్నా. మూఢనమ్మకం అని కొట్టి పారేయగలిగినా, పెట్టెలో కొడుకును చూసుకుంటూ బ్రతికేస్తున్న మాతృ హృదయ నిర్వేదం, నన్ను కదిలించి వేసింది.

కానీ ఆ పెట్టెను జీవితకాలం, తర్వాతి తరం వరకూ ఎవరు మోయాలి? ఆలోచిస్తున్నాను.

***

వెంకటమ్మ కోలుకుని ఎప్పటిలాగా పనిలోకి వచ్చింది.

"వెంకటమ్మా! నీ పెద్ద కొడుకు దగ్గరకు వెళ్ళకపోయావా? ఈ వయసులో ఇంత నీరసంలో.... ఇలా ఎన్నాళ్ళూ?"

"ఆ.. ఇప్పట్నించీ ఎందుకమ్మా!" అంది నీరసంగా.

"ఆ ఈర్లపెట్టె గురించేగా నీ యావ అంతా! పెట్టెను తోబుట్టువుల ఇళ్ళల్లోనే ఉంచాలా?"

"ఉపేంద్ర సెప్పిందా? తోబుట్టువులు, లేకుంటే గుడి. అమ్మా...."

"నన్ను తోబుట్టువనుకుంటావో, ఈ ఇల్లు గుడి అనుకుంటావో, ఆ పెట్టె నేను తీసుకుంటాను!" అన్నాను.

చేతిలోని గిన్నెను జారవిడిచి, "అమ్మా.. మీరా?" అంటూ నా ముఖంలోకి చూసింది.

ఆ సమయంలో వెంకటమ్మ ముఖాన్ని ఏ కవీ వర్ణించలేడు, ఏ చిత్రకారుడూ ఆ భావోద్వేగాన్ని కుంచెతో ఒడిసి గీయలేడు. ఆ భావ వీచిక, ఆనందాన్ని, ఎన్ని కోట్లిచ్చినా కొనలేనేమో!

"కానీ ఓ షరతు ...." ఆగాను. ఏంటన్నట్లు చూసింది నా వంక.

"అద్దె ఇల్లు ఖాళీచేసి, సామానంతా తీసుకుని నీ  కొడుకు దగ్గరకు వెళ్ళి పోవాలి. మళ్ళీ ఈ చిన్న కొడుకు దగ్గరకి వచ్చినపుడల్లా ఇక్కడికి వచ్చి, పెట్టెలో ఉన్న పెద్ద కొడుకును చూసుకుని వెళ్ళవచ్చు. అప్పటి వరకూ పాలూ పళ్ళూ, పూలూ వీలున్నప్పుడల్లా, ఎవరి చేతైనా పెట్టిస్తా సరేనా!" అన్నాను.

ఇదంతా విని ఈయన గారు చిందులు.

"భానూ, నువ్వు సంఘ సంస్కర్తననుకుంటున్నావా? పిల్లాజెల్లా లేని ఇంట్లో నేను బయటికి వెడితే, నువ్వు ఒక్క దానివే ఉంటావు. క్షుద్రాలన్ని తెచ్చి ఇంట్లో పెడతావా? నీకేమైనా మతి పోయిందా?"

"ఏమండీ! అది కాదండీ! ఓ తల్లి ఆత్మ ఘోష మీకు వినబడటం లేదా? మనకు లేకపోతేనేం! చనిపోయిన బిడ్డకోసం తల్లి పడే వేదన చూస్తున్నారుగా!  అదీగాక ఇక్కడ పెట్టె ముఖ్యం కాదండీ! ఈ వయసులో, ఆ తల్లి పిల్లల నీడలో విశ్రాంతి తీసుకోవటం ముఖ్యం. పిల్లలు కూడా మంచి వాళ్ళే.  పూలల్లో పెట్టి చూసుకుంటారు. ఈ వయసులో ఏ యింట్లో నైనా కాలుజారి పడి ఏదైనా విరిగితే, ఎన్ని తిప్పలూ.  ఇక పెట్టె సంగతీ? మన మెట్ల క్రింద గది ఖాళీగా ఉందిగా! అక్కడ  పెట్టమందాం! గదికి తాళం వేద్దాం. ఆమెను కొడుకు దగ్గరకు పంపి, ఉపేంద్రమ్మ సాయంతో అలాంటిదే వేరే పెట్టె తెప్పించి, ఈ పెట్టె ఏ గుళ్ళోనో, ఆమె చేతే పెట్టించేద్దాం. ఇంత చిన్న విషయానికే, ఆమె.... ఇబ్బంది..."

ఎన్నో చర్చలూ, తర్జనభర్జనలు జరిగాక, పదిహేను రోజుల్లో పెట్టె మెట్ల క్రింద గదిలోకి చేరింది. వెంకటమ్మ ఇల్లు ఖాళీచేసి, సామాను కొంత , ఉపేంద్రమ్మ మొగుడికి  అప్పజెప్పి, కొంత తీసుకుని ఊరు దాటింది.  వెళ్ళేటప్పుడు, మళ్ళీ పెట్టెలోని కొడుకుతో మనసారా సంభాషించి, "మళ్ళీ వత్తా అయ్యా !" అని చెప్పి ఏ సంకోచం లేకుండా ఆనందంగా వెడుతుంటే, చూసిన అందరి కళ్ళల్లో సంతోషం, ఏదో సాధించిన సంతృప్తి నాలో.

ఈ పెట్టె ఏ గుడికి చేర్చాలీ? అలాంటి ఓ పెట్టె ఎలా తయారు చేయాలి? అని ఉపేంద్రమ్మ, నేనూ తర్జనభర్జన పడుతుండగానే నా ఆరోగ్యంలో ఏదో తేడా గమనించి, డాక్టర్ ను సంప్రదించాను. ఆశ్చర్యకరంగా దాదాపు పన్నెండు సంవత్సరాల తర్వాత విన్నాం, ఎంతగానో ఎదురు చూస్తున్న శుభవార్త. నేను తల్లిని కాబోతున్నానని. అంబరమంటిన ఆనందం!!


ఏ నోటితో అన్నానో, 'తోబుట్టువును' అని.. ఎక్కడ పుట్టాడో, ఎక్కడ పెరిగాడో, ఎక్కడ ఎప్పుడు ఎలా పోయాడో గానీ, మూఢనమ్మకాలు అని కొట్టి పారేసిన నాతో సహా మా ఇంట్లో వాళ్ళకీ  దేవుడయ్యాడు.

ఇద్దరు పిల్లలకి తల్లినయిన నాకు, పెద్ద కొడుకు వీరేశ్వర్ పేరుతో, నా నోట్లోనే నానుతూ, ఇప్పటికీ పూజలందుకుంటూనే ఉన్నాడు ఈరన్న, వీరన్న, ఈరాసామి .. మా ఇంట్లోనే 'ఈర్లపెట్టె'లో కూర్చుని!!

***0***

రెండవ బహుమతి

# సౌందర్యారాధన



సి హెచ్ వి ఎస్ ఎస్ పుల్లంరాజు



# సౌందర్యారాధన

**సి హెచ్ వి ఎస్ ఎస్ పుల్లంరాజు**

వివాహ వేదిక ఎంతో సందడిగా వుంది. పెళ్లి మండపం, మామిడాకుల తోరణాలతో, వివిధ రకాలైన పువ్వులతో, దేవుళ్ల ప్రతిమలతో, బొమ్మలతో, పుష్పమాలలతో, రంగురంగుల వస్త్రాలంకరణతో, విద్యుద్దీపాల కాంతులతో కనువిందు చేస్తోంది. శుభ ముహూర్తంలో దంపతులయిన, నూతన వధూవరులని దీవించడానికి, ఆహూతులందరూ వేదిక ఎక్కుతున్నారు. వీడియోగ్రాఫర్లు, పురోహితులు, అతిధులతో వేదిక కిక్కిరిసి పోయింది. ఎవరి హడావిడి వారిది. మొత్తం మీద మంచి కోలాహలంగా వుంది అక్కడ పరిస్థితి.

"విందు భోజనం తప్పక చేసి వెళ్ళాలి" నవ్వుతూ అందర్నీ పలకరిస్తూ, అతిధులందరినీ కోరుతున్నాడు కన్యాదాత.

"సార్! ...మేడం ...మీరు ఒక్కసారి ఇలా కెమెరాకేసి నవ్వుతూ చూడండి" పెళ్ళి కొడుకుకి సూచనలు చేస్తున్నారు వీడియోగ్రాఫర్లు, ఒక వైపు. మరో వైపు "నాయనా! ఇలా చూడు. ఈ అక్షింతలు తీసుకుని,..." పురోహితుల ఆదేశాలు.

ఎవరి వైపు చూడాలో, ఏమి చేయాలో తెలియక, తికమక పడుతూ, తమకు తోచినట్లు చేస్తూ, దీవిస్తున్న వారందరికీ దండాలు పెడుతున్నారు ఆ నూతన దంపతులు.

***

ఆనందరావు, సుందరరావు మంచి స్నేహితులు. చేతుల్లో అక్షింతలతో ఇద్దరూ వేదిక మీద నిలబడి, అందర్నీ పరిశీలిస్తూ, తమదైన శైలిలో, అక్కడ జరుగుతున్న తంతుని వ్యాఖ్యానిస్తూ, ఉల్లాసంగా వున్నారు.

"ఏవోయి! సుందరం! ఇక్కడ చూడు."

"ఏమీ కనిపించడం లేదోయ్ ఆనందం!"

"ఆ వెటకారానికేమి గాని, నీ ప్రక్కనే చూడు'

"ఆ ఎర్ర పట్టుచీరలో.... నిప్పురవ్వలా రగిలిపోతున్న..."

"అబ్బే... ఉపమానం కుదరలేదు. నే చెబుతా చూడు. నడుస్తున్న రుబ్బురోలు పొత్రంలా...హ్హాహ్హా.."

'అందాన్ని అందుకోవాలనిపిస్తుంది. సౌందర్యాన్ని ఆరాధించాలని అనిపిస్తుంది. అనిపించడం మన స్థాయిని తెలియజేస్తుంది'

"లేదు. తారు డబ్బాకి ఎర్ర రంగు పులిమినట్టు"
"కాదు, సింగరేణి సుందరికి ఎర్ర కోక చుట్టినట్టు."
"బాగుంది. అదిగో... ఆవిడ నీ కేసి చూస్తూ నవ్వుతోంది"
"వయసు మీద పడినా, చిలిపితనం పోలేదు నీకు."
"ఓహో! ఎత్తు పళ్లు కూడానా! ఈ అతిలోకసుందరికి మెల్ల కన్ను అని నా సందేహం!" మెల్లగా అన్నాడు ఆనందరావు.
"ఆ సందేహం వలదు సోదరా! నిజమే."
"ఏమైనా నీ పరిశీలనా శక్తి, అమోఘం!"
"మునగచెట్టు ఎక్కించకు నన్ను."
"ఇంతకీ, ఈ అతిలోకసుందరిని వరించిన ఆ జగదేకవీరుడు ఎవరో... ఎక్కడున్నాడో..."
"అవును. ఒకసారి చూసి తీరాలి సుమా!"
హఠాత్తుగా, వారి ఇకిలింతల మధ్య నుండి ఒక గొంతు విచ్చుకొంది.
“అయితే ఓ సారి ఇటు చూడండి!”
ఈ హఠాత్పరిణామానికి ఆ ఇద్దరూ హతాశులయ్యారు.
నోటి లోంచి మాటలు పెగల్లేదు వారిద్దరికీ. ఒక విధమైన కలవరపాటుకి లోనయ్యారు .
"నేనే .... మీరు వెతుకుతున్న ఆ జగదేకవీరుడ్ని. అదేనండీ, ఆ సింగరేణి సుందరి భర్తని."
పక్కలో బాంబు పడ్డట్లు అదిరిపడ్డారు ఇద్దరూ!
"ఓ... మీరా...ఆవిడ భర్త... చాలా సంతోషం!" ఏడుస్తూ చెప్పినట్లుగా వుంది.
"క్షమించండి.. ఏమనుకున్నారో, ఏమో.. ఏదో సరదాకి.."
"ఫరవాలేదు లెండి...మీ పాండిత్యానికి పరవశించా!"
"మీది పెద్ద మనస్సు కాబట్టి, మీరు అర్థం చేసుకోవచ్చు... కానీ, మీ శ్రీమతి మా మాటలు విని నొచ్చుకుని.."
వాక్యం పూర్తి కాకుండానే, ఇలా అన్నాడు ఆమె భర్త.
"అస్సలు మీకా సందేహమే అవసరం లేదు!"
"ఎంత మాట! ఆవిడ బాధపడదా?" ఆశ్చర్యంతో అడిగారు వాళ్ళు.
అతని సమాధానానికి దిమ్మ తిరిగి పోయింది. గుడ్లు తేలేశారు. ఆ సమాధానం వారి చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది ఇలా.
"నా భార్యకి బ్రహ్మ చెవుడు కూడా!"
నోరు వెళ్ళ బెట్టిన, రాతి బొమ్మల్లా బిగిసిపోతూ, వాళ్లు పెట్టిన ఆ కేకకి అక్కడున్న వారందరూ హడలి పోయారు.

"ఓరి నాయనో! ఏమి సౌందర్యారాధనరా! జగదేకవీరా!"

***

"ఏమిటి, అలా ఆవిడ కేసి తదేక దీక్షగా చూస్తున్నావు?"

"ఆ ఏమీ లేదు!"

"నువ్వు ఆవిడ కేసి చూస్తున్నావన్నది నిజం.... పోనీ, చెప్పకూడదనుకుంటే ......"

"ఛ...ఛ... నా ఉద్దేశ్యం అది కాదు"

"మరి ఏమిటి? వీడి మొహం.... వీడికి చెప్పితే మాత్రం అర్థమవుతుందా అని కదా?"

"కాదు, కాదు... ఎప్పుడూ నేనలా అనుకోను!"

"మరి చెప్పడానికి..... భయమా, సిగ్గా?"

"ఆ రెండు నాకు లేవు నీ దగ్గర. కానీ, ఎలా మొదలు పెట్టాలో తెలియకే....."

"నిజమే, ఏదైనా మొదలెట్టడంలోనే కష్టం. తర్వాత సులువుగానే నడుస్తుంది!"

"సరే, ఎదురుగా చూడు... పసుపు రంగు చీరలో, జడలో మల్లెలు పెట్టుకొని, వయ్యారంగా స్తంభానికి ఆనుకొని నిలబడి, నవ్వుతూ మాట్లాడుతోంది ..."

"ఆవిడలో.. ఏదో చెప్పలేని......."

"అందమో... సౌందర్యమో.... దాగుందంటావు?"

"దాగి లేదు. కానీ, చూసిన ప్రతి కన్నుకి కనిపించాలని లేదు."

"ఓహో! అందుకే నాకూ కనబడటం లేదా!" వెటకారంగా.

"అది నా ఉద్దేశ్యం, అది పూర్తిగా వ్యక్తిగతం. నాకు అందంగా కనిపించినది, అందరికి అందంగా కనిపించాలని లేదు."

"చాలా చిత్రంగా మాట్లాడుతున్నావు!"

"అవును, చిత్రమే!"

"ఐతే, అందానికి నీ నిర్వచనం?"

"ప్రయత్నిస్తా, కానీ నే చెప్పేదే సంపూర్ణ నిర్వచనమని చెప్పలేను!"

"అలాగే, నీ నిర్వచనమే చెప్పు!"

"మన కన్నులు అనేక వస్తువులని చూపిస్తాయి. వాటికి రంగు, రూపు, కాంతి, ఇలా ఎన్నో కోణాలు ఉంటాయి."

"సినిమా హీరో హీరోయిన్లు.... ప్రకృతి అందాలు..."

"ఔను, బాగా చెప్పావు. అంతే కాదు, భీముని కండలు, అర్జునుడి గాండీవం అందంగా కనిపించ వచ్చు మహాభారతంలో. ఇలాంటివి మనసుని ఆకర్షించేందుకు అవకాశం వుంది. వీటిని అందానికి ఉదాహరణలుగా చెప్పచ్చు!"

"నాకో సందేహం?  మాయాబజార్ సినిమాలో శ్రీకృష్ణుడి పాత్రలో ఎన్టీఆర్ ని చూసిన తరువాత, మరొకర్ని ఆ పాత్రలో చూడలేము.  ఎంతో అందంగా వుంటారాయన...."

"మంచి సంగతి చెప్పావు. ఆ పాత్రలో ఇంకొక నటుడ్ని ఊహించుకోలేము. కారణం ఏమిటంటే, మహాభారతంలోని శ్రీకృష్ణుడుకి, ఎన్టీఆర్ శ్రీకృష్ణుడు ప్రతిబింబంగా ఉన్నాడని మన భావన! అంటే ఎన్టీఆర్ వేసే  కృష్ణ పాత్ర, పరిపక్వమై, పరిపూర్ణతకు చాలా దగ్గరగా వుంది. అప్పుడు, నీ భావనలో వున్న శ్రీకృష్ణుడు ఆకారం దాల్చితే, అది అచ్చు ఎన్టీఆర్ శ్రీకృష్ణుడు లాగే వుంటాడు. అందుకే నువ్వు ఆ శ్రీకృష్ణుడు వైపు ఆకర్షించబడి, అబ్బా ఏం అందంగా ఉన్నాడురా అంటావు!  వేరే నటులు ఆ పాత్రలో పరిపూర్ణతకి దగ్గరగా రాలేదని నీ ఉద్దేశ్యం. అందుకే వారిని శ్రీకృష్ణ పాత్రలో అంగీకరించలేవు!"

"అంటే, పరిపూర్ణత సాధించినదే అందం.  అందుకే అది, ఆకర్షణీయమై, మన దృష్టిపథంలో నిలుస్తోంది."

"బాగా అర్థమయ్యింది. నీ వివరణ కూడా బాగుంది.'

"ఇందాక మనం చూసిన ఇల్లాలులో, పరిపూర్ణత సాధించిన స్త్రీ తత్వమే అందం. నూటికి నూరుపాళ్ళ ఆడతనమే ఆవిడ అందం. ఆ అందమే ఆకర్షణకు కారణమయ్యింది!"

"అయితే, అందరూ ఆవిడని అందగత్తెగా కొలుస్తారా?"

"చాలా మంది!  ఎందుకంటే, శ్రీకృష్ణుడు పాత్రకి ఎన్టీఆర్  సరికాదని వాదించే వాళ్ళు కూడా ఉండచ్చు. కాబట్టి అందమనేది వ్యక్తిగతం, సాపేక్షం కూడా!"

"అందం శాశ్వతమా? ఎప్పుడూ ఒకేలా ఉండదా?"

"కాదు, ఉండదు! ఎందుకంటే, యవ్వనంలో వున్న అందం, వృద్ధాప్యంలో కనుమరుగవుతుంది. అరే, అప్పుడు ఎంత అందంగా వుండే వాడో... అయ్యో! ఇప్పుడెలా వున్నాడో అంటూ బుగ్గలు నొక్కుకుంటాము. ఉదయం, వికసించిన గులాబీ ఎంతో అందంగా కనిపిస్తుంది. కానీ, సాయంత్రానికి అది వాడిపోయి, అంద విహీనంగా కనిపిస్తుంది!"

"నాదొక సందేహం.  ఆనాడు దేవదాసు, పార్వతిలో చూసింది ఆమె అందమా? సౌందర్యమా?"

"ఈ ప్రశ్నకు సమాధానం నువ్వే చెప్పగలవు. ముందు విను.  పెరిగినా, తరిగినా, తరిగి పెరిగినా, రూపాంతరం పొందేదే అందం!"

"నీ విశ్లేషణ బాగుంది. అయితే శాశ్వతంగా వుండే, ఆనందమే ఈ ప్రపంచంలో లేదా?"

"లేకేం.., కానీ దాన్ని అందమనకూడదు...."

"మరి..."

"శాశ్వతమైన అందమే సౌందర్యం.  బాహ్య చక్షువులతో చూడగలిగేది, అందమైతే, అంతర్నేత్రంతో మాత్రమే దర్శించగలిగేది సౌందర్యం! అందం కొన్నిసార్లు అశాంతికి, ప్రమాదానికి హేతువు కూడా కావచ్చు. కానీ సౌందర్యం మనసుకి శాంతి, స్వాంతన కలిగిస్తుంది."

"కొంచెం వివరంగా చెప్పగలవా?"

"తప్పకుండా! కొన్నిసార్లు ఒకరి అందం, మరొకరికి అసూయ, ఈర్ష్య, మనోవేదన కలిగించవచ్చు!"

"మరి సౌందర్యంతో ఆ ప్రమాదం లేదా?"

"ఉండదు! శాంతి, ప్రేమ, త్యాగం లాంటి సుందర సహస్ర దళ వికసిత కమలమే సౌందర్యం!"

"సరే, తెలిసింది. సౌందర్యం ఎక్కడ ఉంటుందో చెప్పు?"

"వీర జవాన్ల సాహసంలో సౌందర్యం వుంది. త్యాగరాజ కీర్తనలో భక్తి సౌందర్యం వుంది. శిలువ మీది జీసస్ కళ్ళల్లో వున్నది ప్రేమ సౌందర్యం! అమ్మ ప్రేమలో మాతృ సౌందర్యం. గురువు బోధనలో, దీవెనలో వాత్సల్య సౌందర్యం. రైతు స్వేద బిందువుల్లో శ్రామిక సౌందర్యం. భారతరత్న అబ్దుల్ కలాంగారి రచనల్లో భావి భారత దేశ సౌందర్యం!"

"అద్భుతంగా చెప్పావు. నీ భావావేశంలో భావ సౌందర్యం కనిపిస్తోంది!"

"సరే, ఇప్పుడు నువ్వు చెప్పు. ఇందాకటి నీ ప్రశ్నకు సమాధానం? అదే .. దేవదాసు పార్వతిలో చూసిందేమిటి? అందమా? సౌందర్యమా?"

***0***

మూడవ బహుమతి

# సెల్ తంత్రం



## కనిగిరి రాజేశ్వరి

# సెల్ తంత్రం



కనిగిరి రాజేశ్వరి

ఎండలు కొంచెం కొంచెం ముదురుతున్న రోజులు. గేటు శబ్దం చేస్తూ "అమ్మగోరండీ! అమ్మగోరండీ!" అని పిలిచిన పిలుపుకి పార్వతి తలుపు తీసి బయటకి వచ్చింది. గేటు బయట భూగర్భ కేబుల్స్ కోసం గోతులు తవ్వుతున్న పనివాళ్ళు చేతిలో కేరేజీలతో నిలబడి ఉన్నారు.

పార్వతిని చూడగానే "అమ్మా! బైట ఎండగా ఉంది. మీ మామిడి చెట్టు కింద కూకుని, అన్నం తినమా?" అని పార్వతి పర్మిషన్ అడిగారు. పార్వతికి జాలేసింది. 'కారులో షికారుకెళ్ళే.......' పాట గుర్తొచ్చింది.

"తినండి కానీ మళ్ళీ శుభ్రం చేసెయ్యాలి, మెతుకులూ అవీ లేకుండా!" అంది ముందు జాగ్రత్తగా.

"అలగేనమ్మా!" అని, ఇద్దరు ఆడవాళ్ళూ, ఒక మగతనూ వచ్చి కేరేజీలు విప్పుకుని భోజనాలు చేసి శుభ్రం చేసేసారు. వాళ్ళ ప్లాస్టిక్ బాటిల్లో నీళ్ళు తాగుతుంటే జాలేసి కుండలో నీళ్ళు తెచ్చి పోసింది పార్వతి.

మర్నాడు మళ్ళీ వాళ్ళు వచ్చి భోజనం చేస్తూంటే, సరదాగా సెల్లు లో ఫొటో తీసింది. అది చూసి వాళ్ళల్లో ఒకర్తి "అమ్మా! మా సంతోషి కాడ సెల్లున్నాది. దానిలో ఫుటోలు తియ్యడం దానికి నేరిపిత్తారా? దీనికి కొత్తగా పెళ్ళైనాది. మొగుడు యేరే ఊర్ల ఉద్దోగం. అందుకని దీనికి సెల్లు కొనిచ్చినాడు ఊసులాన్నానికి!" అని నవ్వుతూ చెప్పింది. అది సిగ్గుపడుతూ, "ఒల్లకోయే గౌరమ్మా!" అంటూ సెల్లు పార్వతి చేతిలో పెట్టింది. గౌరమ్మ "ఒరే! మల్లేశూ! నువ్వు కూడా రారా ఫుటో దిగనానికి!" అని పిలిచింది వెనకే నిలబడి పోయిన వాణ్ణి. మాటల్లో వాడు తనకి దూరపు చుట్టం అని చెప్పింది.

పార్వతి సంతోషికి ఫోటోలెలా తియ్యాలో నేర్పించేసింది. మూడు నాలుగు ఫోటోలు తీసి సంబర పడిపోయింది అది. కొన్ని రోజులు పోయాక పని వాళ్ళందరూ, పనులు ముగించి తట్టాబుట్టా సద్దుకుని, కాంట్రాక్టరు దగ్గరకొచ్చారు, మూడు రోజుల నుంచీ వాయిదా వేస్తున్న బట్వాడా కోసం. ఇవాళ కూడా "బిల్లు పాసవలేదురా! డబ్బివ్వలేదు పై ఆఫీసులో, రేపు చూద్దాం!" అన్నాడతను కూల్ గా.

'సాధనమున పనులు సమకూరు ధరలోన - అన్నాడు వేమన. భవిష్యత్తులో సామాన్యులకు సెల్ ఫోన్ అనే గొప్ప సాధనం లభిస్తుందని ఆయనకు అప్పుడే తెలుసు'

కూలీలకి కడుపు మండింది. కానీ ఏం చెయ్యగలరు? పేదవాడి కోపం పెదవికి చేటు. ఇప్పుడు తగువు పెట్టుకుంటే రేపు పనిలోకి రావద్దంటే, ఈ మూడు రోజుల డబ్బులు కూడా రావు. అందుకని వాళ్ళల్లో వాళ్ళే గొణుక్కుంటూ ఎవరి పల్లెటూరికి వాళ్ళు బయల్దేరారు.

పట్నం బస్సెక్కి తమ పల్లెటూరులో దిగారు, గౌరమ్మా, సంతోషీ, మల్లేశూ.

"నేను నాలుగు రోజులూ, నా మొగుడు మూడు రోజులూ, పనిసేసినాం ఇప్పటికి. ఆడికియ్యాల జొరం అని తొంగున్నాడు. డాకటేరు కాడికి ఎల్లాలంటే డబ్బుసేన్నవు. ఈడు సూత్తే బటువాడా ఈటంసేదు. ఏటి సెయ్యాలో తోచకుంటుంది. పక్కింటి ముసల్దాన్ని, కాస్త జావ కాసి పొయ్యమని సెప్పినాను. ఎలగున్నడో? ఏటో? గుంటడు బడి అయినాక మేష్టరుగోరింటికి ఎల్లి, అక్కడే కూకుని సదూకుంటడు. ఆయమ్మ ఏదైనా ఎడతాది తిన్నానికి. ఇప్పుడు నేను ఆ బాబింటికెల్లి ఆణ్ణి తోడుకోని ఇంటికెల్లాల!" అని గౌరమ్మ తన బాధంతా వెళ్ళబోసుకుంది. వాళ్ళు అది చెప్పినదంతా సానుభూతితో విన్నారు.

గౌరమ్మ, సంతోషికి కొంచెం దగ్గరగా వచ్చి గుసగుసగా, "ఆ కాంటాక్టరు సూపులూ, సైగలూ బరాయించనేక పోతన్నానే! మానేద్దుమా అంతే డబ్బులిరికి పోనాయి. ఇంకో పని దొరుకుతాదని గేరంటీసేదు కదా! ఎలగో.. ఏటో!" అని నిట్టూర్చి, మేష్టారింటి వైపు అడుగులు వేసింది.

గౌరమ్మ, మేష్టారింటికి వెళ్ళే సరికి, ఆయన పిల్లలకి పంచతంత్రంలో కాకీ, పామూ కథ చెప్తున్నారు. అది వింటూ అక్కడే కూర్చుంది. కాకులు రాణీ గారి హారాన్ని పట్టుకొచ్చి, పుట్టలో వేస్తే, భటులు పాముని చంపడం చెప్పి, ఏదైనా అపాయం వచ్చినప్పుడు ఉపాయంగా తప్పించుకోవాలని చెప్పి ముగించారు.

గౌరమ్మ మేష్టారి భార్య ఇచ్చిన చారూ, కాస్త పచ్చడీ పట్టుకుని, కుర్రాణ్ణి వెంటబెట్టుకుని ఇంటికి బయల్దేరింది. ఇంట్లో గౌరమ్మ మొగుడు జ్వరం కొంచెం తగ్గినా నీరసంగా ఉన్నాడు. అన్నం వండి, కాస్త చారు వేసి జావలా కలిపి పెట్టింది.

మర్నాడు పొద్దున్నే లేచి పనిలోకి వెళ్ళడానికి తయారవుతూ, "మానేద్దామనే ఉంది కాని, మాఁవా, తీరా ఇయ్యాల బటువాడా ఇస్తే? నీకు మూడ్రోజులియీ, నావి నాలుగూ. నీ యేలిముద్దర నేకపోతే ఇత్తాడో? ఇయ్యడో? బతిమిలాడుకోవాల. గంజి కాసి యెట్టాను, తాగు. మద్దెలో పక్కింటి మామ్మ వచ్చి సూత్తాదిలే!" అని అప్పగింతలు పెట్టి మిగతా జట్టు వాళ్ళతో కలిసి బయల్దేరింది.

***

వీధిలో పెద్ద పెద్ద అరుపులూ, కేకలూ వినిపించి, ఏదో దెబ్బలాట జరుగుతున్నట్టు తోచి, గేటు తీసుకుని బయటకు వచ్చి చూశాడు శంకర్రావు. చూస్తే గౌరమ్మ, మల్లేశు చొక్కా పట్టుకుని గుంజుతూ నానా తిట్లూ తిడుతోంది. మధ్యాహ్నం బైట ఎండగా ఉంటుందని, మామిడి చెట్టు కింద కూర్చుని భోజనాలు చేస్తారని భార్య పార్వతి చెప్పడం వల్ల, వాళ్ళు శంకర్రావుకి తెలుసు. కాంట్రాక్టరూ, మిగతా పని వాళ్ళూ, సముదాయిస్తున్నారు. రోడ్డు మీద వెళ్ళే వాళ్ళు ఆగి చోద్యం చూస్తున్నారు.

శంకర్రావుని చూడగానే గౌరమ్మ "సూడండి బాబూ! ఈ యెదవ! ఎదవ ఏసాలేత్తన్నాడు. ఎందుకొత్తాం బాబూ పనిలోకి? కూలి డబ్బుల కోసమే గందా? నాలుగు రోజులయింది, ఆఫీసలల్ల బిల్లు పాసవనేదని కూలి డబ్బు లియ్యనేదు. పాపం! ఆ బాబు మాత్రం ఏటిసేత్తాడు. నా మొగుడుకి జొరంగున్నా సరే పనిలోకి ఒచ్చినాను. ఇయ్యాలైనా కూల్డబ్బులిస్తే, ఆణ్ణి డాకటేరుకి సూబించాల. ఇక్కడేమో ఈడు ఎదవ ఏసాలు. అందుకే సంతోషికి చెప్పి సెల్లుల ఫోటోలు తీయించినాను. అయి పోలీసులకి సూపించి జైల్లో ఎట్టిత్తాను. పీడ ఇరగడైపోద్ది. నా జోలి కొస్తే అంతే!" అంది రొప్పుతూ.

"ఏదో ఈ తప్పు కాయవే! ఇక మీదట నీ జోలికి రానే!" అని మల్లేశు కాళ్ళా వేళ్ళా పడ్డాడు.

"సర్లే! సంతోషి సెల్లల ఆ పుటోలుంటాయి. జాగరత్త!" అని "బాబూ! మీరే సాచ్చెం!" అని చూస్తున్న వాళ్ళందర్నీ ఇన్వాల్వ్ చేసేసింది.

నాలుగు రోజుల బట్టీ కూలీ లేక పోయినా పని చేస్తున్నందుకు వాళ్ళ మీద సానుభూతి చూపించి, కాంట్రాక్టరుని మందలించి, చుట్టూ మూగిన వాళ్ళు నెమ్మదిగా కదిలారు. ఆ సాయంత్రం, కాంట్రాక్టరు అందరికీ నాలుగు రోజుల కూలీ లెక్క కట్టి ఇచ్చేసాడు.

***

ఆ సంఘటన జరిగిన నాలుగు రోజులకి...

గౌరమ్మా వాళ్ళూ శంకర్రావు ఇంట్లో మామిడి చెట్టు కింద భోజనాలు చేస్తున్నారు. వాళ్ళల్లో మల్లేశుని చూసి పార్వతి ఆశ్చర్య పోయింది.

వాళ్ళ దగ్గరికి వెళ్ళి "మీరు కలిసిపోయారేమిటి గౌరమ్మా! ఆ వేళ అంత దెబ్బలాడుకున్నారు?" అంది.

వాళ్ళు ముసిముసి నవ్వులు నవ్వారు.

"అమ్మా! మీ కాడ దాపరికమేల? ఆ కాంటాక్టరు యవ్వారం బాగుండదు. ఆ ఏల అందరికీ తెలిసేట్టు గోల చేస్తే కూలీ ఇచ్చేత్తాడనీ, కంటాక్టరు అద్దులో ఉంటాడనీ ఆ నాటకం ఆడినాము మాఁవు!" అంది గౌరమ్మ.

"మరి ఆ కాంట్రాక్టరునే అల్లరి పెట్టలేక పోయావా? పాపం ఈ మల్లేశుని ఇరికించావెందుకు?" అంది పార్వతి.

"అలగెలగమ్మా! నాను కూలీనాలీ సేసుకునేదాన్ని. ఆ బాబు కంటాక్టరు. పన్లోకి తీసుకోకపోతే నాకెలగ గడుస్తాది. ఈ ఇసయం తెలిసినాదంటే మా మేస్త్రీలు నన్ను పిలవకపోతే? అదే మాలో మాఁవయితే ఏ గొడబా ఉండదు. అందుకే నాను, మల్లేశూ, సంతోషీ కలిసి ఈ నాటకం ఆడినాం. మా సంతోషి మీ కాడ పొటో ఎలగ తియ్యాలో నేర్చింది గందా. అది పనికొచ్చినాది మాకు!" అంది నవ్వుతూ.

ఇదంతా విన్నాక, "ఔరా! గౌరమ్మా! చాణక్యుడి చెల్లెలా!" అని ఆశ్చర్యపోవడం, శంకర్రావు వంతైంది!

***0***



# పరిష్కారం

సుగుణ విష్ణుభట్ల

తెల్లారి పొద్దు దాటి బారెడు ఎండెక్కి పోయింది. వాణి గుమ్మం నుంచే అటు ఇటు తొంగి చూసి, ఈ మామ్మ కాదు గానీ చంపుతోంది. ఒక పట్టాన రాదు కదా! ఎనిమిదిన్నర అయినా ఎక్కడా అయిపు లేదు. ఈవిడ గారికి ఇంకా తెల్లారలేదు గామోసు.." అంటూ వాణి ఒకటే గొణుగుడు...

“అబ్బా, వస్తుందిలే.. పెద్దది కదా, ఒక అరగంట లేట్ చేస్తే అంతలా హడావిడి చేయాలా! నువ్వు ముందు లోపలికి వొచ్చి కాస్త కాఫీ లాంటిది నా మొహాన్న పొయ్.. వెళ్ళి కూరలు తేవాలిగా! మళ్ళీ ఫ్రెష్ గా లేవంటావు!" అన్నాడు మోహన్

"అసలు ఇంతకీ ఏవంటుంది మీ మామ్మ, ఎందుకుట ఈ ఆలస్యం, అడిగావా ఎప్పుడైనా?" అంటూ అడిగాడు మోహన్ కాఫీ చప్పరిస్తూ!

ఆయనొక పేరు మోసిన ఆడిటర్. కానీ ఇంట్లో ఏ ఆర్భాటాలు లేకుండా సామాన్యంగా ఉంటాడు!

"ఆ ఏముంది కొత్తగా తాగుబోతుల కొంపల్లో! పొద్దున్నే కూలికి పోతారు, సాయంకాలం వస్తూ చుక్కేసుకొస్తారు. ఇంట్లో ఇక పెళ్ళాం పిల్లలకి చుక్కలు చూపిస్తారు!" అంటూ చెప్పు కొచ్చింది.

“ఇంతకీ మామ్మకి ఎంత మంది పిల్లలు? వాళ్ళ ఆయనేం చేస్తాడు?” అడిగాడు మోహన్.

"వాడు కూడా తాగుబోతు వెధవే. దానికున్న బంగారం కాస్తా తాకట్టు పెట్టేసాడు. మామ్మ పెళ్ళైన కొత్తలో వీధుల్లో తిరుగుతూ కూరలు, పళ్ళు అమ్ముతూ.. ఏదో కొద్దో గొప్పో సంపాదించేది. డ్వాక్రా సంఘంలో చేరి, ఇద్దరాడపిల్లలకి వున్నంతలో కట్న కానుకలు ఇచ్చి పెళ్ళిళ్లు చేసింది. కానీ అల్లుళ్లు కూడా తాగుబోతు వెధవే అని తరవాత తెలిసిందిట. దాని పుట్టింటి తరపు వాళ్ళు కుదురుగల వాళ్ళేట. పెళ్ళిళ్లకి ఇద్దరాడ పిల్లలకి ఉంగరం, గొలుసు పెట్టారుట. దాని అక్క, బావ కొంచం స్థితిమంతులే. సొంత పొలం, కొబ్బరి తోట, ఓ ఇల్లు వున్నాయిట. పల్లెలో వుంటారు. మామ్మ, అన్న, తమ్ముడు ఆటోలు

'మన సమస్యలకు పరిష్కారం మన చేతుల్లోనే ఉంది. ఎటొచ్చీ ఆ చేతులకున్న సంకెళ్లు మనమే తెంచుకోవాలి'

నడుపుతూ బానే సంపాదించుకున్నారుట. తాగుడు గట్రా లేవు ఎవరికీ! మామ్మ మొగుడు తాగి తాగి క్రితం పండగల్లో పోయాడుట. వాడు కొట్టిన కొట్టుడుకి ఒళ్ళు హూనం అయి, ఇక తట్టలు మోయలేక ఇలా మన ఇంటి పనిలో చేరింది.. కొడుకు మంచివాడే, జూలో కేర్ టేకర్ గా చేరాడు. వాడి పెళ్ళాం పెంకిది. పది పాస్ అయి, టైలరింగ్ నేర్చుకుంది. అదీ దాని బడాయి. మొగుడు మంచివాడు, మెతక, తాగుడు లాంటివి లేవు. ఇద్దరు పిల్లలని మామ్మ మీద వొదిలేసి, దాని పని అది చూసుకుంటుందిట! 'ఇంట్లో వుంటే సుఖం నేదమ్మా, నా యాడ కూతుళ్లకి నా పోలికే వొచ్చినాదమ్మా. ఓ మూడు ఇళ్లలో పనులు గట్రా సేస్తారు. అదే ఆధారం. ఆరి పిల్లలు చదువుకుంటున్నారు' అంటూ బాధ పడుతుంది మామ్మ!"

ఇలా చెపుతుండగానే, తలుపు తోసుకుంటూ అప్పియమ్మ లోపలికి వచ్చింది.

వాణి మొహంలో 'పెళ్ళైన కొత్తలో సాయంత్రం తొందరగా వచ్చిన మొగుణ్ణి చూసినంత' ఆనందంతో ఇస్తాను మహానుభావా, కాస్త గుర్రం కట్టేయండి, మామ్మకెలాగు ఇవ్వాలిగా".

"అమ్మగారు, కొంచెం టీ చుక్క పోయండమ్మా. నిన్న సందెకాడి నుంచి తిండి నేదు. నిద్ర నేదు. నా కూతురి పానాలు తోడేస్తూన్నాడు తొత్తుకొడుకు. వీడి చేతులిరగ.. తినేత్తన్నాడమ్మా!" అంటూ బరబరా అంట్లు తోమడం మొదలెట్టింది. దాంతో వాణి మెత్తబడింది.

"రోజు వుండేదేగా ఇది.. ఇంతకీ ఏవంటాడే ఆ వెధవ..?"

"తాగుబోతు సచ్చినోడమ్మా, రోజు కూలి పనికి పోవడం నేదు. ఒకరోజు పోతే నాలుగు రోజులు తాగి తొంగోడమే! నిన్న సందేల పూటుగా తాగి వొచ్చి, 'బాప్ప, ఏదే నీ కూతురు.. ఎవడితో అంపావు.?' అంటూ మా వీధిలో ఒకటే రంకెలు! సమయానికి నా కొడుకునేడు... వుంటేనా, మక్కలిరగొట్టేవోడు సచ్చినోడికి! అప్పటికి చెప్పాను, 'నా కూతురు తానం ఆడుతోందిరా బాబు' అని, ఇనడే...తాగుబోతు యదవ! పక్కవీధిలో నుంచి పిల్లా, దాని పిల్లలు లగేత్తుకొచ్చి ఆడ్ని లాక్కొని పోయారు. దారంతా పిల్ల జుట్టు పట్టి లాగి కొడుతోనే వున్నాడమ్మా.. తొత్తు కొడుకు ఎపుడు సస్తాడో కానీ! ఉండబట్టనేక నేకూడా పోయానమ్మా.. ఎంతైనా కన్న పానం కదమ్మా. ఇంటిలోకి దూరగానే గురకెట్టాడమ్మా! పోనిలే తొంగున్నాడు, ఇక అప్పుడే నెగడుగదా అని ఎలిపోచ్చాను. బువ్వ తిని తొంగుదామనుకోగనే. మళ్ళీ మొదలెట్టినాడు గొల్లుగాడు! 'కూడు ఎట్టమంటూ' రంకెలు. వున్నదేదో పెడితే, బువ్వలోకి కోడికూర వేయమని గోలంట. ఆడి కొడుకు, 'డబ్బులేయి కూరకి, నీ వియనేదుగా?' అన్నాడని, పక్కనున్న వూచ నాగి కొట్టేసాడమ్మా పిల్లగాన్ని! బుగ్గ చీరుకు పోయిందమ్మ నా మనవడి బాచిగాడికి. పదో కలాసు చదివే కుర్రాడు ఆడు. వాడి ముందే పెళ్ళాం చేయట్టుకుంటాడు. బుద్ధి లేని ఎదవ, కొట్టకుండా అడ్డుపడ్డారని పిల్లలు తినే కూడులో గాజు పెంకులు పోసినాడమ్మా.. సచ్చినోడు! డాక్టర్ కాడికి కెళ్ళితే, కుట్లు అవి యేసి, పదమూడొందలు బిల్లు యేసినారు! ఆడి కూతురికి పద్నాలుగు యేళ్ళు నిండా నేవు.. 'పెళ్లి చేసేసి తోలేయాలి' అని ఒక తాగుబోతువోన్ని సూసినాడు. వీడి గోల పడనేక వీధిలో వాళ్ళు, నా కొడుకు అడ్డు కొని, పోలీసులకు అప్పగించేరమ్మా. తొందరగా పని చేసుకోని పిల్లకి సాయం ఎళతానమ్మా. పోలీసులు

మా ఈధిలో కొచ్చి అందరినీ ఇచారిస్తామన్నారు! ఇంటికి తీసుకెళితే కోడలు ఒప్పుకోదు. ఎంతైనా కోడలు మనది కాదుగదా.. ఇంటికి రానీయదు. కనీసం లోపలికి రమ్మని కూడా అననేదమ్మా ఆళ్ళని! నా కొడుకు మంచోడు, 'అమ్మా.. తిన్నావా, నేదా?' అని అడుగుతాడు. నా కొడుకు నా మనో యేదన సూడనేక, ఈ బాధలు పడలేక, ఎవరో తెలిసినోళ్లు నాటుకోళ్ల ఫారంలో రాత్రి వాచ్మాన్ గా రమ్మని పిలిచినారు. పన్నెండొండలు జీతం ఇస్తారమ్మా! అడకెళ్లి పోదాం, పద ఓ లమ్మా' అనీసాడు! ఆడకూతుర్లు అన్నాయం అయిపోతారు అని ఆలోచిస్తూన్నానమ్మా! ఏటవుతాదో ఏటో!" అంటూ గిన్నెలు తట్టలో సర్ది, చీరెగ్గట్టి చీపురందుకుంది.
"నా రాత ఇలా తగలడింది గాని, నా వాళ్ళలా సుఖపడే రాత రాయల ఆ భగమంతుడు!" అంటూ ఏదో గొణుక్కుంటూ ఉంది.
భార్యాభర్తలిద్దరూ విన్నారు ఇదంతా. వాణి, మోహన్ వంక చూసింది ఏదైనా సాయం చేయచ్చుగా అన్నట్టు .. వాణి వంక సాలోచనగా చూస్తూ, తల ఊపారు ఆయన!
"మామ్మ, నేనొక మాట చెపుతా వింటావా! ఈ గొడవలు అవి లేకుండా, నువ్వు నీ పిల్లలు హాయిగా బతికేలా!"
అంతే.. చీపురక్కడే పడేసి, చీర చెంగు భుజం మీదుగా కప్పుకుంటూ "అయ్యా, మారాజా, అంతకన్నా నా తండ్రి!" అంటూ కాళ్ళు మీద పడినంత పని చేసింది.
“అయ్యో మామ్మా! లేముందు, నా తల్లి లాంటి దానివి. ముందు చెప్పే విషయం విను! నాకు తెలిసిన పెద్ద స్కూల్ వాళ్ళు వున్నారు. వారికి హాస్టల్ కూడా వుంది. అందులో పని చేయడానికి మనుషులు కావాలన్నారు. నీ కూతుర్లకి చెప్పు.. బాగా ఆలోచించమని! పిల్లలకి స్కూల్ లో సీట్లు ఇవ్వమని కూడా చెపుతాను. అక్కడే తింటూ, చదువుకుంటూ పెరుగుతారు. ఇంటి బాధ కూడా ఉండదు. అక్కడే ఉండేలా ఏర్పాటు చేస్తాను. ఏ సంగతి నువ్వు, నీ పిల్లలు, నీ కొడుకు బాగా ఆలోచించి రేపు చెప్పండి. సరేనా!" అంటూ దైర్యం చెప్పారు.

మామ్మ కూతుళ్లు, పిల్లలు వేరే ఆలోచన లేకుండా స్కూల్ పనిలో చేరి పోయారు. అవును మరి, ఎంతగా విసిగిపోయారో ఆ తాగుబోతు మొగుళ్ళతో! తాగి, తాగి పశువుల్లా మీద పడి కొట్టి, కాలితో తన్ని, ఎక్కడ పడితే అక్కడ కొరికేసే ఇలాంటి వింత పశువుల విషయాల్లో, ఆ మాత్రం తెగింపు, దైర్యం ఉండాల్సిందే ఆడాళ్ళకి! వాళ్ళ జీవితం పాడైనా, పిల్లలకైనా ఒక మంచి భవిష్యత్ ఉంటుందని వారి నమ్మకం.

రోజులు గడుస్తున్నాయి! మామ్మ, కొడుకు చాలా సంతోషంగా తమ పనులు ప్రశాంతంగా చేసుకుంటున్నారు.

ఈ లోగా వాళ్ళ మొగుళ్ళని, వాళ్ళకి వంత పాడిన మామ్మ వీరకత్తెలని, ఆడపడుచులని పోలీసులు బాగా కుళ్ళబొడిచి, మళ్ళీ ఇలాంటివి చేస్తే జైల్లో పెట్టి, చిప్ప కూడు తినిపిస్తామని హెచ్చరించి మరీ వదిలి పెట్టారు మోహన్ గారి పుణ్యమా అని.

ఇంతలో దీపావళి పండగ వొచ్చింది. స్కూల్ కి మూడు రోజులు సెలవులు రావడంతో పుట్టింటికి వొచ్చి, వాణి, మోహన్ గారిని చూడటానికి స్వీట్లు, పళ్ళు కూడా పట్టు కొని మరీ వచ్చారు కృతజ్ఞతగా. ఆ మొహాల్లో పండగ సంబరాలు కనిపిస్తున్నాయి.
"అయ్యా, ఇదంతా మీ చలవే కదా!" అన్నట్టు వున్నాయి వారి చూపులు!

వారి కళ్ళలో మతాబులు, వారి నవ్వుల్లో కాకరపువ్వొత్తులు, మొహాల్లో చిచ్చుబుడ్డి వెలుగులు కానవచ్చాయి ఆ దంపతులకు. సాయంత్రం పండగ సందడంతా పగలే వచ్చినట్టుంది ఆ ఇంట్లో.
మామ్మ అయితే, "అమ్మా! మీరియాల ఏ పని, చివరికి వంట పని కూడా సేయద్దు. మా పిల్లలే సేత్తారు. ఆలాగైన వారి ఋణం కూసింత తీర్చుకుంటారు. మీరు ఊ అనండి అమ్మా" అంటూ ఒకటే బ్రతిమాలడం. ఇక సరే అనక తప్పలేదు వారికి.

"నే బ్రతికినంత కాలం మీ దగ్గరన్నే వుంతా మీ మంచి చెడ్డ చూసుకుంతా. నా కొడుకు కూడా చెప్పమన్నాడయ్యా. సారు క్యాంపులకని దూరం వెళితే సాయం వెళ్ళి, డ్రైవింగు అది నానే సేస్తాను. మనమే జాగ్రత్తగా చూసుకుందాం ఆరిని అన్నాడయ్యా!" అంటూ మామ్మ కళ్ళ నీరు పెట్టింది.
ఎందుకంటే.. వారు నిస్సంతులు మరి!
ఇదే కదా నిజమైన దీపావళి వారికైనా, వీరికైనా.. !

***0***



# తరువాతేమిటి?

సునీత పోతూరి

"ఎవరు నువ్వు?" అనుమానంగా చూసింది ఆమె.

"నేనే." చిరునవ్వుతో బదులిచ్చాడు అతను.

ఆమె.. " ఎందుకొచ్చావ్?"

"నిన్ను చూద్దామని. రమ్మన్నావుగా!" చెప్పాడతను దగ్గర కూర్చుని.

"నేనా? నేనా?" రెట్టించింది ... విసుగ్గా

"పోనీ నేనే నిన్ను చూద్దామని వచ్చాను సరా. రావడం కాస్త ఆలస్యం అయింది. ట్రాఫిక్జామ్." అనునయంగా ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకున్నాడు.

తామరతూళ్లు అనేవాడు.. ఇప్పుడూను... బలహీనంగా తేలిగ్గా, మృదువుగా... పూవుల్లా...

"అది సరే. ఇవాళ మందులు అవీ వేసుకున్నావా?" అడిగాడు. ఓ చేత్తో జుట్టు సవరిస్తూ. చేయి విడిపించేసుకుని పక్కకి తోసింది.

"వేసుకున్నానో లేదో ఎందుకా ఆరాలన్నీ? ఇంతకీ ఎవరు నువ్వు?"

"అదేమిటి! నేనే మహా... రాఘువ."

"రాఘువా...?" కనుబొమలు ముడిచి...

"మీరా...!" తిరిగి మొహంలోకి చూస్తూ..

ఆ ఒక్క మాటతో తెలియని నిశ్చింత. వెచ్చగా హృదయాన్ని తాకింది. ప్రేమగా, చనువుగా తల నిమురుతూంటే, ఈసారి చేయి తోసేయలేదు.

"నా చేతులు వాసన చూడండి.. పూల వాసన రావడం లేదూ!" ఏదో రహస్యం చెబుతున్నట్టు చెబుతూ చాచిన ఆమె చేతులను మొహానికి ఆనించుకున్నాడు. నిజమే... ఏదో సువాసన... చాలా మైల్డ్ గా. బహుశా తన దుస్తుల నుండి అయి వుంటుంది.

ఆమెకు దగ్గరగా వున్నానన్న స్పృహ తప్ప మరో ఆలోచన లేదు.

ఉన్నపళంగా మహా... మహాలక్ష్మిని తీసుకుని సముద్రం ఒడ్డుకో, ఆరుబయటకో వెళ్లాలనిపించింది.

పండు వెన్నెలలోనో... ఎలక్ట్రిక్ దీపాలలోనో..! ఏదైతేనేం. తనకి పోయెట్రీ ఇష్టం.

వంతుల వారిగా పద్యాలను గుర్తు చేసుకుంటూ... షెల్లీనో, కీట్సో ఎవరైతేనేం, పెద్దన కూడా కావచ్చు! మనసుల మధ్య వంతెనలను పేర్చుకుపోవడానికి!

ఈ మధ్య  మహాలక్ష్మికి ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి పెరుగుతూ వచ్చింది. భక్తి సాహిత్యం. నేను ఏది చూడాలో అది చూసే శక్తి ఇప్పుడు వచ్చింది అన్నది. క్రమంగా  నిద్రలోకి జారినట్టు బరువుగా శ్వాస. చేయి పట్టుకునే వుంది.. నిట్టూర్పుతో బయటకు నడిచాడతను.

***

అక్కడ అంతా  వింత వెలుగు..!  గూడు దాటి బయట చీకట్లు దూరం చేసే ప్రయత్నంలో, వరుసగా దీపాలు నిశ్చలంగా...!

చీకటివెలుగులు ద్వంద్వ సమాసాల్లా చెట్టాపట్టాలేసుకున్నాయి!! తేలి, తేలి వచ్చే పూల సుగంధం. అప్పుడు గమనించింది అందరినీ.. చాలామంది వున్నారు. అంతా చక్కని యవ్వనవతులే! పూల రాశుల ముందు కూర్చుని దండలు అల్లుతూ... పాటలు పాడుతున్నారు. తల దించుకుని  చక్కని స్వరాన రాగాలు తీస్తూ మాల కడుతోంది ఆ అమ్మాయి.  దగ్గరకు వెళ్లి కూర్చుంది.

ఆ అమ్మాయి తలెత్తి చూసి పాడటం ఆపి, పలకరింపుగా నవ్వింది. వజ్రపు పొడి వెదజల్లినట్లైంది.. ఝల్లుమంది!

చందమామలాంటి  మొహం...  పైకి తీసి ముడివేసిన జట్టులోంచి ఓ అల్లరి పాయ  తప్పించుకు వచ్చి నుదుటి మీద చిరు గాలికి ఊగే తీగలా అల్లల్లాడుతూ... బలవంతంగా చూపు తిప్పుకుంది తను.

"ఇప్పుడే లేచావా? నిద్ర బాగా పట్టిందా?"  మెత్తని స్వరం.

నవ్వింది బదులుగా.  "ఊ.....  కాని, ఏవో కలలు. ఎవరో చేయిపట్టుకొని రమ్మని లాక్కుపోతున్నారు.. తెలుస్తున్నట్లే వుంది కాని, మెలకువ రాదు. కాసేపు తరువాత బాగానే నిద్ర పట్టింది.  కల తాలూకు అలజడి ఏదో అలాగే వుంది ఇప్పటికీ."

"కొన్ని కలలు అంతే. మెలకువలోనూ వెంటాడుతాయి."

తన పేరు దేవి అని చెప్పింది.

"ఇందా.. నువ్వూ కాసిని పూలు తీసుకుని మాలలు కట్టు.." కొన్ని విడి పూలు గుట్టగా తన ముందు పోసింది.

"అయ్యో నాకు చేత కాదే.. పూల గొంతుకు ఉరి బిగించినట్టు ఉంటుందని, ఎప్పుడూ నేర్చుకోలేదు."

"ఇదిగో మెత్తటి నార. నారతో కడితే పూలు, ఆ బంధంలో మెత్తగా వొదిగి పోతాయి. ప్రయత్నం చేసి చూడు. నూలు పోగులతో అయితే నీవన్నట్టు ఉరి బిగింపు కాని."

ఒకటి రెండుసార్లు చూసాక, సుళువు తెలిసింది... నార మెలిక, సుతారంగా ముడి వేయగానే, పూలు గుత్తగా ఆ ముడిలో కుదురుకోవడం. తన పని తనకే అద్భుతమైన 'కళ'లా అనిపించింది. తనకి పని అప్పగించాక, మళ్ళీ తన పూలమాల సవరింపుల్లో పడిపోయింది...

"ఈ పూలమాలలు అన్నీ ఏంచేస్తారు?"

"ఇంకెక్కడికి, శ్రీకృష్ణ మందిరానికి. తెలవారక ముందే ఇవన్నీ జరగాలి. త్వరగా కానీయండి." మిగతా వారిని కూడా మృదువుగా హెచ్చరించి... నెమ్మదిగా చక్కని ఓ గీతం పాడసాగింది. వాళ్లంతా గొంతు కలిపారు. ఏ భాషో ఏమో... మధురంగా ఉంది.

కృష్ణుడి మీద కామోసు... సన్నగా, మెత్తగా పూల మీద తేనె జాలువారినట్టు..! ఆ మాధుర్యానికి.. తల వూపసాగింది తనూ.

అకస్మాత్తుగా ఆ పాట తనకు బాగా పరిచయం ఉన్న పాటలా తోచింది. తనూ అలాగే పాడగలను అనిపించింది. గొంతు కలిపింది... అదే వరుసలో..

మార్గశిర మాసమునా...
నీరాడబోదురే చెలులార..!

ఎక్కడో దూరంగా... చిరు చలి గాలుల పలకరింపులకి శృతి చేసిన వీణ మోగినట్టు చిరు మువ్వల మోత... మంచు తెరలు, తెరలు కట్టి... లేగ దూడలు పొదుగులు కుమ్ముతుంటే, ఆవులు అరుస్తూన్నాయ్! గొడ్లసావిడి దగ్గర తచ్చాడుతూ...గోమయం రెండు చేతులా.... వాకిట... కళ్లాపులు చల్లుతూ... రంగవల్లికలు దిద్దుతూ.. అమ్మ!

"గుమ్మడేడే...గోపి దేవి.. గుమ్మడేడే కన్నతల్లి గుమ్మడిని చూపించగదవే...కృష్ణా!" వీపు మీద వాలిన బిడ్డని ముందుకి తీసుకుని హత్తుకుంటూ.. ముద్దులాడుతూ... అమ్మే!

ముగ్గుల మధ్య గొబ్బిళ్ళు... ! ముళ్ల గోరింట పూలు...పసుపూ కుంకం .. బొట్లు.. పూజ. పరికిణీ కుచ్చెళ్లు దగ్గరగా తీసుకుని.. పీట మీద కూర్చుని...అరరె.. అంటనే అంటింది..."

హ్హా... హ్హహ్హా..!"

పూర్తి చేయకుండానే సిగ్గుల నవ్వులు..!

అవునూ... ఏడీ అతను? ఎక్కడికి వచ్చింది తను?ఎందుకు ఇక్కడే వదిలి వెళ్లిపోయారు అంతా? ఇంత చలిగా ఉందేమిటి?

ఎవరైనా వచ్చి ఏసి తగ్గిస్తే బాగుండును.

***

"తెలివి వచ్చిందా?" బయట ఎవరో అడుగుతున్నారు.

"లేదు ఇంకా..."

"హాల్యుసినేషన్ లోనే.. సంబంధం లేని మాటలు కూడా."

"అత్తయ్యగారు నన్ను గుర్తు పట్టారు."

"అది నిన్న.. నాతోనూ మాటాడింది. ఒక్కత్తివే వచ్చావా? రామం రాలేదా అని తనని అడిగింది కూడా."

"నేటికి వారం..."

"అవును. మూడో నాటికే రూమ్ కి మారుస్తా అన్నారు."

కారిడార్లో కూతురు, కోడలు కబుర్లు వింటూ ఆలోచనలో పడ్డాడు రాఘువ. ఏదో 'సిస్ట్' ట. చిన్న ఆపరేషన్ అన్నారు. ఆపరేషన్ సక్సెస్ అన్నారు కాని, ఆమె పరిస్థితి ఇలా వుంది.

బంధువులు అంతా వచ్చి చూసారు. ఎన్నో మాటలు. వివరాలడగడం. పుణ్యమాసంట. తిథి వారాలు తిరగేయడం. వాళ్లకి తోచింది అనేయడం. పరి పరి విధాలు పోతోంది మనసు. 'మహా' కి ఏమైనా అయితే తను తట్టుకోగలడా అని.

"జాతస్య హి ధ్రువో మృత్యుః" అది తెలియనిది ఎవరికి?

"తరువాతేమిటి?" అకస్మాత్తుగా ప్రశ్నించింది ఓనాడు. "దేని తరువాత?"

"అది తెలుసుకోవాలనే ..."

"అలా ఏ ఉపోద్ఘాతం లేకుండా ప్రశ్నిస్తే?"

"నేను మిమ్మల్ని మరచి పోతే.. మతి మరుపు వస్తే? అని. అసలు నాకేమైనా అయితే? మీరు నిన్న బయటకు వెళ్లినప్పుడు... కళ్లు తిరిగినట్లైంది, కాసేపు నేను ఎక్కడ ఉన్నానో తెలియలేదు. భయం వేసింది. తరువాత మామూలే అనుకోండి."

కంగారు పడ్డాడు. డాక్టర్ దగ్గరికి పదమన్నాడు. ఇప్పుడు లేదుగా ఎందుకు అని తప్పించుకుంది. కాని ఇంత దూరం తెచ్చిపెట్టింది ఆలస్యం చేసి.

నిన్నటి రోజు తనని గుర్తుపట్టినట్టే వుంది. చేతిని గట్టిగా పట్టుకునే వుంది ఉన్నంత సేపూ. తన కబుర్లకి స్వాంతన పొందినట్టే...

"నాన్నా! నాన్నా!" చేతి మీద తట్టి లేపింది. ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు.. కూతురు కళ్యాణి ఎదురుగా. కూర్చున్న చోటనే సర్దుకుని చూసాడు.

"అమ్మ..." మాట రాక కళ్ల నీళ్లతో కళ్యాణి..! అర్థమయింది.

"ఎప్పుడు?"

"హార్టటాక్ ... నర్స్ చెప్పింది. ఫార్మాలిటీస్ అవీ... తను వెళ్లారు." మిగతా మాటలు వినిపించడం మానేసాయి అతనికి.

'ఎవరూ?' అయోమయంగా గొణుకుతున్నాడు.

***0***

# సొంత గూటికి

తెలికిచెర్ల విజయలక్ష్మి



"రాజా, నాయనా రాజా" అని గట్టిగా తండ్రి పిలిచిన పిలుపుకి, మంచి నిద్రలో ఉన్న రాజు పరుగున వచ్చేడు.

"నాన్నా, ఏంటయింది? మంచినీళ్లు కావాలా?" అన్నాడు.

"ఆయాసంగా ఉందిరా, ఊపిరి అందటం లేదు. నేనేమైనా అయిపోతానేమో, నిన్ను మళ్లీ చూడలేనేమో అని భయం వేసి, నిన్ను చూడాలని పిలిచేనురా!" అంటూ ఆయాసపడుతూ రాజు తండ్రి రాఘవయ్య చెప్తూంటే...

"వద్దు నాన్నా అలా అనద్దు, హాస్పిటల్ కి వెళదాము. ప్రెసిడెంట్ గారి వేను తీసుకు వస్తాను, నువ్వు ధైర్యంగా ఉండు!" అని తండ్రికి ధైర్యం చెప్పి... "సరోజా, నువ్వు నాన్న దగ్గర కూర్చో, నేను అరగంటలో వస్తాను!" అని భార్యకి చెప్పి, రాజు పరుగున ప్రెసిడెంట్ గారి ఇంటికి వెళ్ళేడు.

***

రాఘవయ్యకు రాజు ఒక్కడే కొడుకు. రాజు అయిదు సంవత్సరాల వయసులో రాఘవయ్య భార్య కన్ను మూసింది. రాఘవయ్య మళ్లీ పెళ్లి చేసుకోకుండా, రాజుని అపురూపంగా పెంచేడు. మంచి మార్కులతో పాస్ అవుతున్న కొడుకుని చూసి పొంగిపోయేవాడు. కొడుకుని ఎలాగయినా విదేశాలకి పంపించాలని అనుకునేవాడు.

రాజుకి తండ్రి అంటే అమితమైన ప్రేమ, క్లాసులు పెరుగుతున్న కొద్దీ... తండ్రి తనని విదేశాలకు పంపే ప్రయత్నం గమనించి, టెన్త్ క్లాస్ లో కావాలని మూడు సబ్జెక్ట్స్ లో ఫెయిల్ అయ్యాడు.

'నేను మరి చదవను, నీతో పాటు వ్యవసాయం చేస్తానని' అంటూ మొండి పట్టు పట్టి, చదువు మానేసి తండ్రితో పాటూ వ్యవసాయంలోకి దిగి తండ్రిని వెన్నంటి నీడలా ఉండిపోయాడు రాజు.

రాజుకి పెళ్లయింది, ఇద్దరు పిల్లలు. అందరూ సంతోషంగా ఉన్నారు. రెండు సంవత్సరాల నుంచీ రాఘవయ్యకు అనారోగ్యం చేస్తోంది. టౌన్ లో హాస్పిటల్లో చూపిస్తున్నాడు రాజు. మందులు వాడుతున్నారు. పెద్దగా ప్రయోజనం కనిపించటం లేదు.

నాలుగయిదు రోజులలో కాస్తా వెసులుబాటు చూసుకొని, విశాఖపట్నం తీసుకువెళ్ళి మంచి పేరున్న హాస్పిటల్లో చూపించాలి అనుకున్నాడు. అంతలోనే తండ్రికి బాగులేక పోవటంతో, మళ్లీ టౌన్ లో ఎప్పుడూ తీసుకువెళ్ళే హాస్పిటల్ కే తీసుకు వెళ్ళవలసివచ్చింది.

'రోగి పేకాటలో ఆసు ముక్క. డబ్బు పత్తి. వీళ్లిద్దర్నీ కలిపే ఆట వైద్యం. వేదిక ఆసుపత్రి'

"ఎలాగయినా మా నాన్నకు బాగు చెయ్యండి ఎంతయినా ఖర్చు పెడతాను!" అని ఏడ్చేడు రాజు.

ఆక్సిజన్ పెట్టేరు, చెయ్యవలసిన ప్రయత్నం చేస్తున్నారు.  ఊపిరి అందుకోవటం కష్టంగా ఉంది.
"మా నాన్న చనిపోకూడదు, బతకాలి. మా నాన్నను బతికించండి డాక్టర్!" అని రాజు ఏడుస్తున్నాడు.
డాక్టర్ రాజుని పిలిచి "మీ నాన్న పరిస్థితి కష్టంగా ఉంది. ఇక్కడే ఉంచితే ప్రాణాన్ని దక్కించలేము.  అన్ని సదుపాయాలు ఉండే ఇంకేదైనా హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళండి!" అని చెప్పారు.
హాస్పిటల్ వారి సహాయంతో అంబులెన్స్ లో చాలా పెద్ద హాస్పిటల్ కి తీసుకు వెళ్ళేడు రాజు. గేటులోకి అంబులెన్సు ప్రవేశించగానే పరుగున వచ్చి స్టాఫ్ రాఘువయ్యని లోపలకు తీసుకుపోయారు. ఐ సీ యు లో ఉంచేరు.  బైపాస్ ద్వారా శ్వాస అందించటం వలన, శ్వాస నిలకడగా ఉంది అని చెప్పారు స్టాఫ్.
తనతో పాటూ తెచ్చుకున్న రెండు లక్షల్లో కొంత మొత్తం చిన్న హాస్పిటల్ లో అయిపోయాయి. ఇక్కడ ముందు లక్ష అడ్వాన్సు కట్టమన్నారు. తండ్రిని బాగు చేయించుకోగలను అనే సంతోషంతో డబ్బు కట్టేడు రాజు.
"రాఘువయ్య మనుషులు ఎవరూ?" అంటూ...నర్స్ అడిగింది.
పరుగున వెళ్ళి "నేనండీ వారి అబ్బాయిని" అన్నాడు రాజు.
"రాఘువయ్య కి ఎమ్మార్ ఐ స్కాన్, అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీ చెయ్యాలి. ఇంకా వెన్ను లో నించి లిక్విడ్ తీసి టెస్ట్ చెయ్యాలి, మీకు  ఓకె అయితే ఇక్కడ సంతకం చెయ్యండి!" అంది నర్స్.
"అవన్నీ చేస్తే, మా నాన్న బాగవుతాడా సిస్టర్? నేను సంతకం చేస్తాను,  తప్పకుండా పరీక్షలు చెయ్యండి!" అన్నాడు ఆశగా రాజు.
"బాగు చెయ్యాలనే మా ప్రయత్నం. వీటన్నిటికీ పాతిక వేల దాకా అవుతుంది, చెయ్యమంటారా?" అంది నర్స్.
"చెయ్యండి సిస్టర్, ఎలాగయినా మా నాన్నకు బాగు చెయ్యండి!" అన్నాడు ఏడుపు నిండిన గొంతుతో రాజు.

***

"కొంత పొలం అమ్ముతాను, నాకు డబ్బు అవసరముంది!" అని ప్రెసిడెంట్ కి ఫోన్ చేసాడు రాజు.
"అయ్యో, నేను డబ్బు పంపిస్తాను, ముందు మీ నాన్నని చూసుకో, డబ్బు గురించి బెంగపడకు!" అంటూ పెద్దమొత్తంలో డబ్బుని రాజుకి పంపించేడు.
రాఘువయ్యకి టెస్టులన్నీ అయ్యాయి. ఎండోస్కోపీ చేసినప్పుడు గొంతు అంతా చీరుకు పోయి రక్తం వస్తూంటే... రాజు ప్రాణం విలవిల లాడింది.
"కొద్ది రోజులు నాన్నా... తగ్గిపోతుంది!"  అని తండ్రిని ఓదార్చేడు రాజు.

తండ్రి చెయ్యి ఒళ్ళోకి తీసుకుంటే... ఏడుపు వస్తోంది. రోజులు గడుస్తున్నాయి. ఏవో టెస్టులు చేస్తున్నారు, ఇంజెక్షన్లు మందులు ఇస్తూనే ఉన్నారు. డబ్బు మంచినీళ్లు లా కరిగిపోతోంది. నాన్నలో ఏమాత్రం బాగైన సూచనలు కనిపించటం లేదు.

ఐ సి యూ నుంచి రాఘవయ్యని వార్డ్ లో పెట్టేరు. అస్తమానం బైపాస్ ని తీసే ప్రయత్నం చేస్తూ, ఏడుస్తూ కాళ్ళు కొట్టుకుంటున్న తండ్రిని చూస్తుంటే, రాజుకి 'నేనేమైనా తప్పు చేసానా?' అనే సందేహం కలుగుతోంది. తండ్రికి ఆ బాధ ప్రత్యక్ష నరకంలా ఉంది.

యూరిన్పైప్ పెట్టి పెట్టి అక్కడంతా ఇన్ఫెక్షన్ అయిపోయింది. వీపంతా బెడ్సోర్స్ అయ్యేయి. 'నాన్న బాగవుతాడా అసలు? భగవంతుడా, నేనేం పాపం చేశాను నాన్నను ఈ పరిస్థితిలో చూడవలసివస్తోంది!' అని ఎన్ని సార్లు అనుకున్నాడో రాజు. తండ్రి పడే నరక యాతన వర్ణనాతీతంగా ఉంది, చూడలేక పోతున్నాడు. నాన్నను, మునపటిలా చూడగలుగుతానా? అనే సందేహం కలుగుతోంది రాజుకి.

డబ్బులు అయిపోతున్నాయి. ఫోన్ చేసినప్పుడల్లా... లేదు అనకుండా ప్రెసిడెంట్ గారు డబ్బు పంపిస్తున్నారు. దరిదాపు నెల రోజులైంది హాస్పిటల్లో జాయినయి. వెంట్రుకవాసి కూడా మెరుగు కనిపించటం లేదు, సరికదా మొదటి కన్నా పరిస్థితి చాలా దయనీయంగా తయారయ్యింది. రాఘవయ్య శరీరానికి నీరు బాగా పట్టింది, మళ్లీ ఏవో టెస్టులు చేస్తామన్నారు. రాఘవయ్య వద్దు వద్దు అంటూ... బుర్ర తిప్పుతూ దండం పెడుతున్నాడు. ఇంటికి తీసుకు వెళ్ళమని సైగలు చేస్తున్నాడు. జాలిగా నోరు విప్పి చెప్పలేక కన్నీళ్లు కారుస్తూ... అభ్యర్థిస్తున్న నాన్న బాధ చూస్తూ "నీ బాధ తీర్చటానికి నేను ఏం చెయ్యగలను నాన్నా?" అనుకున్నాడు రాజు.

మెడలో శిలువ వేసుకొని అమృత మూర్తిలా ఉన్న సిస్టర్ కరుణ డ్యూటికి వచ్చింది.

"ఎలా వున్నారు మిస్టర్ రాఘవ?" అంటూ నవ్వుతూ రాజుని పలకరించింది. ఆమెని చూడగానే 'అమ్మ ఉంటే బాగుండును' అనిపించింది. దిగులుగా ఉన్న రాజు తలమీద చెయ్యివేసింది. ఆమె స్పర్శతో రాజు కళ్ళు గండి పడిన కాలువలా ప్రవహిస్తున్నాయి. ఆమె చెయ్యి పట్టుకొని కరువు తీరా విలపించేడు రాజు.

"మై సన్ రాజు, నా మాట ఒకటి వింటావా?" అంది సిస్టర్.

"చెప్పండి సిస్టర్" అన్నాడు రాజు.

"మీ నాన్న అంటే నీకు చాలా ప్రేమ. నిజమే, అందరం ఏదో ఒకరోజు వెళ్ళక తప్పదు. నీ దగ్గర కార్పొరేట్ హాస్పిటల్లో ఉంచి భరించే ఆర్థిక స్థోమత లేదు, నువ్వు బాధ పడుతూ, మిష్టర్ రాఘవని ఎందుకు ఇంత బాధ పెడుతున్నావు? నీకు ఇంకా అర్థం కావటం లేదా? అతన్ని ప్రశాంతంగా మీ ఊరికి తీసుకుపో, ఎక్కువగా ఆలోచించకు, అవసరం పడినప్పుడు దగ్గరలో ఉండే డాక్టర్ని పిలిచి చూపించు!" అంది సిస్టర్ కరుణ.

"ఎలా సిస్టర్.. ఇలాంటి పరిస్థితిలో నాన్నని కదిలించగలనా? అసలు డాక్టర్స్ ఒప్పుకుంటారా?" అన్నాడు భయంగా.

"రిసెప్షన్ లో వెళ్లి చెప్పు, నా దగ్గర అస్సలు డబ్బు లేదని. ఊరికి వెళ్లి మళ్లీ వస్తాను అని చెప్పు. నేను కూడా మేనేజ్‌మెంట్ తో మాట్లాడతాను, రేపే డిశ్చార్జ్ చేస్తారు!" అంది సిస్టర్ కరుణ.

"ఇలా చావుబతుకుల మధ్య ఉన్న నాన్నను ఎలా తీసుకు వెళతాను సిస్టర్?" అన్నాడు రాజు బేలగా.

"నువ్వు ఏదైనా వెహికల్ మాట్లాడుకో, నేను ఆక్సిజన్ సిలెండర్ ఇస్తాను. అతన్ని ఉన్న ఊరిలో హాయిగా శ్వాస విడవనీ, ప్రశాంతంగా పర లోకాలకు వెళ్లనీ. ఇదంతా ప్రకృతి ధర్మం, బాధగా ఉంటుంది నీ తండ్రి నీకు దూరమౌతూంటే... నీకు తండ్రి అనే బంధం కోసం అతన్ని బాధ పెట్టడం న్యాయమా? నువ్వే చెప్పు" అంది కరుణ.

'అవును నిజమే, నాన్న నాకు దూరమవకూడదనే స్వార్థంతో... నేను నా కోసం నాన్నను బాధ పెట్టేను. నా పొరపాటుకు నాన్న శిక్ష అనుభవిస్తున్నారు' అనుకున్నాడు రాజు.

***

హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన రాఘువ, కొడుకు ఒళ్ళో తల పెట్టుకొని, చేతిని గట్టిగా పట్టుకొని, 'నాన్న నీకెపుడూ... మానసికంగా దూరం కాడు' అనే కొండంత ధైర్యాన్ని తన స్పర్శతో ఇస్తూ..."విత్తనాలు ఎప్పుడు వేస్తావు రాజూ?" అన్నాడు.

"ఇంటికి వచ్చేస్తున్నాము కదా నాన్నా, రేపే మనిద్దరమూ కలిసి విత్తనాలు జల్లుదాము. ఎప్పటిలా మనం శ్రమించి, వేయి కళ్లతో కాపలాకాసి, బోల్డంత పంట పండించి ఇంటికి తెచ్చుకుందామా నాన్నా!" అన్నాడు రాజు.

"అలాగే రా" అంటూ 'ఎన్నాళ్ళు బతుకుతానో తెలియదు? కొడుక్కి తను లేని లోటు తెలియకూడదు. తను దూరమైతే తట్టుకోగలిగే శక్తి, తనను వదిలి ఉండటానికి మానసికంగా సిద్ధం అయే బలమివ్వు తండ్రీ నా బిడ్డకి' అని భగవంతుని ప్రార్థిస్తూ... రాఘువయ్య తన సొంత గూటికి చేరుకుంటున్నందుకు తృప్తిగా, బరువుగా ఊపిరి తీసుకున్నాడు.

***0***



# పండగ సందడి

బి లక్ష్మి శర్మ

తూర్పు దిక్కున ఉదయిస్తున్న లేలేత కిరణాలు కిటికీగుండా లోపలికి తొంగి చూస్తుంటే, పక్షుల కిలకిలారావాలు ధ్వనికి దిగ్గున లేచి కూర్చుంది సరళ. అయ్యో మొత్తం తెల్లవారి పోయిందే, మెలుకువ రాలేదు ఏమిటో మొద్దు నిద్ర పోయాను అనుకుంటూ, గాఢంగా నిద్రపోతున్న భర్త వైపు చూసింది. నేనే అంటే ఈయన ఇంకా గాఢంగా నిద్రపోతున్నారు అనుకుని, తట్టి లేపింది భర్తను.

"ఏమండి లేవండి టైం ఎంతైందో చూసారా, బారెడు పొద్దెక్కి పోయింది!" అంది సరళ.

"అబ్బా లేస్తానులే సరళ కాసేపు పడుకోనియ్యి. అయినా ఈరోజు ఆదివారమే కదా! కాసేపు నువ్వు కూడా పడుకోరాదా!" అంటూ భార్య చెయ్యి పట్టి లాగాడు మూర్తి.

"ఇంకా నయం, ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు, ఇంత పొద్దయినా లేచి వాకిలి ఊడ్చి కళ్ళాపి చల్లలేదు. కొత్త దంపతుల్లా పడుకున్నారు అనుకుంటారు!" అంటూ.. "అది సరే గానీ, నా మాట వింటారా?" అంది భర్త వైపు చూస్తూ.

చెప్పు అన్నట్టుగా చూసాడు మూర్తి.

"ఏం లేదండి, ఈ దీపావళి పండుగకు మన అమ్మాయిల్ని అల్లుళ్ళను పిలవాలండి. ఐదు సంవత్సరాలు అయిపోయింది కదా! ఈసారి ముగ్గురిని ఒకేసారి పిలుద్దాము. వాళ్ళకు కలిసినట్టుగా, మనకు సందడిగా వుంటుంది!" అంది సరళ.

మూర్తికి గుండెల్లో రైళ్ళు పరుగెట్టాయి ఒక్కసారిగా, అమాంతం లేచి కూర్చున్నాడు. ఇప్పుడిప్పుడే కొంచెం బ్యాంక్లో డబ్బు కూడబెడుతున్నాను అనుకుంటే, మళ్ళీ ఇదొకటా! అనుకుంటూ ఆశ్చర్యంగా భార్య వైపు చూసాడు అయోమయంగా.

"అదేంటి అలా దిగ్గున లేచి కూర్చున్నారు. లేడికి లేచిందే పరుగన్నట్టు ఇప్పుడే ఉత్తరాలు రాస్తారా ఏంటి?" అంది సరళ .. మూర్తి మనసులో పడే ఆవేదన తెలుసుకోలేక.

'అందరూ అన్నీ కలిసి చేసుకునేదే పండగ'

"సరళా.. మన అమ్మాయిలను వచ్చే దీపావళికి పిలుద్దాం. ముగ్గురిని ఒకేసారి పిలవడమంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని కదా! ఈలోపు మనం డబ్బు అది సమకూర్చుకోవచ్చు. అంత డబ్బు అప్పు పుట్టాలంటే కష్టం కదా! అందుకని వచ్చే సారికి పిలుద్దాము!" అన్నాడు మూర్తి.
"అలా అంటే ఎలా కుదురుతుంది. మొన్ననే గుర్తు చేసారట చిన్నల్లుడి వాళ్ళమ్మగారు. ఈసారికి కుదరక పోతే, మళ్ళీ తొమ్మిదో యేడు పిలవాలి అన్నారట. మీ నాన్న వాళ్ళకు చెప్పమని చెప్పారట ఆవిడ గారు!" అంది సరళ.
"ఆవిడకేం .. తేరగా వస్తుంది కదా .. ఎందుకు వద్దంటుంది. మన పరిస్థితులు మనకు తెలుసు, ఆవిడ సొమ్మేమి పోతుందట!" కోపంగా అన్నాడు మూర్తి. ఎలాగైనా ఈ గండం నుండి బయటపడాలని వుంది.
"ఆవిడనెందుకు ఆడి పోసుకుంటారు. మనం కట్నాలు పెడుతున్నది మన అమ్మాయికి, అల్లుడికే కదా! పాపం, ఆవిడకేమైనా పెడుతున్నామా ఏంటి. వింటున్నారా! అదంతా కాదు కాని, మీరు గబగబా లేచి మీ పనులన్నీ ముగించుకుని, పిల్లలకు ఉత్తరాలు రాయండి పండుగకు రెండు రోజుల ముందే రమ్మని!"
అని చెబుతూ కంగారుగా బయటకు వెళ్ళిపోయింది... కళ్ళాపి చల్లడానికి.

శ్రీనివాసమూర్తిది మధ్యతరగతి కుటుంబం. తాతలు తండ్రి సంపాదించిన ఆస్తిపాస్తులు ఏమీ లేవు. తన స్వశక్తి మీదనే క్లర్క్ ఉద్యోగం సంపాదించుకొని, వుండడానికి ఇల్లు కట్టుకున్నాడు. ముగ్గురు కూతుళ్ళను చదివించి వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడేలా చేసాడు. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేసి అత్తారింటికి పంపించేసరికి, తల ప్రాణం తోకకొచ్చినంత పనైంది. "ఇల్లు కట్టి చూడు, పెళ్ళి చేసి చూడు" అన్న సామెతలాగా, అప్పులు చెయ్యకుండా పెళ్ళిళ్ళు చెయ్యలేక పోయాడు. ఒకరి పెళ్ళిచేసి ఆ అప్పు తీరుతుంది అనుకునేంతలోనే, రెండో అమ్మాయి పెళ్ళి కుదిరింది. మళ్ళీ మొదలు అప్పుల వేట. అది తీరుతుందిలే అనుకున్నాడో, లేదో మూడో అమ్మాయి పెళ్ళి కుదిరింది. పెళ్ళిళ్ళంటే మాటలా, అందులో ముగ్గురమ్మాయిలు. మధ్యతరగతి వాళ్ళ పెళ్ళంటే అన్నింటికి కష్టమే. అటు డబ్బు బాగా వున్నవాడికి బాధలేదు. ఇటు ఏమి లేనివాడికి బాధ లేదు. ఎటొచ్చీ ఈ మధ్యతరగతి వాళ్ళకే కష్టాలు. అమ్మయ్యా, ఆడపిల్లల పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఇక ఏ బాధ లేదు అప్పులు తీర్చుకొని హాయిగా ఉండొచ్చు అనుకున్నాడు మనసులో. కానీ, పురుళ్ళని, బారసాలలని, పుట్టిన రోజు వేడుకలని, ఒకటి కాకపోతే ఒకటి వస్తూనే వున్నాయి. గత రెండు మూడేళ్ళ నుండి ఈ బాధ్యతలన్నీ తగ్గాయి అని, కొంత డబ్బు బ్యాంక్లో జమ చేస్తున్నాడు మూర్తి. రేపటి భవిష్యత్లో కొడుకులు లేరు, వున్న ఆడపిల్లలు చూస్తారో లేదో, ఒకవేళ చూసినా ఆడపిల్లల సొమ్ము తింటూ ఉండలేము కదా అని ముందు చూపు కోసం ఆరాట పడుతున్నాడు. కానీ ఈ రోజు లేస్తూనే పక్కలో బాంబు పేల్చినట్టయింది మూర్తికి సరళ చెప్పింది విన్నాక . ముగ్గురికి కట్న కానుకలంటే మామూలు విషయం కాదు. ఆరుగురు పిల్లలు వాళ్ళకు బట్టలు తేవాలి. ఎంతలేదన్నా ఒక్కో కుటుంబానికి రెండువేలు ఖర్చు వస్తుంది. మళ్ళీ

భోజనాలు మాములుగా సరిపోతుందా, ఈ లెక్కన చూస్తే పదివేలు డమాల్ అనుకుంటుంటేనే గుండెల్లో నుండి దడ వస్తుంది.. అనుకుంటూ గట్టిగా అరిచాడు 'బాబోయ్ అని.
ఏమైందోనని పరుగెత్తి వచ్చింది సరళ.
"సరళా! దీపావళి ఖర్చు తలుచుకుంటేనే భయమేస్తోంది!" అన్నాడు దీనంగా సరళ ముఖంలోకి చూస్తూ.
"ఏడ్చినట్టుంది మీ భయం చూస్తే! ఇంకా నయం ఎవరితో అనలేదు.. నవ్విపోతారు! ఆడపిల్లలను పండుగకు పిలవడానికి భయపడే మనిషిని మిమ్మల్నే చూస్తున్నాను!" అని విసుక్కుంటూ వెళ్ళింది.
చాలా సున్నిత మనస్తత్వం మూర్తిది. అటు భార్యను నొప్పించలేడు, ఇటు ఖర్చు తట్టుకోలేడు. ముగ్గురమ్మాయిలకు ఉత్తరాలు రాసాడు. 'పండుగకు రెండు రోజుల ముందే రమ్మంటుంది మీ అమ్మ' అని రాసాడు. సరళకు చదివి వినిపించాడు. చాలా సంతోషపడింది .

అనుకున్నట్టుగానే దీపావళి పండుగ రెండు రోజుల ముందే పెద్దల్లుడు, అమ్మాయి, పిల్లలు వచ్చారు. వాళ్ళు వచ్చిన కాసేపటికే మిగతా ఇద్దరమ్మాయిలూ పిల్లలతో వచ్చారు . అల్లుళ్ళు రాలేదు ఎందుకనో అని కంగారు పడింది సరళ .
"ఏమ్మా అంతా కులాసానా? మీ అత్తగారు వాళ్ళంతా బాగున్నారు కదా! అన్నట్టు అల్లుళ్ళు కనపడరేంటి, వాళ్ళు వెనకాల వస్తున్నారా?" అంది సంశయంగా బయటకు చూస్తూ.
"ఆ.. అమ్మ! అందరూ బాగున్నారు. మీ అల్లుళ్ళకు రేపటి నుండి సెలవులిచ్చారు, అందుకని రేపు వాళ్ళిద్దరు కలసి వస్తామన్నారు!" చెప్పింది చిన్న కూతురు వాణి.
"బావంటే అదృష్టవంతుడు. ఆయనకు ఈ ఉద్యోగం హడావుడి ఏమి లేవు. అక్కతో పాటు ఎక్కడి కంటే అక్కడికి కలిసి వెళ్ళిపోతారు. మాకా అదృష్టం లేదు కదా!" అంది రెండో కూతురు పద్మ... బావను దెప్పిపొడుస్తూ!
"మధ్యలో మా ఆయన మీదెందుకు పడుతున్నారు. మీ వాళ్ళేమో క్షణం తీరకుండా నెల తిరిగే సరికి వేలకు వేలు సంపాదిస్తున్నారు. ఇళ్ళ మీద ఇళ్ళు కడుతున్నారు అందుకే మీ వెనకాల రావడానికి తీరిక లేదు. మేము కష్టపడి వ్యవసాయం చేస్తే గాని పంటలు చేతికి రావు. ఎంతైనా మీ అంత ఉన్నవాళ్ళము కాదు లేవే!" అంది రోషంగా పెద్దమ్మాయి వీణ.
"అబ్బబ్బా, ఏమిటే మీ దెప్పిపొడుపు మాటలు మీరు. రండి అందరు కలిసి భోజనాలు చేద్దురు గాని!" అంటూ ముగ్గురిని కోప్పడి భోజనాలు వడ్డిస్తూ, "ఏమండి అల్లుడిగారిని తీసుకుని రండి అన్నం వడ్డించాను!" అంది.
"బావగారు ఏం మాట్లాడడం లేదు. మీ తమ్ముళ్ళు రాలేదని కోపమా.. ఏంటి?" అడిగింది వాణి.

“అబ్బో మీరు సామాన్యులా తల్లీ, మీ కూడా మా తమ్ముళ్ళు వస్తే ఒక్కరోజు జీతం కట్ అవుతుందని, మీరే రావద్దని చెప్పి వుంటారు. పాపం అమాయకులు మా తమ్ముళ్ళని మీరు ఆడిస్తున్నారు!” అన్నాడు నవ్వుతూ పెద్దల్లుడు గిరిధర్.

“అవునవును. మీరందరూ అమాయకులే, పాపం నోట్లో వేలు పెడితే కొరకలేరు కదా!” అంది వెక్కిరింతగా పద్మ.

“ఏమో పెట్టి చూడు ఒకసారి కొరకగలనో లేదో?” అంటూ నోరు తెరిచాడు ముందుకు వంగుతూ.

“అబ్బా ఆశ, దోశ, అప్పడం కాదు. మీరు మా అక్క లేకపోతే ఒక్కక్షణం ఉండలేరు. మీ ఆవిడని ఎవరో కొరుక్కు తింటారని భయం కాబోలు!” అంది వాణి కిలకిలా నవ్వుతూ.

“అదేం కాదు వాణి. పిల్లలు నేను ముందుగా వెళతాము, మీరు మెల్లగా రండి అంటే ఏమన్నారో తెలుసా! ‘అబ్బబ్బా నీ చేతి వంట తినీ తిని విసుగొచ్చింది. అందుకని మీ అమ్మ చేత అన్నీ వంటలు చేయించుకుని తినాలని వుంది’ అన్నారు. ఇంకా నాకంటే ముందే మా తమ్ముళ్ళు వచ్చేస్తారు అని మాతో పాటుగా వచ్చేసారు!” అంటూ భర్త మీద చాడీలు చెప్పింది వీణ. అందరు నవ్వుకున్నారు.

“ఏమిటమ్మా ఇది.. అందరు కలసి బావను ఏడిపిస్తున్నారు. పాపం ఆయన సరదా పడి వస్తే!” అన్నాడు మూర్తి.

“చూడండి మామయ్య, వాళ్ళకు కుళ్ళు! వాళ్ళ మొగుళ్ళు రాలేదని, వాళ్ళు రాకుండా నేనొక్కడినే ఏం తినేస్తానోనని వీళ్ళ భయం మామయ్య!” ఫిర్యాదు చేసాడు గిరిధర్.

అలా అందరు సంతోషంగా ఒకరి మీదొకరు ఛలోక్తులు విసురుకుంటూ భోజనాలు ముగించారు.

మిగతా అల్లుళ్ళు వచ్చాక, పిల్లలు కొట్లాటలు, కేరింతలతో ఇల్లంతా హడావుడి అయిపోయింది.

దీపావళి పండగ రోజు అందరు సూర్యోదయానికి ముందే లేచి హారతులు తీసుకున్నారు.

“అత్తయ్య గారూ ఏం వంటలు చేస్తున్నారు ఈ పూట?” అంటూ వంటింట్లోకి వచ్చాడు గిరిధర్.

అల్లుణ్ణి చూస్తూనే సిగ్గు పడిపోయింది సరళ. అక్కడే వున్న మరదళ్ళు “ఏం కావాలి బావా మీకు చెప్పండి. పేవిళ్ళు పోసుకున్న వాళ్ళ లాగా మీకు ఏమన్నా తినాలనిపిస్తే చెప్పండి, మా అమ్మ చకచకా చేసిపెడుతుంది!” అంటూ ఆట పట్టించసాగారు.

“మీరుండండే!” అంటూ “చెప్పండి.. మీరేం చెయ్యమంటారో?” అంది సరళ అల్లుడి వైపు తిరిగి.

“ఆహ మీ అమ్మాయిల చేతివంట తిని బోర్ కొట్టింది. మాకు కాస్త నోటికి రుచి వచ్చేలా చెయ్యండి. మా నోళ్ళన్నీ చప్పబడి పోయాయి!” అంటూ వచ్చారు మిగతా ఇద్దరు అల్లుళ్ళు పెద్దల్లుడికి సపోర్టుగా.

“అవునవును వీళ్ళకు కాస్త పచ్చి గడ్డి పెట్టమ్మా. అప్పుడు నోటికి రుచి తెలుస్తుంది. బాగా చేసిపెడుతుంటే ఎక్కడ తెలుస్తుంది వీళ్ళకు!” అంది గడుసుగా వాణి.

"సర్లెండి. వాళ్ళ మాటలకేంగానీ, మీరు చెప్పండి బాబు ఏం వంటకాలు కావాలో?" అన్నాడు మూర్తి అల్లుళ్ళనుద్దేశించి.
"మొహమాట పెట్టేస్తున్నారు మీరు!" అంటూ, "పండుగ కదా సేమ్యా పాయసం ఎలాగూ చేస్తారు. పప్పు గారెలు.. దానికి పోపు నూనే అయితేనే బాగుంటుంది. కారం కారం లేకపోతే ఏం బాగుంటుంది. అందుకని మిరపకాయ బజ్జీలు చెయ్యండి. ఇంకా మీకు ఇబ్బంది లేదు అనుకుంటే గనుక.. పులిహోర, పుదీనా పచ్చడి, రసం, పాలకూర పప్పు.. ఇవి చాలండి భోజనంలోకి. మిమ్మల్ని ఇబ్బంది పెట్టకూడదని చాలా సింపుల్ గా చెప్పాను. అంతే కదండి అత్తగారు!" అడిగాడు సరళను.
అందరు నోరు వెళ్ళ బెట్టి అలానే చూస్తూండిపోయారు గిరిధర్ చెప్పేవి వింటూ .
"ఏమిటి అందరు అలా కరెంట్ షాక్ కొట్టిన వాళ్ళలా అయిపోయారు అడిగాడు గిరిధర్.
"లేకపోతే ఏంటి బావా, మీరు చెప్పిన లిస్టు వింటుంటే ఇన్నీ తిని అరిగించుకోగలమా అనిపిస్తుంది. అయినా తినే వాళ్ళకు ఓపిక వుంటుందేమో కాని, చేసే వాళ్ళకు ఎంత ఇబ్బందో ఆలోచించాలి కదా. మన శరీరం కాకపోతే ఎంత దూరమైన పాకమనొచ్చు!" అన్నట్టుంది మీ వరస అంది వెక్కిరింతగా వాణి.
"ఏం మీరున్నారు కదా, మీ అమ్మకు సహాయం చెయ్యడానికి?" అన్నాడు మూడో అల్లుడు శ్రీకాంత్.
"ఏమిటి, వీళ్ళా సహాయమా, భలే వాడివి తమ్ముడు. వీళ్ళు ఎప్పుడైనా నడుం వంచి ఇంత మంచి వంటకాలు చేసి పెట్టారా మనకు. మనతో చేయించడమే గానీ వీళ్ళకేం చేతనవును!" ముసిముసిగా నవ్వుతూ సెటైర్లు వేశాడు రెండో అల్లుడు నవీన్.
"అవునే చెల్లి, మనము ఇన్నాళ్ళు చేసి పెడితే తిన్నది పోయింది. ఇప్పుడేమో మన మీద అభాండాలు వేస్తున్నారు ఎంత నంగనాచివాళ్ళో చూడు!" అంది వీణ.
"అయితే మేము ఒక్క పని ముట్టేది లేదు. మా అమ్మ గాని, మేము గాని వంటిల్లు తొక్కేదే లేదు. మా నాన్న, మీరు కలసి ఈ వంటలన్నీ చెయ్యాల్సిందే. ఏ ఒక్కటి కుదరక పోయినా వూరుకునేది లేదు!" అంటూ 'పదవే అమ్మా' అని తల్లిని తీసుకుని వెళ్ళిపోయారు నవ్వుకుంటూ.
"మీరు అనవసరంగా పెట్టుకున్నారేమో బాబు వీళ్ళతో!" అన్నాడు మూర్తి.
"అదేం లేదు మామయ్య! మేమే కావాలని అత్తగారికి రెస్ట్ ఇవ్వాలనుకున్నాము. మీ అమ్మాయిలు ఎలాగూ పని చెయ్యరు. అక్కడ చేసుకుని వచ్చాము అంటారు. పాపం అత్తగారు వంటింటికి అంకితమయిపోతారు. అందుకని వాళ్ళను రెచ్చగొట్టాము. ఇప్పుడు చూడండి 'నలభీమపాకం' చకచకా తయారు చేస్తాము!" అంటూ తువ్వాళ్ళు నడుముకు బిగించారు ముగ్గురు.
భోజనాల దగ్గర అందరు లొట్టలేసుకుంటూ తిన్నారు. 'ఓహో ఇంత బాగా చేస్తారని తెలిసుంటే, హాయిగా చేయించుకునే వాళ్ళం కదా, మన ఇళ్ళల్లో కూడా' అన్నారు ముగ్గురూ ఒకేసారి.
"అవును నాన్న, అమ్మ ఏం మంచిగా చెయ్యదు. ఇక నుండి మీరే చెయ్యండి. ఎంత బాగుందో పులిహోర!" తింటూ అన్నాడు వాణి కొడుకు.

“ఓరి భడవా మేమేదో సరదాకి మీ నాన్న వాళ్ళను ఆట పట్టిస్తే, నా వంటలు బాగాలేవని నన్నే వెక్కిరిస్తావా?” అంది కొడుకు చెవి మెలేస్తూ.

సరదాగా కబుర్లు చెప్పుకుంటూ, ఒకరి మీద ఒకరు జోకులు వేసుకుంటూ, ఆ రోజంతా ఆనందంగా గడిపారు. సాయంకాలం పిల్లలు పెద్దలు కలసి వాళ్ళతో పాటు తెచ్చుకున్న టపాకాయలు కాల్చారు. సరళ, మూర్తి కూడా పిల్లలతో పాటు టపాకాయలు కాలుస్తూ హడావుడి చేసారు.

ఇంత ఆనంద సమయంలో మూర్తి తన ఖర్చుల గురించి మరచిపోయి, ఆనందాన్ని అనుభవించాడు. ‘డబ్బిచ్చి కొనుక్కున్నా రాదు ఇంత ఆనందం’ మనసులో అనుకుంటూ మనవలు, మనవరాళ్ళతో కలసి, చిన్న పిల్లాడిలా ఎగరసాగాడు. సరళను కూడా మనవరాళ్ళు వదిలి పెట్టకుండా వాళ్ళతో పాటుగా కాకరవత్తులు, చిచ్చుబుడ్లు ఇచ్చి, పోటీపడి కాలుస్తున్నారు. అల్లుళ్ళు వున్నారన్న సంగతి మరిచి పోయి సరళ ఉత్సాహంగా నవ్వుతూ పండగ సంబరాన్ని ఆస్వాదించింది.
అమ్మాయిలు, అల్లుళ్ళు, వాళ్ళిద్దరు అలా సంతోషంతో పిల్లలతో ఆడుతుంటే చూస్తూ మురిసిపోయారు. పండగ కట్నాలు, మనవలు మనవరాళ్ళకు ఇచ్చారు. ఉన్నంతలో కూతుళ్ళకు, అల్లుళ్ళకు పట్టుబట్టలు పెట్టారు. ఇక వాళ్ళు వెళతారని తలుచుకుంటేనే ఏదో పోగొట్టుకున్న వాళ్ళలా చిన్నబోయారు ఇద్దరు.
“అమ్మా, నాన్న మీరు ఇలా కూర్చోండి!” అంటూ రెండు కుర్చీలు తెచ్చి వేసింది పద్మ.
“మాకెందుకమ్మా ఇవన్నీ?” అంది సరళ వాళ్ళు తెచ్చిన పట్టుబట్టలు చూసి.
“ఏంటండి అత్తయ్యగారు, ఎప్పుడూ మీరు పెడితే తీసుకోవడమే గాని, మేము పెట్టే అధికారం మాకు లేదా ఏంటి?” అడిగాడు చిన్నల్లుడు శ్రీకాంత్.
“బాగా చెప్పావు తమ్ముడు. మీ కొడుకులు ఇస్తే తీసుకోకపోయేవారా చెప్పండి. మీకు కొడుకులైనా అల్లుళ్ళైనా మేమే కదా! అందుకని మేమే ఏదిచ్చినా మీరు తీసుకోవాల్సిందే!” చెప్పాడు గిరిధర్.
“అంతేకాదు మామయ్య, మీరు, అత్తయ్య ఇక నుండి ఒంటరిగా వుండడానికి వీలు లేదు. మా ముగ్గురి దగ్గర ఉండాల్సిందే. మేమంతా ఖచ్చితంగా నిర్ణయం తీసుకున్నాము. ఈ ఒక్క పండుగనే కాదు, ప్రతి పండుగ మీ సమక్షంలోనే జరగాలి. మీరు పిల్లలతో ఆడుతూ పాడుతూ సరదాగా కాలం గడపండి. మాకు ఆనందం, మీకు తృప్తిగా వుంటుంది!” చెప్పాడు రెండో అల్లుడు నవీన్.
“బాబు, మాకింత కంటే అదృష్టమేముంది. కొడుకులైనా అల్లుళ్ళైనా మీరే కదా!” అంటూ ఆనందభాష్పాలు రాల్చారు ఆ దంపతులు.

***0***



# వచ్చేది ఉంటే

పి ఎల్ ఎన్ మంగారత్నం

ఆ ఇంట్లో పెళ్లి జరిగి .. రెండు రోజులయింది.

ఇంకా సందడి .. సందడిగానే ఉంది. పెళ్ళికూతురు లాంఛనాలతో మొట్టమొదటగా అత్తవారింటికి వచ్చింది. హాలులో ఓ పక్క పెళ్ళికి వచ్చిన ప్రజెంటేషన్‌లూ, సారే బిందెలూ, అరటి పళ్ళ గెలలతో నిండిపోయి ఉంటే, మరోపక్క వచ్చిన చుట్టాలతో హడావిడిగా ఉంది.

పెళ్ళికొడుక్కి శెలవులు తక్కువగా ఉండడంతో పనులన్నీ హడావుడిగా జరిగిపోతున్నాయి. కొంతమంది దూరపు చుట్టాలు వారి వారి ఇళ్ళకు వెళ్ళే ప్రయత్నంలో సామానులు సర్దుకుంటున్నారు. పెళ్ళికొడుకు తల్లి భ్రమరాంబ ఇంటికి .. వచ్చిన బంధువులందరికీ బట్టలు పెట్టే కార్యక్రమంలో ఉంది. కృష్ణమూర్తి కూడా అక్కడే ఉన్నాడు ఆమెకు తోడుగా.

అయినవాళ్ళు, ఆప్తులు ఇంటికి ఎవరెవరు వస్తారో ముందుగానే అనుకున్నారు. చెల్లెళ్ళు .. ఆడపడుచులు .. వారి అభిరుచులకు తగ్గట్టు, జంటల వారిగా బట్టలు కొన్నారు. ఇంట్లో మొట్టమొదటి పెళ్లి! పెట్టుపోతలూ ఘనంగానే చెయ్యాలనుకున్నారు. పెట్టుబడి చీర ఏదీ రెండు వేలకి తక్కువగా తీసుకోలేదు.

అందరికి పేరు పేరునా పిలిచి ఇస్తుంది భ్రమరాంబ.

నాగలక్ష్మికి చీర ఇస్తూ "అత్తయ్యా మా పిల్లాడి పెళ్లి కుదిర్చిన మామయ్య దగ్గర లేడు. ఇప్పుడప్పుడే కువాయిట్ నుంచి రాలేడు కూడా. ఇప్పుడే తనకీ బట్టలు కొనేస్తే, మామయ్య వచ్చే వేళకి పాడవ్వొచ్చు! కాబట్టి, నీకు మాత్రమే చీర పెడుతున్నాను. మామయ్య వచ్చినప్పుడు పెడతాను!" అంటూ బొట్టుపెట్టి ఇస్తూ చెప్పింది.

"అంతేలే.. మనిషి దగ్గర లేకపోతే నువ్వు మాత్రం ఏం చేస్తావు" అంటూ అందరితోపాటు చీరే తీసుకుంటూ నవ్వింది నాగలక్ష్మి.

కార్లలో వెళ్ళే వాళ్ళు బయలుదేరగా, రైళ్ళలో, బస్సుల్లో వెళ్ళే వాళ్ళు ఇప్పుడా .. అప్పుడా అని తర్జన భర్జన పడుతున్నారు.

అందరికి అన్ని ఇచ్చేయ్యగా, మిగిలిన చీరల్ని ప్రక్కన ఉంచింది భ్రమరాంబ. 'ఎప్పుడేం అవసరం వస్తుందోనని, కొన్ని ఎక్కువగానే కొంది. ఆ మిగిలిన వాటిలో నాగలక్ష్మి ఆకుపచ్చని జరీ బుటా చీరను చూసి

'పుచ్చుకునేవారికి ఇచ్చేవారు లోకువ'

“ఇది కూడా చాలా బాగుంది!” అంటూ ముచ్చట పడింది. అత్తయ్య సంతోషాన్ని కాదనడం ఎందుకని “నచ్చితే అదీ పట్టుకెళ్లు అత్తయ్యా .. మామయ్యకు ఎలాగూ పెట్టలేదుగా” అంటూ ఆ చీరే కూడా ఇచ్చేసింది. తన అన్న కూతురి దగ్గర ఆ విధంగా .. తీసుకునే చనువు నాగలక్ష్మికుంది.

“అలాగే ఈ చిప్స్ కుట్టిన ఎర్ర చీర కూడా తీసుకుని, మీ అమ్మాయికివ్వు! ముందు, ముందు పెళ్ళి చూపులలో కట్టుకుంటుంది!” అంటూ ఇంకో చీర ఇచ్చేసింది. ఆ పిల్లా డిగ్రీ చదివి పెళ్లీడు కొచ్చింది. అలా అని ఇప్పుడే పెళ్లి చెయ్యగలిగే స్తోమత లేకపోయినా .. ఏదో ఓ రోజుకి చెయ్యాలి కదా అని.

అలా నాగలక్ష్మి మూడు చీరలతో పాటు.. తనకు కావలసిన వస్తువులతో కొత్తగా మరో సంచీ పట్టుకుంది.

పెళ్ళి సంబంధం కుదిర్చిందే ఆ అత్తయ్య భర్త వెంకటకృష్ణ. అనుకున్న ప్రకారం ‘వీసా’ టైము దగ్గర పడడంతో, పెళ్లి మాటలు కూడా తనుండగానే జరిపించి, ముహూర్తాలు పెట్టించి, విమానం ఎక్కాడు.. సంవత్సర కాలంగా ఎంత మధన పడింది. కొడుక్కి మంచి ఉద్యోగం ఉన్నా, వెనకాల ఆస్తిపాస్తులు లేవని వెళ్ళిపోయిన వాళ్ళే ఎక్కువ. భ్రమరాంబ మాత్రం చదువుతో పాటు అందం ఉన్న పిల్లకే ప్రాధాన్యత అంది.

మ్యారేజి బ్యూరో అతను చెప్పిన నాలుగైదు సంబంధాలు భ్రమరాంబకి నచ్చక పోవడం, అతను చెప్పిన ప్రతి సంబంధం లోనూ ఏదో లోపం కనిపించడం, పిల్ల నచ్చలేదనడం ఎందుకని, అమ్మాయిల్ని చూడకుండానే కాదన్నది. ఆరు నెలలు తిరిగినా ఒక్క సంబంధమూ చూపించ లేకపోయాడు బ్యూరో అతను. అదేమంటే “ నేనే సంబంధం తెచ్చినా మీకు నచ్చడం లేదుగా! అయినా కొత్త ఫోటోలు ఏమీ రాలేదు, వచ్చినప్పుడు చెబుతాలెండి!” అంటూ నిష్టూర మాడాడు. వీళ్ళ కోసం ఇప్పటికిప్పుడు అందగత్తెలు ఎక్కడ పుట్టుకొస్తారాన్నట్లు.

ఒప్పుకున్నాడు కాబట్టి, అతను ప్రతి అమ్మాయికీ సంబంధం కుదర్చాలి. అలా అని అతను చెప్పాడని నచ్చని వాళ్ళ కోసం వెళ్ళలేరు కదా! దాంతో ఫీజు దండుగ అయినా ఫర్వాలేదని, అతనికి ఫోన్ చెయ్యడమే మానుకుంది.

పెద్దలు చెప్పినట్లు అటు ఏడుతరాలు, ఇటు ఏడుతరాలూ కాకపోయినా.. కనీసం ఒకటి, రెండు తరాలు చూడడం తప్పు కాదనుకుంది. అందుకే మగపిల్లాడి తల్లి ఐనా ఆదుర్దా తప్పలేదు భ్రమరాంబకి. కృష్ణమూర్తిది తటస్థ ధోరణి. భార్యకి నచ్చితే తనకీ నచ్చినట్టే అనుకుంటాడు.

***

రెండు నెలల క్రిందట .. రాజోలులో ఓ పెళ్లిలో అనుకోకుండా నాగలక్ష్మి కలిసినపుడు... కొడుకు పెళ్లి ప్రస్తావన కూడా వచ్చింది. “ఏడాదిగా పిల్లాడికి పెళ్లి చెయ్యాలని ప్రయత్నాలు చేస్తున్నాం. అయితే ఇంకా ఏ పిల్లనీ చూడలేకపోయాను. మగపిల్లాడికి కూడా సంబంధం వెతుక్కోవడంలో ఇంత కష్టం ఉంటుందని అనుకోలేదు” అంటూ ఆవేదన పడింది భ్రమరాంబ.

మేనకోడలి బాధని అర్థం చేసుకున్న నాగలక్ష్మి నవ్వుకుంటూ, "నాకు తెలిసి.. మా ఇంటికి దగ్గరలో మన బంధువుల అమ్మాయే ఉంది. ఇంజనీరింగు చదివింది. వాళ్ళు ఈ ఏడాది చేస్తారో, లేదో కనుక్కోవాలి. చూడమంటావా?" అడిగింది.

"ఎవరు? నీకు తెలిసిన అమ్మాయా?" ఆశ్చర్యంగా అడిగాడు, వీళ్ళ సంభాషణను ఆలకిస్తున్న వెంకట కృష్ణ.

"అదే. మనింటికి అప్పుడపుడు వస్తుందే.. సుబ్బరామయ్యగారి మేనకోడలు! రాజమండ్రిలో హాస్టల్లో ఉండి చదువుకుంటుంది కదా! "

నాగలక్ష్మి ఆ అమ్మాయిని గురించి చెప్పగానే "అబ్బే ఆ పిల్లా! పిల్ల బాగా పొట్టి. పైగా రంగు తక్కువ. వీళ్ళ అబ్బాయికి ఏం సరిపోతుంది. వాడు చక్కటి హైటు. చక్కటి రంగు!" అంటూ భార్య ప్రతిపాదనని కొట్టిపారేసాడు.

"చూద్దాంలేమ్మా .. తొందరపడకు! నాకు చెప్పావు కదా. నేను వెళ్ళే లోపు, ఎవరైనా ఉంటే ప్రయత్నం చేస్తాలే" భరోసా ఇచ్చాడు.

అలా భరోసా ఇచ్చినందుకు భ్రమరాంబ మెచ్చే సంబంధమే తీసుకొచ్చాడు. కక్కొచ్చినా, కళ్యాణం వచ్చినా ఆగదన్నట్లు .. పిల్ల అందరికీ నచ్చడంతో, నిముషాల మీద సంబంధం ఖాయపరచుకున్నారు. అందుకే మామయ్య మీద ఉన్న గౌరవమూ, కృతజ్ఞతాభావంతో .. నాగలక్ష్మి అత్తయ్యకి ఏమిచ్చినా 'ఎక్కువ' కాదు అనుకుంది. అందరికీ సంతోషపడేలా బట్టలు పెట్టినట్లే, అత్తయ్యకి కూడా తను సంతోషపడేలా కానుకలూ ఇచ్చి పంపాను కదా అని సంబరపడింది.

పిల్లాడి పెళ్లి తరువాత నాగలక్ష్మితో అనుబంధం ఇంకా బలపడిందనే చెప్పాలి.

భ్రమరాంబకు నాగలక్ష్మి స్వయానా మేనత్త. తండ్రి నారాయణ స్వామికి చాలా ఆలస్యంగా పుట్టిన చెల్లెలు. నారాయణ స్వామి ఉద్యోగరీత్యా వైజాగులో ఉండిపోవడం, చెల్లెలు నాగలక్ష్మి భర్తతో పాటు అక్కడే పల్లెటూరిలో ఉండిపోవడంతో.. ఎప్పుడో గాని కలుసుకునేవారు కాదు. దాదాపుగా భ్రమరాంబ, నాగలక్ష్మి ఒక్క ఈడు వాళ్ళే. ప్రస్తుతం సెల్ ఫోన్లు వచ్చాకా, దూరం దగ్గరైంది. అవసరాలు, అనుబంధాలు పెరిగాయి. వెంకట కృష్ణ అప్పుడపుడు కువాయిట్ నుంచి ఫోన్లు చేస్తున్నాడు.

ఆరు నెలల తరువాత ..

వెంకట కృష్ణ తండ్రి చనిపోయాడు. తొంబై ఏళ్ల వయసు, వృద్ధాప్యం! కొడుకు కువాయిట్ వెళ్ళేనాటికే మంచం మీద దీర్ఘకాల అనారోగ్యంతో ఉన్నాడు. విషయం తెలిసినా వెంకటకృష్ణ అక్కడ నుంచి రాలేకపోయాడు. దారి ఖర్చులు భరించుకునే ఓపిక లేక. దగ్గర ఉన్న కొడుకులే .. అన్నీ చూసుకున్నారు. భ్రమరాంబకు తెలిసినా వెళ్ళలేకపోయింది.

***

కాలగమనంలో రోజులు గడచిపోతున్నాయి. ఏడాది తరువాత ..

"ఈ నెల పదవ తారీఖున ఇండియాకు వస్తున్నానమ్మా!" వెంకటకృష్ణ ఫోనులో చెప్పాడు భ్రమరాంబకు.

రోజులెంతలో గడవాలి .. కళ్ళు మూసుకుంటే, కాలం ఇట్టే తిరిగొస్తుందంటారు. అది ఎంత మాత్రం నిజం కాకపోయినా, అపుడే వెంకటకృష్ణ తండ్రి చనిపోయి, సంవత్సరం గడిచిపోయింది. 'సంవత్సరికానికి' రమ్మని పిలుపు వచ్చింది.

అయితే అనుకున్నది ఒకటి, అయ్యింది ఒకటి అన్నట్లు, వెంకటకృష్ణ అనుకున్న సమయానికి శెలవు దొరకక, తండ్రి సంవత్సరికానికి కూడా రాలేకపోయాడు. అలా సాంవత్సరీకం కూడా కొడుకు లేకుండానే జరిగిపోయింది. ఆ రోజున భ్రమరాంబ, కృష్ణమూర్తి కుటుంబంతో సహా వెళ్లి నాగలక్ష్మి అత్తగార్ని పలకరించారు. బయలుదేరి వచ్చేస్తుంటే నాగలక్ష్మి అంది.

"మా మామగారు పోయినందుకు మీ నాన్నగారు మాకు బట్టలు పెట్టాలి. కానీ మీ మామయ్య రాలేదు కదా అని నేనేం మాట్లాడలేదు!"

"పెట్టాల్సిన అవసరం ఉంటే అలాగే పెడతారులే. ఇక నాన్నగారు ప్రయాణాలు చెయ్యలేక పోతున్నారు కదా! ఎవరితో అన్నా పంపిస్తారు. లేదంటే డబ్బే పంపిస్తారులే!" చెప్పింది భ్రమరాంబ.

" అలాగే, మీరు కూడా పెట్టాలి!" చెప్పింది మోహమాటం లేకుండానే.

"మేము కూడానా?" ఆశ్చర్యపోయింది భ్రమరాంబ, తండ్రికి ఫార్మాలిటీ గాని తనకేమిటి అన్నట్లు.

"అవును. పెళ్లి సంబంధం కుదుర్చుకున్నారు కదా!" " హా" ఆ మాటలకు ఖంగుతింది భ్రమరాంబ.

మంచి చేసిన వాళ్ళకి బట్టలు పెట్టడం మన దేశ సాంప్రదాయం. ఎంత డబ్బు ఇచ్చినా అంతకు మించిన గౌరవం మరొకటి ఉండదు. అయితే, ఎప్పుడు వస్తాడో తెలియని మామయ్యకు అప్పటికప్పుడు పెట్టనందుకు, అత్తయ్య అలా అవకాశాన్ని తీసుకుంటుందని అనుకోలేదు.

అప్పుడే కొనేస్తే .. ఆ ఫార్మాలిటీ అప్పుడే తీరిపోయి ఉండేది. అవతలి వాళ్ళు ఎప్పుడు కట్టుకున్నా మనకేమిటి సంబంధం అనుకుంటే సరిపోయేది.

తనే అతి తెలివికి పోయి .. ఎదుటి వాళ్ళకి మాట్లాడే అవకాశాన్ని ఇచ్చింది.

అత్తయ్య, కూతురు ఆముక్తకి 'లాప్ టాప్' కి 'నెట్' పెట్టించుకోమని, రెండువేలు తీసి ఇచ్చింది. మామయ్య కువాయిట్లో ఉన్నా సంపాదన అంతంత మాత్రమే. ఆ కారణంగానే అడపాదడపా డబ్బు సర్దుతుంది. అయినా గాని ఎదుటి వాళ్ళ అభిమానాన్ని హక్కుగా భావిస్తే ఎలా?

పోనీ, పెళ్ళిలో మేనకోడలి కొడుక్కి ఏమైనా చదివించిందా అంటే అదీలేదు.

అంత పెట్టలేని స్థితిలో ఏమీలేదు నాగలక్ష్మి.

అదే ఆడపడుచు ఇంట్లోనో, తోటి కోడలు ఇంట్లోనో ఇలాంటి ఫంక్షనే జరిగితే, దూరంగా ఉన్నా మామయ్య డైరెక్షనుతో పెట్టేవి అన్నీ పెట్టే వస్తుంది. లేకపోతే అత్తగారి దగ్గర మాటవస్తుంది.

ఇక్కడ అలా కాదు. పుట్టింటి తరఫు. బావిలో నీళ్ళు తోడుతుంటేనే ఊరతాయన్న చందం, వచ్చేది ఉంటే కాదనుకోవడం దేనికి.

***0***

# అదృష్ట పరీక్ష



మంగు శివరామ ప్రసాద్

నీలాకాశంలో దూదిపింజల్లా పరుచుకున్న వెండి అంచు మేఘ శకలాలు. తూర్పు కనుమల కొండలను తాకుతూ కడలి కెరటాలు. వెలుగు మెరుగులు దిద్దుతూ బాల భానుని బంగారు కిరణాలు. పురివిప్పిన ప్రకృతి సౌందర్యాన్ని పారవశ్యంతో తిలకిస్తూ కాఫీ చప్పరించడం, రిటైర్ అయిన తర్వాత విశాఖపట్టణంలో స్థిరపడినప్పటి నుంచి విశ్రాంత జీవితంలోని నా దినచర్యలో మొదటి ఘట్టం. "ఎక్కడ మీరు?" అనే శ్రీమతి కంఠస్వరం, కాఫీ పరిమళం ఏకకాలంలో నా కర్ణ, నాసికా పుటాలపై దాడి చేసాయి.

బాల్కనీలో కూర్చొని దినపత్రిక చూస్తున్న నా చేతికి పొగలు కక్కుతున్న కాఫీ మగ్ అందించి, నాకెదురుగా నేలపై చతికిలపడింది భవాని. అలా ఆమె తిష్ట వేసిందంటే ఏదో పెద్ద ప్లాను ఉన్నట్లే. నా ముఖానికి అడ్డంగా ఉన్న ఆదివారం న్యూస్ పేపర్ ని ఆమె లాగి పక్కన పడేసింది.

"చెట్టంత మనిషి ఎదురుగా కూర్చుంటే ఆ దిక్కుమాలిన పేపర్ ముఖానికి అడ్డం పెట్టుకుంటారేం?" అని మా ఆవిడ అస్త్రం నా పై సంధించింది.

"ఏమిటి విశేషం?" అని మాట మార్చాను.

"ఈ సంగతి విన్నారా?"

"ఏదీ నువ్వు చెప్తే కదా!"

"ఈ రోజు ఉదయం తొమ్మిది గంటలకు గాయత్రి జూనియర్ కాలేజి గ్రౌండ్లో వివాహ పరిచయ వేదికను అరుంధతి మేట్రిమనీ డాట్‌కామ్ వాళ్ళు ఏర్పాటు చేశారు."

"ఓహో ఈ రోజు ఆదివారం కదూ! అందరికీ సౌకర్యంగా ఉంటుందని, ఈ మ్యారేజి బ్యూరోల వాళ్ళు శెలవు రోజులలో విజృంభిస్తారు."

"నిన్న సాయంత్రం వాళ్ళ ఆఫీస్ నుంచి ఒక అమ్మాయి ఫోను చేసి అరుంధతి మేడం మిమ్మల్ని, అంకుల్ని .. ఇద్దరినీ తప్పకుండా సభకు రమ్మన్నారని, బ్రేక్‌ఫాస్ట్, లంచ్ ఏర్పాటు కూడా ఉందని చెప్పింది".

"ఈ మ్యారేజి బ్యూరో పెట్టింది రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, తెన్నేటి అరుంధతి దేవి కదూ! మనకి ఇద్దరు పెళ్ళి కావల్సిన అబ్బాయిలు ఉన్నారని తెలిసి, వల విసిరి, మనల్ని చేపల్లా పట్టి, వాళ్ళ సంస్థలో రెండు వేలు కట్టించి, మెంబరు చేసింది. బ్రేక్‌ఫాస్ట్, లంచ్‌ల ఎర వేసి మీటింగ్‌కి వెళ్ళినప్పుడల్లా మనిషికి మూడు వందలు చొప్పున ముక్కు పిండి వసూలు చేస్తారు. మీ ఆడవాళ్ళు ఒక పూట అయినా వంటింటి పని తప్పుతుందని సంతోషించి, పేరంటానికి బయలుదేరినట్లు ముస్తాబై తరలి వస్తారు. అక్కడ ఒక జాతర వెలుస్తుంది."

'బంధం విడొచ్చు కానీ, అనుబంధం విడదు. పెళ్లి బంధమా, అనుబంధమా?'

“కొత్త పరిచయాలు, స్నేహాలు  కలగాలంటే పదిమందిని అప్పుడప్పుడు కలుస్తూండాలి. ఇటువంటి సమావేశాలు వాటికి బాగా ఉపయోగ పడ్తాయి.  చాలా మందిని ఒకే చోట కలుసుకునే మంచి అవకాశం. మన పెద్దవాడు వంశీకృష్ణ, చిన్నవాడు శశిధర్ ఇద్దరూ ఒకరు జామ్ నగర్‌లో, మరొకరు బెంగుళూర్‌లో ఉద్యోగాలలో స్థిర పడ్డారు. ఇక వాళ్ళిద్దరినీ ఇంటి వాళ్ళని చేస్తే మన బాధ్యత తీరినట్లే. మనకు  అమ్మాయిలు లేరు కనుక, రాబోయే కోడళ్ళే మన అమ్మాయిలు కదండి.”

“పరిచయాలు, పలకరింపులు, స్నేహాలు అన్నీ ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇంస్టాగ్రామ్, వాట్స్‌ప్ లాంటి సోషల్ మీడియాలో జరిగిపోతున్నప్పుడు, ఇక మ్యారేజి బ్యూరోలతో ఏం పని? శుద్ధ డబ్బు దండగ కాకపోతే. మన బలహీనతను క్యాష్ చేసుకోవడానికి వాళ్ళకు అవకాశమివ్వడమే అవుతుంది.”

“వాళ్ళు చేస్తున్నది కూడా మంచి పనే కదండీ.  మ్యారేజి బ్యూరో కూడ ఒక సోషల్ సర్వీస్ నెట్‌వర్క్ అని ఎందుకు అనుకోకూడదూ? వధూవరులను కలిపే ఒక సంధానకర్తగా వ్యవహరిస్తున్నారు.  గతంలో అయితే పెళ్ళిళ్ళ పేరయ్యలు ఉండేవారు. ఇప్పుడు వాళ్ళకి కాలం చెల్లి పోయింది.  పెళ్ళి సంబంధాలు స్వయంగా వెతుక్కోలేని మనలాంటి వాళ్ళకి వీళ్ళు చేస్తున్నది సాయం కాదా చెప్పండి.”

“అవును, అవును.  సాయమే! పెళ్ళిని ఒక పెద్ద వ్యాపారం చేసేసారు. వివాహ పరిచయ వేదికలు, మాట్రిమోనియల్ వెబ్ సైట్లు నడపడం ఒక మల్టీ నేషనల్ వ్యవహారం అయిపోయింది.  ప్యాకేజీలు, వాటిలో కేటగిరీలు పెట్టి, మన దగ్గర ముక్కు పిండి మరీ డబ్బు వసూలు చేస్తారు. ఆ ప్యాకేజీ గడువు ముగియగానే వధూవరుల ఫోన్ నంబర్లు, మైల్ ఐడీలు మనకు అందుబాటులో ఉండవు. ఈలోపున సంబంధాలు కుదరక పోతే చచ్చినట్టు మళ్ళీ ముడుపు చెల్లించి రిన్యూ చేసుకోవలసిందే!.  ఇదొక విష వలయం.  దీనిలో  చిక్కుకుంటే ఇక మన గతి ఇంతే!”

“ఈ మాటలకు ఏం గానీ, మనం ఇప్పుడు గాయత్రి కాలేజీకి వెళ్తున్నాం.  ఈ పూట కిచెన్ బంద్!  అయినా మీ సాహిత్య సభలు, సాంస్కృతిక సమావేశాలు అన్నీ సాయంత్రం అఘోరిస్తాయి కదా.  పగలు సాధారణంగా ఏమీ ఉండి చావవు, కనుక మీరు ఇప్పుడు చేసే రాచకార్యమేముంది?   ఆ దిక్కుమాలిన టీ.వీ.కి అతుక్కుపోయి, దానిలో వచ్చే పనికిమాలిన కార్యక్రమాలు కళ్ళు అప్పగించి చూడడం తప్ప! లేవండి, స్నానం చేసి తయారవ్వండి! మన బ్రెక్‌ఫాస్ట్, లంచ్ అన్నీ అక్కడే. పర్సులో అవసరమైన డబ్బు, ఎందుకైనా మంచిది మీ డెబిట్ కార్డ్ కూడా పెట్టుకోండి!”

నన్ను ఒక దులుపు దులిపేసి, ‘నా మాటే శాసనం’ అనే ఫక్కీలో విజయగర్వంతో తను రెడీ అవడానికి లోనికి వెళ్ళింది భవాని.  నా పాలిట అంత శుభసూచకంగా లేదు ఈ రోజు.  నేను లేచిన వేళా విశేషం. చేసేది లేక అమెను అనుసరించాను.

గాయత్రి జూనియర్ కాలేజీ మెయిన్ గేట్ పైన స్వాగతం పలుకుతోంది అరుంధతి మెట్రీమోనీ డాట్ కామ్ వాళ్ళ ఫ్లెక్సీ బానర్. లోపల ఖాళీ స్థలంలో పెద్ద షామియానా పెళ్ళిపందిరిలా వేసారు.  స్టేజి, మైక్, ఆహ్వానితులు కూర్చునేందుకు కుర్చీలు, ఎన్‌క్వైరీ కౌంటర్, రెజిస్ట్రేషన్ కౌంటర్, కాఫీ టిఫిన్ కౌంటర్  అన్నీ హంగులు ఉన్నాయి. మెయిన్ గేట్ దగ్గర మెట్రీమోనీ సంస్థ వ్యవస్థాపకురాలు, అరుంధతి దేవీ పట్టుచీర ధరించి, ఏడు వారాల నగలతో అమ్మోరులా ధగధగ మెరిసిపోతూ, చిరునవ్వుతో రెండు చేతులు సుతారంగా జోడించి వచ్చేవారిని లోనికి సాదరంగా ఆహ్వానిస్తోంది.  ఆమెకి ఇరువైపులా ఇద్దరు అమ్మాయిలు నిలబడి వచ్చేవారికి గులాబీ పువ్వు అందించి, వారిపై పన్నీరు జల్లి, లోనికి దారి చూపుతున్నారు.

మ్యూజిక్ సిస్టం నుంచి మంద్రస్థాయిలో మంగళవాద్యాలు వినిపిస్తున్నాయి. అక్కడ పెళ్ళికళ వచ్చేటట్లు హడావిడి చేస్తున్నారు.

"నమస్కారం! భీమశంకరంగారు, భవానీగారు. మీరు మా ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు చాలా సంతోషం. మీ అబ్బాయిలిద్దరూ కులాసాయేనా? మీ వాళ్ళిద్దరికీ సంబంధాలు కుదిరి, మాకు త్వరలోనే పెళ్ళి భోజనాలు పెట్టిస్తారని ఆశిస్తున్నాం. రండి ముందు బ్రేక్‌ఫాస్ట్ తీసుకోండి!" అని మొహమంతా నవ్వు పులుముకొని మమ్మల్ని లోనికి ఆహ్వానించింది అరుంధతి దేవి.

బ్రేక్ ఫాస్ట్ తిన్నది అరగడానికి, కాలేజీ గ్రౌండ్ అంతా ఒక రౌండ్ కొట్టాను. తెలిసినవారు కనబడినప్పుడు ముఖంపై చిరునవ్వు పులుముకొని 'కులాసానా! ఏమిటి విశేషాలు?' అనే పరస్పర పలకరింపులు జరిగాయి. మా ఆవిడ భవాని, అక్కడ ఉప్పొంగే మహిళా మహాసాగరంలో ఒక ఎగసే తరంగమై పోయింది. నా ఉనికి పూర్తిగా మరచి పోయింది. అక్కడి వాతావరణం పెళ్ళికి ఎదిగిన తమ పిల్లల పెళ్ళి సంబంధాల కోసం వచ్చిన పెద్దవాళ్ళు, కోడెకారు అమ్మాయిలు, అబ్బాయిలు ఫన్, హంగామా ఎంజాయి చేద్దామని వచ్చిన వారు, వచ్చినవారి వివరాలు తెలుసుకుంటున్న కార్యకర్తలుతోనూ అంతా ఆహ్లాదకరంగా ఉంది.

అరుంధతి మేట్రీమోనీ డాట్‌కామ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి టి. అరుంధతి దేవి స్టేజీ మీద మైక్ ముందు నిలబడి, సభను ప్రారంభిస్తూ ప్రసంగించింది. "గౌరవనీయులైన పెద్దలకు, సోదర సోదరీమణులకు, యువతీ యువకులకు అందరికి స్వాగతం పలుకుతూ, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. జీవిత భాగస్వాములను ఎన్నుకునే ఈ వివాహ పరిచయ వేదిక ఎన్నో వివాహ సంబంధాలు ఏర్పడడానికి గత పది సంవత్సరాలుగా తన వంతు కృషి చేస్తూ, మీ అభిమానాన్ని చూరగొంది. మీ సహకారంతో ఇక ముందు కూడా మీకు సేవలు అందించడానికి ఈ సంస్థ ఎప్పుడు సిద్ధంగా ఉంటుంది. ఇప్పుడు మన ముఖ్య అతిథి, మ్యారేజి రిజిస్ట్రార్, గౌరవనీయులు రాచకొండ రాజేశ్వరరావుగారు సభనుద్దేశించి మాట్లాడుతారు!" అని ఆమె క్లుప్తంగా ముగించింది.

రాజేశ్వరరావుగారు సభకి నమస్కరించి మాట్లాడుతూ, "గతంలో రిజిస్టర్డ్ మ్యారేజీలు అంటే ప్రేమ పెళ్ళిళ్ళు, వర్ణాంతర, కులాంతర, మతాంతర, సంకర వివాహాలు అనే చిన్న చూపు ఉండేది. కానీ సంప్రదాయ పద్ధతిలో జరిగే వివాహాలకు కూడా మా ఆఫీసు ఇచ్చే మ్యారేజి సర్టిఫికేట్ అవసరమవుతుంది. ఉదాహరణకి వివాహిత స్త్రీల ఆస్తి హక్కు, సక్సేషన్ మొదలైన అనేక సందర్భాలలో దీని అవసరం ఎంతైనా ఉంటుంది. ఇక్కడ ఉన్నవారి కోరికలు నెరవేరడానికి ఇటువంటి వివాహ పరిచయ వేదికలు దోహద పడ్తాయని, అందరికి శుభం కలగాలని మనసారా నేను కోరుకుంటున్నాను!" అని కరతాళధ్వనుల మధ్య అందరికి మరోసారి నమస్కరించి కూర్చున్నారు.

"ఒకప్పుడు పెద్దవాళ్ళు కుదిర్చిన సంబంధం, పెళ్ళి కొడుకు గురించి ఏమీ తెలియకుండా, తమ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా అమ్మాయిలు పెళ్ళి పీటల మీద తల వంచుకొని తాళి కట్టించుకునేవారు. రోజులు మారాయి. పెళ్ళి కావల్సిన అమ్మాయిలు, తమకి కాబోయే వరుడికి ఉండాల్సిన అర్హతలు, తమ అభిప్రాయాలు, పెళ్ళికొడుకు నుంచి తాము కోరుకునేవి అన్నీ కచ్చితంగా, కుండ బద్దలు కొట్టినట్లు చెప్తున్నారు. బహుశా అబ్బాయిలతో సమానంగా పెద్ద చదువులు

చదివి, ఉద్యోగాలు చేయడం, ఆర్థిక స్వేచ్ఛ కలిగి ఉండడమే కావచ్చు!" అన్నాడు నా పక్కనే కూర్చున్న ఒక పెద్ద మనిషి. నేను అంగీకార సూచకంగా తల పంకించాను.

మా ఆవిడ పక్కనే కూర్చున్న రిటైర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. మృణాళినిగారు, "పూర్వంలా ఆడవాళ్ళు వంటింటి కుందేళ్ళు కారు. పురుషులతో సమానంగా చదువుకొని వారు తమ కాళ్ళ మీద తాము నిలబడగలిగేలా ఆర్థిక స్వాతంత్ర్యం, స్వయం ప్రతిపత్తి కల్పించుకున్నారు. సంపాదనాపరులైన భార్యాభర్తల మధ్య ఎటువంటి పొరపొచ్చాలు, మాట పట్టింపులు వచ్చినా, అహంకారం అడ్డు రాకపోతే అవి త్వరలో సమసిపోయేవి. యథాతథంగా దైనందిన దాంపత్య జీవితం సాగిపోయేది. కుటుంబ గౌరవానికి పరువు ప్రతిష్టలకి విలువనిచ్చేవారు. పెద్దవాళ్ళ మాటలకి గౌరవం ఉండేది. పెళ్ళి పెటాకులై, విడాకులు తీసుకునే ప్రసక్తే ఉండేది కాదు!" అన్నారు.

"పెళ్ళి అయిన మూడో రోజే చిన్న మాటా మాటా వస్తేనే, పుస్తెలు పుటుక్కున తెంపి, అది కట్టిన మొగుడి మొహాన కొట్టి, టింగురంగా మని పుట్టింటికి వెళ్ళి పోతున్నారు ఈ కాలం వీర వనితలు. వారికి నచ్చచెప్పి, కాపురం నిలబెట్ట వలసిన తల్లిదండ్రులే, అమ్మాయిలకి వత్తాసు పలుకుతుంటే మరి వివాహ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా ఎలా ఉంటుంది!" అన్నది మరొక పెద్దావిడ.

"పెళ్ళిచూపులలో అమ్మాయిలు అబ్బాయిల్ని మీ ఇంట్లో వేస్ట్ బాక్సులు ఎన్ని అని అడుగుతున్నారు. వేస్ట్ బాక్సులు అంటే ఆధారపడిన తల్లిదండ్రులు, తోబుట్టువులు ఎంత మంది అని అర్థం. వాళ్ళ నుంచి వేరుగా ఉంటేనే పెళ్ళి జరుగుతుందనే సూచన!" అన్నారు రిటైర్డ్ రైల్వే ఉద్యోగి, దశరథ రామయ్య గారు.

"మంచి ఉద్యోగంలో ఉన్న అమ్మాయి పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతే, ఆమె సంపాదన తమకి దక్కకుండాపోతుందనే భయంతో కొందరు తల్లిదండ్రులు తమ అమ్మాయిల పెళ్ళి సంబంధాలు చూడకపోవడంతో, ఆ అమ్మాయిలు నడి వయస్సుకి చేరుకొని, తర్వాత వృద్ధకన్యలుగా మిగిలిపోతున్నారు!" అన్నారు విశ్రాంత కాలేజి ప్రిన్సిపాల్ సూర్యనారాయణగారు.

"ఉష్! నిశ్శబ్దంగా ఉండండి! పెళ్ళి కాబోయే అమ్మాయిలు, అబ్బాయిలు తమ అభిప్రాయాలు చెప్పడానికి స్టేజి మీదకు వస్తున్నారు. వాళ్ళు ఏం చెప్తారో విందాం!" అన్నారు నా ముందు వరుసలో కూర్చున్న సీనియర్ జర్నలిస్ట్, జనార్ధనరావుగారు.

ఝాన్సీరాణి అనే అమ్మాయి మొదట మాట్లాడుతూ, "ఆడపిల్ల పుట్టడమే శాపమని భావిస్తూ, భార్యాభర్తలు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని, పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తే, భ్రూణహత్యకు పాల్పడడంతో కాలక్రమంలో దేశంలో అమ్మాయిల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని సామాజిక శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మగపిల్లాడు ముద్దు, ఆడపిల్ల వద్దు అనుకుంటే ఎలా? మగపిల్లాడు వంశోద్ధారకుడు, పున్నామ నరకం నుంచి తప్పించేవాడయితే, అసలు ఆడపిల్లలే లేకపోతే, మగపిల్లాడు పుట్టేదెలా? వంశవృద్ధి జరిగేదెలా? పెళ్ళిళ్ళు జరిగేదెలా?" అని ఆవేశంగా ప్రశ్నించింది.

"అమ్మాయిల కొరత ఏర్పడితే, విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటారులే!" అని సభలో నుంచి ఎవరో అరిచారు.

"అప్పుడు ప్రతి కుటుంబం సంకరమై, దేశం నానాజాతి సమితిగా ఏర్పడుతుంది!" అంది ఆ అమ్మాయి.

జ్యోతిర్మయి అనే అమ్మాయి స్టేజి మీదకు వచ్చి, "ఒక స్త్రీ రాత్రి వేళ వీధిలో ఒంటరిగా నడవడం క్షేమం అని భావించినప్పుడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టు అన్నారు మహాత్మా గాంధీ! దేశానికి స్వాతంత్ర్యం వచ్చి డెబ్బయి సంవత్సరాలైనా, స్త్రీలు నిర్భయంగా రోడ్డు మీద రాత్రివేళ నడవగలిగే పరిస్థితులు ఉన్నాయా?" అని ప్రశ్నించింది.

"నేడు ఏ దినపత్రిక లేక టీవీ ఛానల్ చూసినా స్త్రీలపై అత్యాచారాలు, మానభంగాలు, పరువు హత్యల వార్తలు దర్శనమిస్తాయి. మనం సభ్య సమాజంలో ఉన్నామా, లేక అనాగరిక రాతి యుగంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతుంటుంది. కన్నెపిల్ల అయినా, వివాహిత అయినా స్త్రీకి రక్షణ ఎక్కడ ఉంది? పురుషాధిక్య సమాజంలో స్త్రీకి అన్ని రంగాలలో సమాన హక్కు ఎక్కడ ఉంది?" అని నిలదీసింది రంజిత అనే ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.

వివాహ పరిచయ వేదిక ప్రధాన విషయం, వధూవరులు ఒకరి గురించి మరొకరు తెలుసుకోవడం లేక వాళ్ళ పెద్దవాళ్ళు పెళ్ళి సంబంధాలు కుదుర్చుకోవడం అన్నది దారి మళ్ళుతున్నది. కాలం గడిచిపోతోందని గ్రహించిన, అరుంధతి దేవి లేచి, "ఇప్పటికే చాలా కాలాతీతమయింది. అసలు విషయంలోకి వద్దాం. ఈ చర్చ ఇలా కొనసాగుతుంటే ఈ వేదిక ఉద్దేశ్యం నెరవేరక, సభ రసాభాస అయ్యే అవకాశం ఉంది. సభ సజావుగా సాగడానికి, దయ చేసి అందరు సహకరించండి. ఇక అసలు విషయంలోకి వద్దాం. వధూవరులను ఒకొక్కరిని స్టేజి మీదకు మా సెక్రటరీ మంజులతగారు పిలుస్తారు. క్లుప్తంగా మీ పరిచయం, మీ విద్యార్హతలు, చేస్తున్న ఉద్యోగం లేక స్వయం ఉపాధి, ఆదాయం, కాబోయే మీ జీవిత భాగస్వామిలో మీరు కోరుకునేవి ఐదు నిముషాలు మించకుండా చెప్పి, తర్వాత వాళ్ళకి అవకాశమివ్వండి!" అని సెక్రటరీకి సైగ చేసింది.

మంజులతగారి ఆహ్వానంపై ఒక యువకుడు స్టేజి మీదకు వచ్చాడు. "అందరికీ నమస్కారం. నా పేరు ఉదయకిరణ్. బెంగళూరులో ఒక ఎం.ఎన్.సి.లో ప్రాడక్ట్ మానేజర్‌గా పని చేస్తున్నాను. మాది చిన్న ఫామిలీ. అమ్మా, నాన్న, అన్న, నేను మొత్తం నలుగురం. అన్న నోయిడాలో ఒక కొరియన్ కారులు తయారు చేసే కంపెనీలో టెక్నికల్ మానేజర్‌గా ఉన్నాడు. అతనికి వివాహమయింది. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి కూడా ఉన్నారు. నాన్నగారు స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియాలో ఏ.జి.ఎమ్‌గా చేసి రిటైరైన తర్వాత, హైదరాబాద్‌లో సెటిలయ్యారు. అమ్మ నాన్నగారు అక్కడే ఉంటారు."

"నేను ప్రస్తుతం ముప్పై లక్షల ప్యాకేజిలో ఉన్నాను. బెంగళూరులో ఒక గేటెడ్ కమ్యూనిటీ త్రీ బెడ్ రూమ్ ఫ్లాట్‌లో ఉంటున్నాను! నామీద ఆధారపడినవారు ఎవరూ లేరు. మా ఇంట్లో కొందరు అమ్మాయిలు భావిస్తున్నటువంటి వేస్ట్ బాక్సులు ఏమీ లేవు. కానీ మా కుటుంబంలో కలిసిపోయే అమ్మాయిని నేను జీవిత భాగస్వామిగా కోరుకుంటున్నాను! వివాహం అయ్యాక, ఆమె బెంగళూరులో నాతో ఉండాలి. అమె ఉద్యోగం చెయ్యాలనుకుంటే చెయ్యవచ్చు! నాకు పిల్లలంటే ఇష్టం. నాకు కాబోయే భార్య కూడా పిల్లలు ఉండాలనుకోవాలి. పిల్లలు పుట్టాక ఉద్యోగం చేయడమా లేక మానడమా అన్నది ఆమె ఇష్టం!" అని అతడు స్టేజి దిగి పోయాడు.


"ఆ ఝాన్సీరాణినో, ఆ జ్యోతిలక్ష్మినో పెళ్ళాడి ఇద్దరూ కలిసి గంపెడేసి పిల్లల్ని కనండి! ఆడపిల్లల తగ్గిపోతున్నారనే వారి గోల తగ్గించి, ఆ కొరత తీర్చండి!" అంది ముందు వరుసలో ఉన్న ఒక బామ్మగారు.

"జ్యోతిలక్ష్మి కాదే, జ్యోతిర్మయి ఆ అమ్మాయి పేరు. ఆ సెక్రటరీ చెప్పింది కదా.. స్టేజి మీదకు వచ్చిన వాళ్ళే మాట్లాడాలి, మనం మధ్యలో మాట్లాడకూడదు. మరో మాట నీ నోట వచ్చిందంటే, మర్యాద పోగొట్టుకొని మనం బయటకు

నెట్టివేయబడతాం. మన మనవడికి ఏదైనా మంచి సంబంధం కుదురుతుందేమోనని మనం ఇక్కడకు వచ్చాం. అది మర్చిపోకు!" అని ఆమె పక్కనే కూర్చున్న తాతగారు అమెను మందలించారు.
బంగారు తీగ లాంటి స్వర్ణలత అనే అమ్మాయి స్టేజి మీదకు వచ్చి, "నా తల్లిదండ్రులకు నేను ఒక్కర్తినే సంతానం. వాళ్ళు నన్ను విడిచి ఉండలేరు. నాకు ఈ ఊళ్ళోనే ఉద్యోగం. కాబోయే వరుడు వేరే చోట ఉద్యోగం చేస్తుంటే నాతో కలిసి ఉండాలనుకుంటే, ఇక్కడే ఉద్యోగం చూసుకోవాలి. పెళ్ళి అయ్యాక కూడా నా తల్లిదండ్రులు నాతోనే ఉంటారు. నా సంపాదన నా ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెడతాను. నన్ను, నా తల్లిదండ్రులను పోషించవలసిన బాధ్యత, ఇంటి ఖర్చు నాకు కాబోయే భర్తదే. ఈ షరతులకు అంగీకరించిన వ్యక్తితోనే నా వివాహం జరుగుతుంది!" అని తప్పుకుంది.
యువతీ యువకులు ఇలా తమకు కాబోయే జీవిత భాగస్వాములలో తాము కోరుకునే అర్హతలు, తమ అభిప్రాయాలు, షరతులు తెలియజేశారు. కొందరు యువకులు.. పెళ్ళైన వెంటనే భార్య తమ తల్లిదండ్రులు తమతో ఉండకూడదంటే, వారు వృద్ధాప్యంలో ఏ వృద్ధాశ్రమాన్నో వెతుక్కోవాల్సిందే అన్నారు. తమని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను తాము వృద్ధాశ్రమాలకు పంపలేమని, అటువంటి పెళ్ళికి తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. కొందరు విద్యాధికులైన యువతులు తమకు రెండు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు ఉన్నాయి కనుకు, కాబోయే వరునికి తమకంటే ఒక డిగ్రీ ఎక్కువ ఉండాలని అన్నారు. మరి కొందరు అమ్మాయిలు తమకు నెలకు ఒక లక్ష రూపాయలు జీతమనీ, కాబోయే వరునికి కనీసం దాని కంటే యాభై వేలు ఎక్కువ జీతం ఉండాలన్నారు. ఎక్కువమంది అమ్మాయిలు తమకు కాబోయే వరుడు గవర్నమెంట్ ఉద్యోగి, బ్యాంక్ ఆఫీసర్ లేక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యుండాలని కోరుకున్నారు.
చివరిగా మధుమిత అనే అమ్మాయి స్టేజి మీదకు వచ్చి, "నేను యమ్.బి.బి.యస్. పూర్తి చేసి, ప్రస్తుతం యమ్.డి. చేస్తున్నాను. వివాహాలు స్వర్గంలో నిర్ణయించబడినా, అవి జరిగేది భూమి మీదనే. మన జీవితాలను స్వర్గతుల్యం చేసుకోవడమో లేక నరకప్రాయం చేసుకోవడమో అన్నది మన చేతులలోనే ఉంది. ఒకరి అభిప్రాయాల్ని, మనోభావాల్ని మరొకరు గౌరవిస్తూ, ఒకరి ఆశయాలనీ, ఆకాంక్షలనీ మరొకరు గుర్తించి, వాటిని గౌరవిస్తూ, అహంకారాన్ని విడిచి, పరస్పర అవగాహనతో సంసారంలో సర్దుకుపోవటంలోనే దాంపత్య జీవిత మకరంద రసాస్వాదన ఉంది. మన జీవితాలకు సంబంధించిన నిర్ణయాలు మనమే తీసుకున్నా, జీవితానుభవసారంతో పెద్దలు చెప్పే మాటలకు విలువనివ్వాలి. వైవాహిక జీవితంలో సహజంగా ఏర్పడే చిన్న చిన్న భేదాభిప్రాయాలు, వివాదాలు చిలికి చిలికి గాలివానగా పరిణమించకుండా, వివాహ విచ్ఛిత్తికి కుటుంబ అధోగతికి కారణమవకుండా జాగ్రత్త పడాలి!! మన జీవితాలకు బంగారు బాటను మనమే వేసుకోవాలి!! నేను నా జీవితంలోకి అటువంటి భాగస్వామినే ఆహ్వానిస్తున్నాను!" అని స్టేజి మీద నుంచి అందరి హర్షధ్వానాల మధ్య నిష్క్రమించింది.
"అహా! ఏం అమ్మాయండి! రూపం, గుణం, పలుకు అంతా బంగారం. ఏ యింటి కోడలవుతుందో ఆ యింటివారు అదృష్టవంతులు!" అంది భవాని.
"అయితే, మన పెద్దవాడికి జోడీగా కుదురుతుందేమో, నీ అదృష్టాన్ని కూడా పరీక్షించుకోవడానికి ప్రయత్నించు. భోజనం చేద్దాం పద" అని లంచ్ కౌంటర్ వైపు కదిలాను.

***0***

# ఉర్రేయ్ కుంభెం ఆగు...



వసుంధర

(రచన మాసపత్రిక- ఏప్రిల్, 2011)

ఆదివారాలు ఉదయం తొమ్మిదికి ఈటీవిలో బొమ్మల కథగా వచ్చే పంచతంత్రం రామానికిష్టం. పనుల టైమని భార్య చెప్పినా ఎలాగో ఓ అరగంట వీలు చేసుకోమంటాడు. కానీ సరిగ్గా అప్పుడే ఫోన్లూ, కాలింగ్ బెల్సూ. పనిమనిషి హడావుడీ అప్పుడే. ఎలాగో అన్నింటినీ అధిగమించిన రోజున కరెంటు పోతే- భార్య బాధ్యతగా ఇంటి పనుల్లోకి వెళ్ళిపోయింది. నిరాశ తట్టుకోలేక గుమ్మంలోకెడితే ఎదురింటి గేటు బయట శతభిషం. నాలుగేళ్ల మనుమడు నవీన్ యక్షప్రశ్నలకి దిక్కుతోచని ఆయనకి రామం తరణోపాయం కాగా- చిరునవ్వుతో పలకరించాడు. ఎదురింట్లో వాళ్ల రాకకి శతదినోత్సవం దగ్గిర పడుతున్నా- రామానికి మాత్రం అదే ఫస్ట్ షో.

శతభిషం రిటైరై మూడేళ్లయింది. మంచి పెన్షన్. స్వగ్రామంలో స్థిరపడాలన్న సంకల్పాన్ని నవీన్ బాధ్యత తాత్కాలికంగా వాయిదా వేసింది. కొడుకు సూర్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కోడలు ప్రీతి స్కూల్ టీచరు. వాళ్ల ఒక్కగానొక్క కొడుకు నవీన్. వాడి ఆలనాపాలనా చూసుకునే తీరిక, ఓపిక తలిదండ్రులకి లేవు. అందుకని అది తాత, బామ్మల బాధ్యత అయింది.

ఆయన చెప్పడం పూర్తి కాగానే రామం తన గురించి వీలైనంత క్లుప్తంగా చెప్పి హడావుడిగా పంచతంత్రం గురించి వాపోయాడు.

"ఇప్పుడంతా ఇంగ్లీషు మీడియం. కార్టూన్ నెట్‌వర్క్ చూసే పిల్లలకి పంచతంత్రం ఏమర్థమౌతుంది?" పెదవి విరిచాడు శతభిషం. మనకర్థమౌతుంది కాబట్టి పిల్లలకి చెప్పొచ్చని రామం అంటే, "అంత టైం మనకెక్కడిదీ- కార్టూన్ నెట్‌వర్కైతే మన జోలికి రాకుండా వాళ్లు టివి ముందు కూర్చునుంటారు. మనం హాయిగా మన పనులు చేసుకోవచ్చు" అంటూ ఆధునిక దృక్పథాన్ని ప్రతిఫలించాడు. అంతలో కరెంటొచ్చినట్లు రెండిళ్లనుంచీ సంకేతాలందగా, "రారా నన్నూ- టామ్ అండ్ జెర్రీ చూదువుగాని" అంటూ శతభిషం మనుమణ్ణి లోపలకి లాక్కెళ్లబోయాడు. వాడు విడిపించుకుని, "ఈ తాతయ్యతో పంచతంత్రం చూస్తా" అన్నాడు. ఆయన తటపటాయిస్తే, "మీకేమో వేరే పనులున్నాయి. నాకేమో వేరే పని లేదు.

ఉభయతారకంగా ఉంటుంది, రానీండి" అన్నాడు రామం. మాట పూర్తయ్యేలోగా నవీన్ పరుగున వచ్చి ఆయన చెయ్యి పట్టుకున్నాడు.

ఇద్దరూ ఇంట్లోకొచ్చాక రామం టివి దగ్గిరకి నడవబోతే, "సగంనుంచేం చూస్తాం. వచ్చే ఆదివారంనుంచి చూద్దాం. ఇప్పుడు కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు నవీన్ చొరవగా. వాడితో తనకి కబుర్లేమిటని ఆయననుకున్నాడు కానీ మొదలెట్టాక టైమే తెలియలేదు. ఎప్పుడు జాయినైందో రామం భార్య కూడా వాళ్లతో కలిసింది.

నవీన్ పూర్తి పేరు వీరవెంకటసత్యసూర్యఆంజనేయసుబ్రహ్మణ్యగోపాల సంతోషి నవీన్‌ట. మొక్కుబడిగా అన్ని పేర్లెట్టి స్కూల్లో ఉత్త నవీన్ అని వేశారుట. మళ్లీ పిలవడానికి నన్నూ అని వేరే పేరుట. తన మూలాన ఇంట్లో ఎవరికీ క్షణం తీరుబడుండడంటారుట కానీ తనతో ఒక్కరూ మాటాడరుట. పోనీ వాళ్లకి సాయం చేద్దామనుకుంటే- వాళ్లు చేస్తే పనిట, వాడు చేస్తే అల్లరిట. అల్లరెక్కువైందని స్కూల్లో వేసారుట. తనకి ఆడుకోవాలనుందని ఏడుస్తున్నా వినకుండా స్కూలుకి పంపేస్తారుట.

స్కూలు వాళ్లేమో అక్కడ కాసేపు ఆటలాడించి, కాసేపు పడుకోబెట్టి, తర్వాత హోంవర్కిచ్చి ఇంటికెళ్లాక పెద్దవాళ్లకిలాగే తనకీ టైం లేకుండా చేస్తున్నారుట.
"స్కూల్లో చదువుకోవాలా, ఆడుకోమంటారు. ఇంట్లో ఆడుకోవాలా, చదువుకోమంటారు. నా ఇష్టమొచ్చినట్లు నేనుండడానికి ఎప్పటికి పెద్దౌతానో ఏమిటో" అని రెండు చేతులూ తిప్పుకుంటూ హావభావాలు మార్చుతూ- నన్నూ వాపోతే- రామానికి వాడిలో రమణ-బాపుల బుడుగు కనిపించాడు. ఈలోగా శతభిషం వచ్చి, "వీడల్లరి క్షణం భరించలేం. శలవొస్తే మా అందరికీ గుండెల్లో రాళ్లే. మీకెందుకులెండి అవస్థ" అంటూ వాణ్ణి తీసుకెళ్లబోయాడు. రామం వారించి, "పిల్లలకి అల్లరే అందమని వందలేళ్ల క్రితం పోతన భాగవతంలోనూ, యాభై ఏళ్లక్రితం రమణ బుడుగులోనూ ఘోష పెట్టారు. బుడుగు పుస్తకం ఇస్తాను. మీరు చదివి, మీ వాళ్లచేత చదివించి, నన్నూకి వినిపించండి" అన్నాడు. మాట పూర్తయ్యేసరికి రామం భార్య ఆ పుస్తకం తెచ్చి ఆయనకిచ్చింది.

ఆ తర్వాత నాలుగు రోజులకి కాబోలు రామం టివిలో దక్షిణాఫ్రికా వెస్టిండీస్‌ల మధ్య వరల్డ్‌కప్ మాచ్ చూస్తూ మధ్యమధ్య న్యూస్ ఛానెల్స్ పెడుతున్న సమయంలో- నన్నూని తీసుకొచ్చాడు శతభిషం. పుస్తకం చదవడమైపోయిందిట. మరికొన్ని రోజులు ఉంచుకోవచ్చంటే మళ్లీమళ్లీ చదువుతారుట. "బుడుగు నచ్చేశాడు. నేనూ బుడుగునైపోతా" అన్నాడు నన్నూ.

"ఆ రోజులు వేరు. ఈ పోటీ యుగంలో పిల్లలకి అలా ఉండడం ఎలా కుదురుతుందీ?" అన్నాడు శతభిషం తల అడ్డంగా ఊపి.
"పోటీ మా పిల్లల టైముకే వచ్చేసింది. బుడుగు ప్రభావం పడి నేను మాపిల్లల్ని చిన్నప్పట్నించీ చదువు పేరు చెప్పి ఊదరకొట్టేయలేదు. వాళ్లు బాల్యాన్ని ఎంజాయ్ చేస్తూనే సాటి పిల్లలతో సమంగా జీవితంలో పైకొచ్చారు. ఐనా కూడదంటే మనం రమణకో విన్నపం చేద్దాం. బుడుగుని ఇప్పటి వాతావరణంలో ఇముడ్చుతూ ఓ కథ వ్రాయమని" అన్నాడు రామం.
"భలే భలే అలాగే చేద్దాం" అంటూ చప్పట్లు కొట్టాడు నన్నూ.

సరిగ్గా అప్పుడే టివి తెరమీద రమణ రూపం. ఏదో సభలో మొహమాటంగా కూర్చునున్నారాయన. రామం మహదానందపడి, "అరిగో- ఆ తాతయ్యే అప్పటి బుడుగు కథ వ్రాశారు. ఇప్పటి బుడుగు కథ వ్రాయమని కూడా అడుగుదాం" అన్నాడు నన్నూతో. అంతలో రమణ రూపం మాయమై పేరెవరో వచ్చి రమణ గురించి ఏదో చెబుతున్నారు..

"ఉర్రేయ్ కుంఖెం ఆగు" అన్నాడు నన్నూ కంగారుగా రమణ నుద్దేశించి.

అప్పటికి రామానికి రమణ రూపం టివిపై ఎందుకు కనిపించిందో ఆయన గురించి ఏం చెబుతున్నారో తలకెక్కింది. అప్రయత్నంగా, "ఉర్రేయ్ కుంఖెం ఆగు" అన్నాడు ఆక్రోశిస్తున్నట్లు. అప్పుడాయన అరపైల్లో రామంలా కాక ఆరు లోపు బుడుగులా ఉన్నాడు.

మార్చి 1, 2011

వసుంధర

***0***



# వినదగునెవ్వరు చెప్పిన ..

“కథా మంజరి”లో 'ఉపజ్ఞ' చదవడం మా అదృష్టం. అది కథలంత అనుభూతినీ ఇచ్చింది.

మీ శైలి ఎవరికీ అనుకరణ కాదు. మీది మీదే! ఐనా చదువుతుంటే, ముళ్లపూడి, పురాణం గుర్తొచ్చారు - ఐశ్వర్య (బచ్చన్) ని చూస్తే, రేఖ గుర్తొచ్చినట్లు! మాకు సంబంధించి - అలనాటి సిలోన్ ఉదయం 7 గంటల (వాద్యసంగీత్, ఏక్ హీ ఫిల్మ్ సే గీత్) కార్యక్రమాల అనుభూతి -- మీకూ మాకూ సామ్యం. మీ ఎత్తు మీకు తెలుసు. అది మీకు గర్వకారణమని అందామంటే - మీ మాటల్లో ఎక్కడా గర్వానికి చోటివ్వరే! తెలుగు సాహితి మిమ్మల్ని చూసి గర్విస్తోంది. మీ తాకిడితో “కథా మంజరి” ధన్యమైంది. ఉపజ్ఞ మీకు దైవదత్తం. దానికి ఇంతవరకూ ఎంతో న్యాయం చేశారు. ఇంకా ఇంకా చెయ్యాలని కోరే మీ అభిమానుల్లో మేమూ ఉన్నాం.

శుభాకాంక్షలతో

వసుంధర, హైదరాబాదు

“కథా మంజరి” విశిష్ట అతిధి మెడికో శ్యామ్ రచన ఉపజ్ఞ ఇప్పుడే చదివాను. చదివిన తర్వాత కొద్ది క్షణాలు అనిర్వచనీయమైన అనుభూతిని లోనవడం జరిగింది. ఆద్యంతం splendid... మాటల్లో చెప్పలేని వ్యక్తీకరణ.. నేను గత కొద్ది ఏళ్లలో చదివిన గొప్ప రచన ఇది. తెలుగు సాహిత్య ప్రపంచంలోని సుప్రసిద్ధ కథా రచయితలు , కవులు అందరినీ చాప చుట్టేసి అంతఃకరణ లోని భావాలు నిస్పష్టంగా వెలిబుచ్చిన శైలి నాకు బాగా నచ్చింది. ఇందులో శ్యామ్ పేర్కొన్న రచయితలు అందరూ నాకు ఇష్టమైన రచయితలే కావడం ఒక విశిష్టత. ప్రస్తావించిన రెండు ఘటనలు నాకు నచ్చాయి. ఒకటి చాసో గారితో...రెండవది గురువు గారు భరాగో గారితో. అద్భుతం బావుంది... అబ్బే సరిపోలేదు. చాలా బావుంది .... ఇదే సరిపోలేదు. ఇంతకన్నా బాగా express చేసే మాట దొరికితే బావుణ్ణు.

పై. జగపతి, రాజమండ్రి

మీ "కథా మంజరి" జనవరి సంచిక చాలా బాగుంది - మా మెడికో
శ్యాం పరిచయం ఇంకా బాగుంది. అభినందనలు
ముకుంద రామారావు, హైదరాబాదు

క్రితం సంవత్సరం జులై లో మొదలై, ఈ సంవత్సరం జనవరి వరకు ఏడు సంచికలు చాలా సమర్ధవంతంగా, ఒక కొత్త పంథాలో, కేవలం చిన్న కథలకు పెద్ద పీట వేస్తూ వెలికి తెచ్చిన సంపాదకునిగా జయంతి ప్రకాశం శర్మకు, ప్రచురణ కర్త అయిన అవసరాల వెంకటరావు గారికి, ఈ యజ్ఞంలో పాలు పంచుకున్న తదితరులకు నా అభినందనలు. నెల నెలా పదేసి మంచి కథలు ఎంపిక చేసి, ఠంచనుగా నెల మొదట్లో పత్రికను విడుదల చెయ్యడం సులభమైన విషయమేమీ కాదు.

అన్నిటికంటే నాకు నచ్చిన విషయం ఇద్దరు ప్రసిద్ధ కథకుల్ని పరిచయం చెయ్యడం. ద్విభాష్యం రాజేశ్వరరావు గారితో మొదలై, జనవరి 2021 సంచికలో మెడికో శ్యామ్, కొడవటిగంటి వరకూ సంచికకు ఇద్దరు చొప్పున - ఒకరు కథలు ఎంపిక చేసే విశిష్ట అతిథిగానూ, కథా మార్గదర్శిగా మరొకరిని, పాఠకుల ముందుంచాలనే ఆలోచన, వారి గురించి క్లుప్తంగానైనా రాయడం మెచ్చుకోదగింది. ప్రస్తుత తరానికి మెడికో శ్యామ్, కొడవటిగంటి, ఇద్దరూ దూరమే, ఒకరు కొంచమైతే ఇంకొకరు ఇంకానూ. ఆవిధంగా ఇద్దరి గురించీ చెప్పడం కొత్త తరానికి చేస్తున్న పరిచయమైతే, పాత తరాలకు మరోసారి గుర్తు చెయ్యడం జరుగుతోంది. పత్రికకు మరొక్కసారి అభినందనలు.

కథా మార్గదర్శిగా పరిచయం చేస్తున్న కథకుడు రాసిన ఒక మంచి కథ కూడా ఒకటి వేస్తే బాగుంటుందేమోనని అనిపిస్తోంది. విశిష్ట అతిథి వ్యాసాన్ని ఒక లింకు ద్వారా ఏవిధంగా పాఠకులకు ఇవ్వగలిగారో, స్థలాభావ సమస్యలు రాకుండా అదేవిధంగా అందివ్వచ్చునేమో ఆలోచించండి.

కథా మంజరి మంచి కథలను అందిస్తూ, మంచి కథా రచయితలను పరిచయం చేస్తూ, అందుబాటులో వున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాఠకులకు కాణీ ఖర్చులేకుండా అందిస్తూ భావి తరాలకు మార్గదర్శకంగా పది కాలాల పాటు విజయవంతంగా ముందుకు మున్ముందుకు సాగిపోవాలని ఆశిస్తూ...

శాయి రాచకొండ

***0***

సంచిక పై మీ అభిప్రాయాలనూ, సూచనలనూ

మాకు తెలియచేయండి.

info@kathamanjari.in

కథా ప్రియులైన

మీ మిత్రులను

కథా మంజరి కి

పరిచయం చేయండి

నమస్కారం

